fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 75 | విజయవాడ, శనివారం 17 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

రేపు అర్ధరాత్రి నుంచి ఊబర్, ఓలా డ్రైవర్ల సమ్మె



ముంబయి : ఊబర్, ఓలా డ్రైవర్లు రేపు అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు మహారాష్ట్ర నవనిర్మాణ వాహటక్ సేనకు చెందిన సంజయ్ నాయక్ తెలిపారు. ముంబయి, న్యూఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పూనే తదితర ప్రముఖ నగరాలలో డ్రైవర్లు సమ్మె చేయనున్నట్లు ఆయన చెప్పారు. మహారాష్ట్ర నవ నిర్మాణ వాహటక్ సేన ఈ సమ్మెకు నేతృత్వం వహిస్తుంది. ఓలా, ఊబర్ సంస్థలు డ్రైవర్లకు పెద్దపెద్ద హామీలు ఇచ్చిందని, కాని నేడు ఖర్చులు భరించలేని స్థితికి మిగతా 9లో




దలాల్ స్ట్రీట్‌కు 'అవిశ్వాస' సెగ

- కుప్పకూలిన మార్కెట్లు
- సెన్సెక్స్ 510 పాయింట్లు ఫట్
- 10,200 దిగువకు నిఫ్టీ
- నాలుగో రోజూ క్షీణత

6

బిజెపి కుయుక్తులు... టిడిపి యు టర్న్



అవిశ్వాసంపై వ్యూహ ప్రతివ్యూహాలు

అనుమానాలు నిజమైనాయి. అనుకున్నంతా జరిగింది. నరేంద్రమోడీ ప్రభుత్వంపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు రానీయకుండా లోక్‌సభలో బిజెపి కుయుక్తులకు దిగింది. తీర్మానానికి అనుకూలంగా సరిపడా సంఖ్యాబలం ఉన్నప్పటికీ చర్చకు ససేమిరా అంది. సభలో గందరగోళ పరిస్థితులు ఉన్నా ఆర్థిక బిల్లుతో అనేక కీలక బిల్లులను ఆమోదింపచేసుకున్న కేంద్ర ప్రభుత్వం అవే పరిస్థితులను సాకుగా చూపుతూ అవిశ్వాసాన్ని చర్చకు రానీయకుండా అడ్డుకుంది. 'గందరగోళ పరిస్థితులు ఉంటే చర్చను చేపట్టలేం' అంటూ స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు వైసిపి ప్రతిపాదించిన అవిశ్వాసానికి మద్దతు ఇస్తామంటూ ప్రకటించిన తెలుగుదేశం పార్టీ యు టర్న్ తీసుకుంది. దొంగల పార్టీకి మద్దతెలా ఇస్తామని ప్రశ్నించింది. విడిగా మరో అవిశ్వాస తీర్మానా నికి నోటీస్ ఇచ్చింది. దీంతో రాష్ట్ర ఎంపీలంతా ఒకే తాటిపై లేరన్న సంకేతాలు జాతీయస్థాయిలో వెళ్లాయి. సభ వాయిదా పడటంతో మళ్లీ నోటీస్‌లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిజెపి వైఖరి నేపథ్యంలో సోమ వారమైనా అవిశ్వాసం చర్చకు వస్తుందా అన్నది అనుమానాస్పదంగా మారింది.

అడ్డుకున్నారు ...!

చర్చకు నో అన్న స్పీకర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయానికి నిరసనగా నరేంద్రమోడీ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బిజెపి అడ్డుకుంది. చర్చకు సరిపడా సభ్యులు లేచి నిలబడి మద్దతు తెలుపుతున్నప్పటికీ ససేమిరా అంది. కొద్దిమంది సభ్యులు చేస్తున్న ఆందోళనను సాకుగా చూపుతూ చర్చకు నిరాకరించి సభను వాయిదా వేసింది. ఈ ఏకపక్ష చర్య పట్ల ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. వైసిపి తీర్మానానికి మద్దతిస్తామని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ శుక్రవారం తన వైఖరిని మార్చుకుని విడిగా మరో నోటీస్ ఇచ్చింది. ఉదయం 9గంటల ప్రాంతంలో ఎంపి తోట నరసింహం టిడిపి తరపున అవిశ్వాస తీర్మానాన్ని లోకసభ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో అందచేశారు. శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన ఎంపిలు నాగేంద్ర ప్రతాప్ సింగ్ పటేల్(ఎస్పీ), ప్రవీణ్ కుమార్ నిషాద్(ఎస్పీ), సర్ఫారాజ్ ఆలం(ఆర్జేడి) ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఇటీవలి మిగతా 2లో

సొంతంగానే అవిశ్వాసం

మారిన టిడిపి వైఖరి : బిజెపితో తెగతెంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవిశ్వాస తీర్మానం విషయంలో తెలుగుదేశం పార్టీ వైఖరి మారింది. వైసిపి ప్రతిపాదించే తీర్మానానికి మద్దతిస్తామని గురువారం రాత్రి ప్రకటించిన ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శుక్రవారం దీనికి భిన్నమైన వైఖరిని తీసుకున్నారు. 'దొంగల పార్టీకి మద్దతిస్తే తప్పుడు సంకేతాలు వెడతాయి' అన్న ఆయన మోడీ ప్రభుత్వంపై టిడిపి సొంతగా అవిశ్వాసతీర్మానాన్ని పెడుతుందని ప్రకటించారు. అంతకుముందు ఉదయం నుండి అమరావతిలోని చంద్రబాబు నాయుడి నివాసంలో ఆసక్తికరమైన పరిణామాలు చోటుసుకున్నాయి. తెల్లవారు జామునుండే ఆయన పార్టీనేతలతోనూ, ఎంపీలతోనూ చర్చలు ప్రారంభించారు. వైసిపి పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి లభిస్తున్న మద్దతు. ప్రజల్లో వస్తున్న స్పందన తదితర అంశాలపై చర్చించారు. టిడిపిని దెబ్బతీసే కుట్ర జరుగుతోందంటూ ఎన్‌డిఎ కూటమితో తెగతెంపులు చేసుకోవాలన్న నిర్ణయాన్ని ప్రకటించారు. వాస్తవానికి కొద్దిరోజులుగా ఈదిశలో మిగతా 9లో

ముందే తెలుసు..

బిజెపి తీరుపై చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి నిధులివ్వడంలోను, ప్రత్యేక హోదా, విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలోనూ కేంద్రం నుంచి ఇబ్బందులు వస్తాయని తనకు ముందే తెలుసని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలిలో ఆయన మాట్లాడుతూ మాట తప్పిన కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో చులకన భావం ఏర్పడిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర అప్పు లక్ష ముప్పై వేల కోట్లకు పైగా ఉందని, ఉమ్మడి అప్పుకు సంబంధించిన వడ్డీ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. కేంద్రం ఇచ్చిన హామీలపై ఇప్పటి వరకు 29 సార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిస్తే, కలిసిన ప్రతిసారి గట్టిగా, గౌరవంగానే అడిగానన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలనే కేంద్రం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సర్వీస్ సెక్టార్‌లో ఎక్కువ మొత్తంలో ఆదాయం వస్తుందని, ప్రముఖ నగరాల ద్వారానే ఇది సాధ్యమవుతుందని, కానీ మిగతా 9లో



డబ్బు ఏమవుతోంది..?

ఎపిలో బ్యాంకింగ్ తీరుపై విచారణకు సిద్ధమైన కేంద్రం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంకుల్లో డబ్బులేవ్.. ఎటిఎంలు ఖాళీ అయ్యాయి... ఈ పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దేశంలో మిగతా రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువ నిధులు వెళ్లగా, అవేవీ ప్రస్తుతం బ్యాంకుల్లో కనిపించకపోవడానికి కారణాలేమిటో పరిశీలించాలని కేంద్రం నిర్ణయిం చింది. పంపిన సొమ్ము పంపినట్టే పోతోందని, ఎవరి చేతుల్లోకి వెళ్లిందో కూడా తనిఖీ చేయాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలోని ఈ పరిస్థితిపై బిజెపి నాయకత్వమూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతు న్నాయని, డబ్బు కొంతమంది చేతుల్లోకి వెళ్లిపోతోందని, దీన్ని విచారించి సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఎటిఎంల్లో డబ్బు లేకపో వడంతో కేంద్రంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి సుమారు రూ.20 వేల కోట్ల వరకూ పంపించామని, దేశంలో ఎవరికీ ఇంత సొమ్ము పంపించలేదని కేంద్ర మంత్రి ఈ నాయకులకు చెప్పినట్లు తెలిసింది. నగదు రద్దు సమస్యల పరిష్కారం కోసం కేంద్రం ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీకి కూడా చంద్రబాబే చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన డబ్బు మాయం అవడంపై విచారణ జరిపించాలని బిజెపి నాయకత్వం కోరింది. త్వరలోనే ఈ విచారణ మొదలవనుందని తెలిసింది. ఎన్ని మిగతా 9లో

కమ్యూనిస్టులతో కలిసి 'హోదా' ఉద్యమం

- జనసేన అధ్యక్షులు పవన్
- సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష నాయకులతో భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమిస్తామని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఎం, సిపిఐ ముఖ్య నేతలతో శుక్రవారం ఆయన సమావేశమ య్యారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామ కృష్ణలతో కలిసి పవన్‌కల్యాణ్ విలేకరులతో మాట్లాడు తూ బిజెపి, టిడిపి చేసిన వాగ్దానాలను విస్మరించి, రాష్ట్రాభివృద్ధిపై నిర్లక్ష్యం వహించాయని విమర్శిం చారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను నేరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెద్దఎత్తున అవినీతి పెరిగిపోతోందని పదేపదే తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. చేసిన తప్పులు సరిదిద్దుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. రాష్ట్రాభి వృద్ధితోపాటు ప్రజల సంక్షేమం కోసం తాను ఎంతవరకైనా వెళ్తానన్నారు. సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నేతలతో చర్చించి ఉద్యమ దిశా దశను నిర్ణయిస్తామని వెల్లడిం చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రానికి 15 ఏళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామంటూ విభజన సమయంలో పార్లమెంట్‌లో కొందరు మిగతా 9లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పవన్, చిత్రంలో వామపక్ష నాయకులు మధు, రామకృష్ణ

'బాబు ప్రజా విశ్వాసం కోల్పోయారు'

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజల భావోద్వేగాలతో తెలుగుదేశం పార్టీ చెలగాటం ఆడిందని తెలిపారు. ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన చంద్రబాబు పరిస్థితులు చేజారిన తరువాత మిగతా 9లో



మామిడి మార్కెట్‌కు గ్రహణం

- ఏటేటా తగ్గుతున్న వ్యాపార లావాదేవీలు
- ప్రతికూల పరిస్థితులతోపాటు రవాణాఛార్జీలూ భారమే
- నెల ఆలస్యంగా వ్యాపారం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

మామిడి మార్కెట్ ఈ ఏడాది తీవ్ర సంక్షోభంలో పడింది. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా మామిడి కాపు సగానికి సగం పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ ప్రభావం వ్యాపార లావాదేవీలపైనా పడుతోం ది. అసియాలోనే అతిపెద్ద నున్న మామిడి మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. ఉగాది సమీపిస్తున్నా మార్కెట్లో దుకాణాలను తెరిచేం దుకు వ్యాపారులు వెనకాడుతున్నారు. విజయ వాడ రూరల్ మండలం నున్న మామిడి మార్కెట్‌కు కృష్ణా, గుంటూరు, మిగతా 9లో

అతిసార బాధితులకు పరామర్శలు

- మరొకరు మృతి, బాధిత బంధువుల ధర్నా
- ప్రజల ప్రాణాలు పోతుంటే అసెంబ్లీలో చర్చించరా?
- 48 గంటల్లోగా స్పందించకపోతే బంద్ : పవన్
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యం : వైసిపి, బిజెపి
- చంద్రన్న బీమాతో పాటు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా : మంత్రులు



గుంటూరు కార్పొరేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా చేస్తున్న మృతుని బంధువులు, ఎమ్మెల్యే ముస్తఫా, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి/ అర్బన్/అమరావతి బ్యూరో

గుంటూరులో అతిసార బాధితులను వివిధ రాజకీయ పార్టీల నేతలు శుక్రవారం పరామర్శించారు. గురువారం ఆస్పత్రిలో చేరిన ఓ వ్యక్తి శుక్రవారం మృతిచెందడంతో బాధిత బంధువులు ధర్నా చేశారు. అతిసార లక్షణాలతో మృతిచెందితే....గుండెపోటుతో మృతిచెందినట్లుగా సర్టిఫికేట్ ఇవ్వడంతో బాధితులు ఆందోళన చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గుంటూరులోని జిజిహెచ్‌లో, షాదీఖానాలో బాధితులను పరామర్శించారు. వైసిపి నాయకులు ముస్తాఫా, వైసిపి లేళ్ల అప్పిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సవరం రోహిత్, బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాణిక్యాలరావు, సోము వీర్రాజు, మాధవ్ బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. మరో వైపు అసెంబ్లీలో మంత్రులు దీనిపై ఓ ప్రకటన చేస్తూ అతిసార మృతుల నిర్ధారణకు ముగ్గురు అధికారులతో ఓ కమిటీని నియమించినట్లు చెప్పారు.

గుంటూరులో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. నగరంలోని జిజిహెచ్, షాదీఖానాలో అతిసార వ్యాధి బాధితులను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావడంతో 14 మందికి పైనే చనిపోయారని, దీనిలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. నిరంతరం అభివృద్ధి జపం చేసే సిఎం చంద్రబాబు ప్రజలకు కనీసం పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి రోజూ సింగపూర్ తరహా అభివృద్ధి అని పదేపదే చెబుతున్నారని, మరి సింగపూర్ తరహా పాలన ఏదని ప్రశ్నించారు. తప్పుచేసిన వారిని సింగపూర్ తరహాలోనే కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలు పోతుంటే కనీసం అసెంబ్లీలో ఈ సమస్యపై పూర్తిస్థాయిలో చర్చించలేదన్నారు. వచ్చే 48 గంటల్లోగా మిగతా 9లో

అవినీతిలో కూరుకుపోయిన టిడిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అవినీతిలో కూరుకుపోయిందని బిజెవైఎం జాతీయ కార్యవర్గ సభ్యులు రమేష్‌నాయుడు ఆరోపించారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ చేసిన విమర్శలకు సమాధానం చెప్పుకోలేని స్థితిలో టిడిపి ఉందని తెలిపారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను చేపట్టిన మెగా కన్‌స్ట్రక్షన్స్ అధినేత కృష్ణారెడ్డి వైసిపి రూ.200 కోట్లు, టిడిపి రూ.450 కోట్ల ముడుపులు ఇచ్చి, వీరి మధ్య సయోధ్య కుదిర్చారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడని వైసిపి ప్రతిపక్ష పాత్రను కోల్పోయిందని చెప్పారు.

నాటకోత్సవం

కాకినాడలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన తూర్పురేఖలు నాటికలోని ఓ సన్నివేశం



రక్తి కట్టించిన నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలు రక్తికట్టిస్తున్నాయి. కాకినాడలో యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యాన దంటు కళా క్షేత్రంలో నంది నాటకోత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం నాటకశాల నటసేవా సమాజం సమర్పణలో 'సృష్టి' సాంఘిక నాటకం గెద్దా వరప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించారు. అధికారం కోసం కొందరు, ఆస్తుల కోసం మరికొందరు, ఆత్మాభిమానం కోసం ఇంకొందరు, ఆత్మరక్షణ కోసం కొందరు హత్యలు చేస్తారు. క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుని హత్య చేసిన తరువాత జీవితాంతం మనోవేదనకు గురయ్యే వారికి ఒక సందేశంగా ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ సమర్పణలో డాక్టర్ ఎ.కృష్ణారావు రచించిన తూర్పు రేఖలు సాంఘిక నాటకం రైతు వాసుదేవరావు దర్శకత్వంలో ప్రదర్శించి మెప్పించారు. రాత్రి కెవి మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సమర్పణలో బివి రమణ రచించిన వెలుగుబాట సాంఘిక నాటకం ఎం.అప్పలరాజు దర్శకత్వంలో ప్రదర్శించారు. మద్యం వల్ల ఎన్ని కుటుంబాలు బుగ్గి పాలౌతున్నాయో ఆ నాటకంలో కళ్లకు కట్టినట్లు చూపించారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న నంది నాటకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విజయనగరం జిల్లా బుచ్చన కోనేరుకు చెందిన అక్కినేని సాంస్కృతిక సమాజం వారితో ప్రదర్శించిన మోహినీ భస్మాసుర పద్యనాటకం ఆద్యంతం రక్తికట్టింది. అనంతరం ప్రదర్శించిన ద్రౌపది స్వయంవరం, గణపతి మహత్యం పద్యనాటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఉరుములతో వర్షాలు

శ్రీకాళహస్తిలో పిడుగుపాటు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి/ శ్రీకాళహస్తి

రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమల్లో శని, ఆదివారాలు అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, రాయలసీమలోనూ అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ తేలికపాటి జల్లులు పడతాయన్నారు. మూడు రోజుల పాటు ఆగ్నేయ అరేబియాలో కేరళ తీరానికి ఆనుకుని వాయు గుండం కొనసాగిన సంగతి తెలిసిందే. దీని కారణంగా బంగాళాఖాతం నుంచి వాయు గుండం వైపునకు రాష్ట్రం మీదుగా సముద్రం నుంచి తేమ గాలులు వీస్తున్నాయి. ప్రస్తుతం కేరళ తీరానికి ఆనుకుని అల్పపీడనం కొనసా గడం, మరోవైపు తూర్పు తీరంలో దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం, దక్షిణ అండ మాన్‌కు సమీపంలో హిందూ మహాసముద్రంలో భూమధ్య రేఖా ప్రాంతంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నాయి. వీటి కారణంగా రాష్ట్రంపై కమ్ముకున్న మేఘాలు వర్షించే అవకాశముందని తెలిపారు. శ్రీకాళహస్తిలో కురిసిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. మామిడి పూత రాలిపోయింది. వరి, ఎండుగట్టి పూర్తిగా తడిచిపోయాయి. పిడుగుపాటుకు ఊరందూరు గ్రామంకు చెందిన వెంకటరమణయ్యకు చెందిన పాడి ఆవు మృతి చెందింది.

సవరణ

గురువారం నాటి పత్రికలో 'ప్రత్యేక హోదాపై పవన్‌తో కలిసి పోరాటం' అనే శీర్షికతో వచ్చిన వార్తలో పొరపాటున 9న కార్యాచరణ అని ప్రచురితమైంది. 19వ తేదీన అని చదవుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

– సంపాదకులు

ప్రజ్ఞ

1. ఆర్థిక సంవత్సరం 2019లో భారత్ జిడిపి వృద్ధిరేటు ఎంత ఉంటుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది?
2. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?
3. ఆయుర్వేద సైన్స్ పరిశోధన కౌన్సిల్ (సిసిఆర్ఎఎస్) ప్రధానకార్యాలయం ఎక్కడ ఉంది?
4. 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్‌సి) సమావేశాలు ఎక్కడ ప్రారంభమయ్యాయి?
5. ఉత్తరప్రదేశ్‌లో అతి పెద్ద సౌరశక్తి కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు?

సమాధానాలు 7లో

అడ్డుకున్నారు ...!

మొదటి పేజీ తరువాయి

మరణించిన శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, మాజీ ఎంపిలు ఉత్తమ్‌బాయ్ హర్జీబాయ్ పటేల్, బోళ్ల బుల్లి రామయ్య, సుశీల, బండారు లక్ష్మణ్‌లకు లోక్‌సభ ఘన నివాళి అర్పించింది. ఆ వెంటనే టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ గందరగోళం నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వంపై వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి, టిడిపి ఎంపి తోట నరసింహం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహజన్ స్పందించారు. లోక్‌సభ నియమావళిలోని 17 అధ్యాయం 198(బి) నిబంధన మేరకు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు తనకు అందాయని చెప్పారు. అయితే, వెల్‌లో ఆందోళన చేస్తున్న సభ్యులను శాంతింపచేయడానికి ఎటువంటి ప్రయత్నాలు జరగలేదు. దీంతో వీరి ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు.

సంఖ్యాబలం ఉన్నా ...

లోక్‌సభలో అవిశ్వాసతీర్మానం ప్రస్తావనకు వచ్చినప్పుడు చర్చకు అవసరమైనంత సంఖ్యలో సభ్యులు మద్దతు తెలపడం స్పష్టంగా కనిపించింది. అయితే, దీనిని స్పీకర్ పరిగణలోకి తీసుకోకపోవడం వివాదాస్పదంగా మారింది. టిఆర్ఎస్, ఎఐడిఎంకె సభ్యుల నినాదాల మధ్యే వైసిపి, టిడిపి ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను స్పీకర్ సుమిత్రా మహజన్ సభలో విడివిగా చదివి వినిపించారు. స్పీకర్ చదువుతున్నప్పుడే వైసిపి, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, ఆర్జెడి, తృణముల్, ఎన్సీపి, ఆప్, ఎంఐఎం, ఆరెస్పీ సహా వివిధ పార్టీల సభ్యులు తమ తమ స్థానాల్లో లేచి నిలబడ్డారు. తీర్మానానికి మద్దతుగా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించారు. వీరి సంఖ్యను లెక్కించి చర్చకు అవసరమైన 50 మంది సభ్యుల మద్దతు ఉందా లేదా అని నిర్ధారించడానికి బదులుగా స్పీకర్ సభ సజావుగా జరగాలంటూ షరతు విధించారు. దీనికి . ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశాయి. సభ్యులను లెక్కించి చర్చకు అనుమతించాలని డిమాండ్ చేశాయి, అయితే, ఈ విజ్ఞప్తులను స్పీకర్ పట్టించుకోలేదు. 'గందరగోళ పరిస్థితులున్నాయి. ముందుకెళ్ళలేం...' అంటూ సభను సోమవారానికి వాయిదా వేశారు.

ఆ రెండు పార్టీలు కావాలనే ..?

టిఆర్ఎస్, అన్నాడిఎంకె పార్టీలు కావాలనే సభలో గందరగోళం సృష్టించాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సభ వాయిదా పడిన తరువాత పలు పార్టీల నాయకులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. టిఆర్ఎస్, ఎఐడిఎంకెలు బిజెపితో లోపాయికారి ఒప్పందాన్ని చేసుకున్నాయని, అందుకునే అవిశ్వాసం చర్చకు రాకుండా బిజెపికి సహకరించాయన్న వ్యాఖ్యలు వినిపించాయి. గురువారం లోక్‌సభలో జరిగిన ఆందోళనలో జై తెలంగాణ..జై ఆంధ్రా నినాదాలు చేసిన టిఆర్ఎస్ ఎంపిలు శుక్రవారం ఈ విధంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

చర్చ జరిగే వరకు వదిలిపెట్టం : వైసిపి

. లోక్‌సభ వాయిదా అనంతరం మీడియాతో మాట్లాడిన వైసిపి ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి సభలో చర్చ జరిగే వరకు వదిలి పెట్టేది లేదని అన్నారు. వైసిపి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనేక పార్టీలు మద్దతు ఇచ్చాయని తెలిపారు. లోక్‌సభలో తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కేంద్ర ప్రభుత్వం కుంటిసాకులు చెబుతోందని వైసిపి ఎంపిలు వైఎస్ అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డి విమర్శించారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే వరకు నోటీసులు ఇస్తూనే ఉంటామని చెప్పారు.

20 పార్టీల మద్దతు: రఘువీరా రెడ్డి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిందని, కాంగ్రెస్‌తో స్నేహంగా ఉన్న 20 పార్టీలు మద్దతిస్తాయని ఏపిసిసి అధ్యక్షుడు రఘువీరా రెడ్డి వెల్లడించారు. అన్ని పార్టీలను సంప్రదించాలని లోకసభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గేను సోనియా ఆదేశించారని రఘువీరా తెలిపారు.

బిల్లులు ఎలా ఆమోదించుకున్నారు?: ఎం.డి సలీం, సిపిఎం

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం, స్పీకర్ కుంటిసాకులు చెబుతున్నారని, సభ ఆర్డర్‌లో లేకపోతే ఆర్థిక బిల్లు లాంటి కీలక బిల్లులను ఎలా ఆమోదించుకున్నారని సిపిఎం లోక్‌సభ పక్ష ఉపనేత ఎం.డి సలీం ప్రశ్నించారు. ప్రతిపక్షం మొత్తం ఆంధ్రప్రదేశ్ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఉందని, కానీ అధికార పక్షం సమాధానం చెప్పాల్సి వస్తుందనే తీర్మానం చర్చకు రాకుండా చేసిందని తెలిపారు. ఏపికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఇచ్చిన హామీని నెరవేర్చలేని పక్షంలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టే హక్కు ప్రతి సభ్యుడికి ఉంటుందని అన్నారు.

ఏపిలో టిడిపి గెలవదు: జివిఎల్ నరసింహారావు, బిజెపి

ప్రత్యేక హోదాపై ఇన్ని రోజులు సైలెంట్‌గా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఓటమి భయంతో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని బిజెపి అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావు ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి గెలిచే శక్తిలేదని అందుకే ఏమీ చేయలేని పరిస్థితిలో కేంద్రంపై అనవసర ఆరోపణలు చేస్తోందని ఆయన అన్నారు.

మళ్లీ నోటీసులు

శుక్రవారం నాటి తీర్మానాలను తిరస్కరించడంతో సోమవారం నాడు మళ్లీ అవిశ్వాసాన్ని చర్చకు పెట్టాలంటూ వైసిపి, టిడిపి ఎంపిలు నోటీసులు అందచేశారు. శుక్రవారం సాయంత్రం లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీవాస్తవ్‌కు లేఖలు అందించారు. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు సరిపడా 50 మంది ఎంపి మద్దతు కోసం వైసిపి, టిడిపి సభ్యులు వివిధ పార్టీల నేతలను కలుస్తున్నారు.


మోడీ ప్రభుత్వం ఆంధ్రులను మోసం చేసింది : సీతారాం ఏచూరి

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంటరీ జవాబుదారీతనం లేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యాలను అన్నిటినీ తాము ఎండగడతామని చెప్పారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి సిపిఎం మద్దతు ఉంటుందని ఏచూరి శుక్రవారం ట్విట్టర్లో పేర్కొన్నారు.

పవన్‌తో సంబంధం లేదు: ఉండవల్లి

చంద్రబాబు ఢిల్లీ వెళ్లి అవిశ్వాసంపై మద్దతు కూడగట్టాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం కార్పొరేషన్



జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో తనకు ఎటువంటి రాజకీయ సంబంధమూ లేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పవన్ కళ్యాణ్‌కు తాను స్క్రిప్ట్ రాశానని వస్తున్న వార్తల్లో నిజంలేదన్నారు. పవన్‌తో సంబంధం కేవలం జెఎఫ్‌సి నివేదిక ఇచ్చేంతవరకు మాత్రమేనని వ్యాఖ్యానించారు. నివేదిక అనంతరం నేటి వరకూ కనీసం ఫోన్ సంభాషణ కూడా లేదన్నారు. పవన్‌తో తనకు సంబంధం ఉందని వస్తున్న ఊహాగానాలను ఉండవల్లి ఖండించారు. ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీర్మానం అనుమతి పొందాలంటే సభ్యులెవ్వరూ వెల్‌లోకి వెళ్లి అనవసరంగా ఆందోళన చేయరాదన్నారు. సోమవారంతో సభ ముగిసేలా చూస్తున్నారని, సోమవారం సభ వాయిదా పడినా, తీర్మానం వాయిదా పడినట్లేనని ఉండవల్లి వ్యాఖ్యానించారు. చంద్రబాబునాయుడు వెంటనే ఢిల్లీ వెళ్లి తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని ఉపయోగించాలన్నారు.

అమరావతిలో వెయ్యి ఎకరాల్లో జూ

జూ వెటర్నరీ వైద్యుల వేతనాలు రెట్టింపు

మంత్రి సిద్ధా రాఘవరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో వెయ్యి ఎకరాల్లో జూ నిర్మించేందుకు స్థల సేకరణ వేగవంతం చేయాలని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి సిద్ధా రాఘవరావు అధికారులను ఆదేశించారు. జూ అథారిటీ ఆఫ్ ఏపి (జాప్) 8వ గవర్నింగ్ బాడీ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని జూలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించాలని ఈ సందర్భంగా జాప్ చైర్మన్, మంత్రి సిద్ధా అధికారులను ఆదేశించారు. జూ లో పనిచేస్తున్న వెటర్నరీ డాక్టర్ల జీతాలను రూ 38,500 నుంచి రూ 50 వేలకు , వెటర్నరీ ఆఫీసర్ల వేతనాలు రూ 20 వేల నుంచి రూ 40 వేలకు, వెటర్నరీ అసిస్టెంట్ జీతాలు రూ 13,200 నుంచి రూ 25 వేలు పెంచాలని నిర్ణయించారు. జూ అంతర్గత నిర్వహణ ఖర్చులకు క్యూరేటర్‌కు రూ 10 లక్షల నుంచి రూ 25 లక్షలు పెంచాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన ధరలు, వేతనాలు అమలవుతాయని మంత్రి అధికారులకు తెలిపారు. విశాఖ, తిరుపతి జూలలో 60 బ్యాటరీ ఆపరేటెడ్ కార్లను ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

'టెన్త్'కు మధ్యాహ్నం తరగతులు

మున్సిపల్ శాఖ ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం తరగతులు నిర్వహించాలని మున్సిపల్ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్ష ముగిసిన తరువాత తప్పనిసరిగా పాఠశాలలో నిర్వహించే స్టడీ అవర్స్‌కు తప్పనిసరిగా రావాలని ఆదేశించారు. మరుసటి రోజు రాసే సబ్జెక్టు టీచర్ కూడా తప్పనిసరిగా రావాలని తెలిపారు. విద్యార్థినులు సాయంత్రం 6గంటల వరకు, విద్యార్థులు సాయంత్రం 8గంటల వరకు ఉండాలని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులను బానిసలుగా చూసే ఈ నిబంధనలు రద్దు చేయాలని ఎపటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, కె వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

తమిళనాడు తరహాలో హోదా ఉద్యమం : యండపల్లి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రత్యేక హోదా కోసం తమిళనాడు తరహాలో ఉద్యమాలు చేయక తప్పదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డి అన్నారు. శుక్రవారం శాసనమండలిలో విభజ చట్టం హామీల పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. సిపిఎం తప్ప మిగిలిన పార్టీలన్నీ రాష్ట్రాన్ని నమ్మకంగా ద్రోహం చేశాయని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలో పేర్కొన్న హామీలు రాష్ట్ర ప్రజల హక్కుని, వీటిని సాధించుకోడానికి పార్టీలకతీతంగా ఏకం కావాలన్నారు. నిధులు కేటాయించడంలోనూ, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ కేంద్ర ప్రభుత్వ తీరు పట్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. స్వార్థ రాజకీయాల కోసం ఎవరికి వారు ఎత్తులు పై ఎత్తులు వేస్తూ రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. రాజకీయ ఎత్తుగడలతో ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. ఈ పరిణామాలు భవిష్యత్‌లో రాష్ట్రానికి ఎంతో నష్టం కలిగే ప్రమాదముందన్నారు. నిధుల కొరతతో వెలిగొండ ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయిందని, దీంతీ ప్రకాశం జిల్లాలో కరువు సంభించే దుస్థితి నెలకొందన్నారు. రైల్వే జోన్‌లు, రైల్వే ఆస్తులన్నీ ఉత్తరాది రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయన్నారు. దుగ్గిరాజపట్నం కాకపోతే రామాయపట్నం పోర్ట్ నిర్మాణానికి ఎందుకు అనుమతులు ఇవ్వకూడదన్నారు. విభజిత రాష్ట్రం పై కేంద్రం చూపించాల్సిన ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానాలు పెట్టడానికి అధికార, ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయని, వీటి వల్ల రాష్ట్రానికి గానీ, రాష్ట్ర ప్రయోజనాలకు గానీ పెద్దగా ఒరిగేదేమీ లేదన్నారు. బడా కాంట్రాక్టర్ల కోసమే రాష్ట్రాన్ని విభజించారనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. గతంలో ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా జై ఆంధ్ర ఉద్యమం చేశారని, ఇప్పుడు ప్రత్యేక హోదా, ఇతర హామీల కోసం ఉద్యమం చేయక తప్పదని స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు.

స్వామినాథన్ సిఫారసుల అమలు ఎప్పుడు?

శాసనసభలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు స్వామినాథన్ చేసిన సిఫార్సులను అమలు చేస్తామన్న కేంద్రం ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. శాసనసభలో 'కనీస మద్దతు ధర– మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం'పై శుక్రవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టోలోను ఈ అంశాన్ని పొందుపరిచినట్లు చెప్పారు. రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే వీరాంజనేయులు మాట్లాడుతూ కందులు కొనుగోలు విషయంలో తేమ నిబంధనలను కొంత సడలించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే వై.సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించడంతో శనగపంట పండించే రైతులు నష్టాల నుంచి బయట పడ్డారని చెప్పారు. పంట మొత్తాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మద్దతు ధర మరింత పెంచాలి మంత్రి సోమిరెడ్డి

కనీస మద్దతు ధరను కేంద్రం మరింత పెంచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కనీస మద్దతు ధర – మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం పై ఎమ్మెల్యేలు లేవనెత్తిన పలు సమస్యలు సందేహాలపై ఆయన సమాధానం చెప్పారు. కేంద్ర సహకారం సరిగా లేకపోయినా రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. కేంద్రం నిర్ణయించిన ధరకన్నా ఎక్కువగా ఇస్తున్నామని స్పష్టం చేశారు. సుమారు రూ.2,300 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రాష్ట్రం భరిస్తోందని సోమిరెడ్డి వెల్లడించారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని ఇకపై రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

గోచి పెట్టుకునేవారికైనా భూములు ఇస్తాం

విష్ణుకుమార్ రాజు ప్రశ్నకు మంత్రి సమాధానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చిన ఎవరికైనా భూములు ఇస్తామని పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా శుక్రవారం బిజెపి శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు లేవనెత్తిన ప్రశ్నకు సమాధానమిస్తూ గొచి పెట్టుకొచ్చినా పరిశ్రమలు ఏర్పాటు చేస్తానంటే భూములు ఇస్తా మన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి. ఫ్రాన్క్లిన్ టెంపుల్‌టెన్ ప్రపంచ స్థాయిలో పేరుగాంచిన సంస్థ అన్నారు. ఆ సంస్థ మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం గర్వకారణంగా చెప్పుకొచ్చారు. ఆ సంస్థతో ఎంఓయు చేసుకున్నామని, డిపిఆర్ రూపకల్పన జరుగుతుందన్నారు. అంతకుముందు విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ పారిశ్రామిక సదస్సులకు ఎవరు సూటుబూటు వేసుకొచ్చిన వారికే భూములు కేటాయిస్తున్నారని తాను గమనించినట్లు చెప్పారు. తనకు తెలిసిన వ్యక్తి ఎప్పుడూ సూటు వేసుకోని వాడు సదస్సుకు వెళుతూ సూటు వేసుకుని కనిపించాడన్నారు. ఏమిటని ప్రశ్నిస్తే సూటు విషయం తెలిసిందని చెప్పారు.

జీరో అవర్‌లో.. సమస్యలపై ఎమ్మెల్యేల ఏకరువు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నియోజకవర్గాల్లోని వివిధ సమస్యలపై శాసనసభ్యులు ఆందోళన చెందుతూ ఆయా సమస్యలను శుక్రవారం శాసనసభ జీవో అవర్‌లో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. జయవాడ, గుడివాడ రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఉన్న ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్ నిర్మించి వెడల్పు చేయాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కోరారు. చింతలపూడి నియోజకవర్గంలోని అంతర్గత రహదారుల మరమత్తులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పీతల సుజాత కోరారు. బనగానపల్లి నియోజకవర్గ పరిధిలో గ్రావెల్ రోడ్లు మంజూరుకు సంబంధించిన ఫైల్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే జనార్ధనరెడ్డి కోరారు. శింగనమల నియోజకవర్గంలో 30 పడకల ఆస్పత్రిని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేశారని దానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే యామిని బాల విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం నియోజకవర్గంలో ప్రవేటు యాజమాన్య పరిధిలో ఉన్న వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్‌ను ప్రభుత్వానికి ఇవ్వడానికి వారు అంగీకరించారని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే కళాశాలకు చెందిన 25 ఎకరాల స్థలంతో భవనాలు సొంతమవుతాయని ఎమ్మెల్యే చిరంజీవులు తెలిపారు. పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలో గతంలో ఉన్న పెంకిటిళ్ళ స్థానంలో ప్రభుత్వం నూతన గృహాలను మంజూరు చేయడంతో పాటు గిరిజన ప్రాంతం కావడంతో రవాణా ఖర్చుల కోసం రూ.50 అదనంగా ఇవ్వాలని ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ప్రభుత్వాన్ని కోరారు. టాన్స్‌కో, జన్‌కోల్లో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తోన్న సుమారు 22 వేల మందికి సరైన వేతనాలు ఇచ్చి న్యాయం చేయాలని బిజెపి శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

ఈనాం భూముల సమస్య పరిష్కరించాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈనాం భూముల సమస్యను పరిష్కరించాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య ప్రభుత్వాన్ని కోరారు. భూ యజమానులు ఆర్థికంగా చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సింహాచలం దేవస్థానంలో నైవేద్య సమర్పణలో అపచారం జరిగినా చర్యలు తీసుకోని ఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లాలో లాక్‌అవుట్ ప్రకటించిన నాలుగు జూట్ మిల్లుల కార్మికులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మీసాల గీత కోరారు.

రాజధాని పరిధిలోని తాడికొండ నియోజకవర్గంలో ట్రాఫిక్ కారణంగా రోడ్డు పక్కన తొలగించిన భవనాలు, దుకాణాల యజమానులకు నష్ట పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే శ్రావణకుమార్ కోరారు. రంపచోడవరం పరిధిలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మూడు సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి స్థానికులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే రాజేశ్వరి ప్రభుత్వాన్ని కోరారు. బి కొత్తకోటలో ఆర్టీసి డిపోను పున:ప్రారంభించాలని తంబళ్లపల్లి ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఇచ్చాపురం నియోజకవర్గంలోని ఆస్పత్రిని 30 బెడ్ల నుంచి 50 బెడ్లకు పెంచాలని ఎమ్మెల్యే అశోక్ కోరారు.

హోంగార్డులకు రూ.20 వేలు జీతం ఇవ్వాలి

అతి తక్కువ జీతాలతో పోలీస్ కానిస్టేబుళ్ల కంటే ఎక్కువగా విధులు నిర్వహిస్తోన్న హోంగార్డుల జీతాలను రూ.20,000కు పెంచి న్యాయం చేయాలని పి గన్నవరం ఎమ్మెల్యే నారాయణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో పెంచినా ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా రూ.12వేలే ఇవ్వడం దారుణమన్నారు. అదే విధంగా తన నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయమని గత కొంతకాలంగా కోరుతున్నా స్పందన లేదని అసలు ఏర్పాటు చేస్తారో లేదో చెప్పాలని ఆయన కోరారు.

బెంగళూరు, నెల్లూరు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని ఎమ్మెల్యే రామకృష్ణ కోరారు. సభ్యుల లేవనెత్తిన అన్ని అంశాలను నోట్ చేసుకుని తగు చర్యలు తీసుకుంటామని సంబంధిత మంత్రులు హామీ ఇచ్చారు.

సంక్షిప్తం

శాసనసభకు సోమవారం సెలవు స్పీకర్ కోడెల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభకు ఈనెల 19న సెలవు ఇస్తున్నట్లు స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రకటించారు. శాసనసభలో శుక్రవారం ప్రశ్నోత్తరాలు పూర్తయిన అనంతరం ఈ ప్రకటన చేశారు. సభ్యుల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో శాసనసభ వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. బిఎసిలో తీసుకున్న నిర్ణయం ప్రకారం 17, 18 తేదీలు సెలవులుగా కాగా, 19వ తేదీన కూడా సెలవు ఇచ్చారు. శాసనసభ ఈనెల 20న తిరిగి సమావేశమవుతుంది.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

సమస్యలు పరిష్కరించాలని సమ్మెలోకి వెళ్లిన జూనియర్ డాక్టర్లు ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు హామీనిచ్చారని, అందువల్ల సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు.


మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు పెన్షన్

ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు పెన్షన్ అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల పట్ల ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మురళీమోహన్, ఎన్.బోసుబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వుల వల్ల మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న సుమారు 1950 మంది ఉపాధ్యాయులకు పెన్షన్ విధానం అమలవుతుందని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం సిపిఎస్‌ఆర్‌ఎఫ్ ఫారాలు నింపి పాన్ ఖాతాలు తెరవాలని సూచించారు. ఈ ఉత్తర్వుల విడుదలలో సహకరించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటియఫ్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

టిడిపి తీర్మానానికి మద్దతిస్తాం

ఎంపి విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఎపి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం ఏ రాజకీయ పార్టీతోనైనా కలిసి పోరాడేందుకు వైసిపి సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. టిడిపి అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టినా అనుకూలంగా ఓటేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ఇప్పటి అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపాలని తమ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని పార్టీల నేతలకు లేఖలు రాయడం జరిగిందన్నారు. దేశంలో చంద్రబాబును మించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ నేరగాడు లేడని వ్యాఖ్యానించారు. ప్రజల రక్తాన్ని పీలుస్తూ...దోచుకున్న ధనాన్ని విదేశాలకు తరలించాడని ఆరోపించారు.



పవన్ పన్నీరు సెల్వంలా మారారు..

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రధాని మోడీకి వ్యతిరేకంగా పోరాడుతారని అంతా అనుకుంటుండగా పన్నీర్‌సెల్వంలా ఎలా మారిపోయారో అర్థం కావడం లేదని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శించడానికేనా ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీనా అని ప్రశ్నించారు. సినిమాలో ఇంటర్వెల్ వరకు హీరోగా ఉండి తర్వాత భిన్నమైన రోల్ పోషించినట్లుగా పవన్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లు పెంచుతామన్న కెసిఆర్‌ను పొగుడుతూ, కాపు రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న చంద్రబాబును పవన్ విమర్శించడం తగదన్నారు.

బిజెపి పతనం ప్రారంభమైంది

మంత్రి కొల్లు రవీంద్ర

దేశ రాజకీయాల్లో బిజెపి పతనం ప్రారంభమైందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టిడిపి ఢిల్లీ వరకు పోరాటం చేస్తోందన్నారు. అవిశ్వాస తీర్మానానికి సరిపడా 54మంది ఎంపిలను కూడబెట్టుకోలేని స్థితిలో వైసిపి ఉందన్నారు. జాతీయ రాజకీయాలు చేయగల సత్తా ఒక్క టిడిపికే ఉందని మంత్రి అన్నారు.

బిజెపికి ముస్లిం మైనార్టీలు బుద్ధి చెబుతారు

కదిరి ఎమ్మెల్యే చాంద్‌భాష

రాబోవు రోజుల్లో బిజెపికి మైనార్టీలు బుద్ధి చెబుతారని కదిరి ఎమ్మెల్యే చాంద్‌బాష అన్నారు. బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టోను తుంగలో తొక్కిందన్నారు. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని కేంద్రం మోసం చేసిందని ఆయన తెలిపారు. ముస్లిం మైనార్టీల చంద్రబాబుకు మద్దతుగా నిలుస్తారని చాంద్‌భాష పేర్కొన్నారు. ప్రత్యేకహోదా, రాష్ట్రానికి ఆర్థికంగా నిధులు తీసుకురావాలనే కృతనిశ్చయంతో చంద్రబాబు ముందుకు సాగుతున్నారని ఆయన తెలిపారు.

వైసిపిని నమ్మలేం

వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు

కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన వైసిపి ఏ సమయంలో నైనా అమ్ముడు పోవచ్చని, ఆ ఆ పార్టీని నమ్మలేక టిడిపి ప్రత్యేకంగా అవిశ్వాసానికి నోటీసు ఇవ్వడం జరిగిందని వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు అన్నారు. ఎంపి విజయసాయిరెడ్డి ప్రధాని కార్యాలయంలో కమీషన్ ఏజంట్‌లాగా తిరుగుతున్నాడని ఆయన పేర్కొన్నారు.

దక్షిణాది రాష్ట్రాలను అణచాలని చూస్తోంది

అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు

బిజెపి దక్షిణాది రాష్ట్రాలను అణచాలని ప్రయత్నిస్తోందని అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఉత్తరాది పార్టీ బిజెపికి దక్షిణాది రాష్ట్రాలంటే చిన్న చూపు చూస్తోందన్నారు. టిడిపి సపోర్టు లేకుండా బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవని తెలిపారు. బిజెపి ఏపిని వెన్నుపోటు పొడిచిందని పేర్కొన్నారు.

పవన్‌కళ్యాణ్ వెనుక ముగ్గురు

టిడిపి ఎమ్మెల్సీ దీపక్

పవన్‌కళ్యాణ్ వెనుక స్క్రీన్‌ప్లే, దర్శకుడు, నిర్మాత ఎవరో ప్రజలందరికీ తెలుసని టిడిపి ఎమ్మెల్సీ దీపక్ పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

కాంగ్రెస్‌కు జవసత్వాలు ఇచ్చేందుకే టిడిపి అవిశ్వాసం

బిజెపి ఎమ్మెల్సీ మాధవ్

కాంగ్రెస్‌లేని దేశాన్ని తయారు చేయాలని బిజెపి ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్‌కు జవసత్వాలు ఇచ్చేందుకు టిడిపి కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిందని బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. పవన్‌కళ్యాణ్ చేసిన ఆరోపణలకు టిడిపి ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. వైసిపి ట్రాప్‌లో టిడిపి పడిందన్నారు. టిడిపి ఎన్‌డిఏ లో లేక పోయినా ఏపీకి అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందన్నారు.

మాది పేదల బడ్జెట్

- కేంద్రం పథకాలను బలవంతంగా రుద్దుతోంది
- ఆర్థిక మంత్రి యనమల ధ్వజం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ బడ్జెట్ పూర్తిగా పేద ప్రజల అభ్యున్నతికి ఉద్దేశించిందని, సంక్షేమానికి, సామాజిక సేవలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చకు శుక్రవారం వివరణ ఇస్తూ ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల దాటినా సమాజంలో అనేక అసమానతలున్నాయన్నారు. విద్య, వైద్యం వంటి ప్రధాన రంగాల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 102 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించామని వివరించారు. కేంద్రం నుంచి దాదాపు రూ.50,696 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నా మని తెలిపారు. అయితే కేంద్రం చాలా ఇస్తోం దంటూ బిజెపి సభ్యులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎలాంటి సహాయమూ అందడం లేదన్నారు. కేటాయించిన నిధులే వెనక్కి తీసుకున్న పరిస్థితి ఉన్నదన్నారు. వివిధ పన్నుల రూపంలో కేంద్రానికి వచ్చే ఆదాయంలో 50 శాతం వాటా రాష్ట్రాలకు ఇవ్వాలని ఎప్పటి నుంచో ఒత్తిడి చేస్తున్నే ఉన్నామని తెలిపారు. గతంలో కేంద్ర పన్నుల్లో 25 శాతం ఉన్న వాటాను 13వ ఆర్థిక సంఘం సూచనతో 32 శాతానికి తీసుకొచ్చారని, అదే ప్రస్తుతం 42 శాతానికి పెరిగిందని చెప్పారు. ఇది కేంద్రం ఇచ్చినట్లుగా చెబుతుందని, కానీ నిధుల విడుదలకు వచ్చే సరికి ఏవేవో కారణాలు చూపుతూ కోత విధిస్తోందని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం ముందు ఇప్పటికే కొన్ని అభ్యంతరాలు తెలిపామని, నిధుల కేటాయింపు విధానంలో మార్పులు చేయాలని సూచించామని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర నిధుల్లో రాష్ట్ర వాటా 4.03 శాతంగా ఉందన్నారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే ఏపికీ కేటాయింపులిస్తున్నారు తప్ప, విభజన చట్టం ప్రకారం అదనంగా ఏమీ ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ లో రూ.50 వేల కోట్లు పెట్టామని, మారిన రాజకీయ పరిస్థితుల్లో ఎంత ఇస్తారోనని ఊహించడం కష్టమన్నారు. పోలవరం విషయంలో ముందు రాష్ట్రం ఖర్చు చేసే తరువాత కేంద్రం వాపసు (రీయింబర్స్) ఇస్తోందని, అందుకూ మూడు నెలల సమయం తీసుకుంటోందని తెలిపారు. ఇందువల్ల వడ్డీల రూపంలో రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా రూ.300 కోట్ల భారం పడుతోందన్నారు.

గవర్నర్ పాలన నాటికే 17 వేల కోట్ల లోటు


రెవిన్యూ లోటు నిధుల విడుదల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి విచిత్రంగా ఉందని యనమల వ్యాఖ్యానించారు. 2014-15 నుంచి ఇప్పటి వరకు రూ.3,962 కోట్లు ఇచ్చిందని, ఇంకా రూ.138 కోట్లు ఇస్తే సరిపోతుందని చెబుతుందన్నారు. వాస్తవానికి రాష్ట్ర విభజన అనంతరం గవర్నర్ పాలనలోనే రూ.17 వేల కోట్ల రెవిన్యూ లోటు ఉందని గుర్తించారన్నారు. కాగ్, ఆర్‌బిఐ రిపోర్టులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయని గుర్తు చేశారు. మిత్రపక్షంగా ఉన్నప్పుడే వ్యవహరించలేని, ఇప్పుడు ఇస్తారో లేదో తెలియదని అన్నారు. రుణమాఫీ, పెన్షన్లు తదితర రాష్ట్ర పథకాలకు కేంద్రం ఇవ్వాల్సిన అవసరం లేదనే వాదనలు తెరమీదకు తెస్తోందన్నారు. రాష్ట్ర పథకాలకు నిధులివ్వనప్పుడు, కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలపై బలవంతంగా ఎలా రుద్దుతా రని ప్రశ్నించారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర అధికారాలు పరిమితంగానే ఉండాలని, రాష్ట్రాల హక్కులు కాలరాస్తే ఎలా అని నిలదీశారు. కేంద్ర పథకాల విషయంలో కనీసం రాష్ట్రాల అభిప్రా యాలు కూడా తీసుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలు తగ్గించాలని ఎప్పటి నుంచో కోరు తున్నా, తమ పథకాలకు 60 శాతం ఇస్తామని, రాష్ట్రం 40 శాతం నిధులు భరించాలంటూ సరికాదన్నారు. ప్రత్యేక హోదాను భవిష్యత్‌లో ఏ రాష్ట్రానికి ఇవ్వడం లేదని మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పడంతోనే ప్యాకేజీకి ఒప్పుకున్నామని ఉద్ఘాటించారు. అప్పుడు ఇవ్వడం లేదని, ఇప్పుడు ఆ మాట మార్చడాన్ని బట్టే కేంద్రం కుట్ర అర్థమవుతోందన్నారు.

జర్నలిస్టుల ఇళ్లకు రూ.100 కోట్లు

రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా ఇళ్ల నిర్మాణం కోసం రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి యనమల ప్రకటించా రు. సాంకేతిక కారణాల వల్ల బడ్జెట్‌లో జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించ లేకపోయామని, సవరణ బడ్జెట్‌లో ఈ మేరకు నిధులు కేటాయిస్తామన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శాసన సభ మౌన నివాళి అర్పించింది. ఈ తీర్మానాన్ని యనమల ప్రవేశ పెట్టారు.

బోధనేతర పనులు అప్పగించొద్దు

బొడ్డునాగేశ్వరరావు ప్రత్యేక ప్రస్తావన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులకు బోధనేతర, విద్యేతర కార్య క్రమాలకు తరలించకుండా ఉండాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శాసన మండలి చైర్మన్ ఎన్ఎండి ఫరూక్‌కు శుక్రవారం మండలిలో ప్రత్యేక ప్రస్తావన అందజేశారు. రాష్ట్రంలో విద్యకు సంబంధం లేదని అనేక ప్రభుత్వ కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, స్వాగత కార్యక్రమాలు, ధోమలపై దండయాత్ర, ఒడిఎఫ్, ఓటర్ల దినోత్సవాలు తదితర ర్యాలీలకు తరలిస్తున్నారని తెలిపారు.

క్రీడాస్థలాల అభివృద్ధిలో నిబంధనలకు భిన్నంగా వ్యవహరించడం లేదని ప్రధానోపాధ్యాయులకు మెమోలు, గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్ నిధులు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెన్, ప్లే గ్రౌండ్, టాయిలెట్స్,సిసిఎ గ్రేడులు ఆన్‌లైన్ సబ్‌మిషన్, తదితర బోధనేతర, విద్యేతర కార్యక్రమాలకు ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల, కళాశాల ఉపాధ్యాయులను, అధ్యాపకులను, విద్యార్థులను ఉపయోగిస్తున్నారని వివరించారు. వీటి నుంచి విముక్తి చేసి కేవలం బోధన, విద్యాసంబంధిత కార్యక్రమాలకే ఉపయోగించాలని గ్రామస్వాప్తంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నిరసన కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు.

ప్రశ్నోత్తరాలు

నకిలీ మందులపై చర్యలు నామమాత్రం

శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నకిలీ మందుల మాఫియా ప్రభుత్వానే్న శాసించే స్థాయికి చేరిందని, దీంతో ప్రజల ఆరోగ్య పరంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని టిడిపి ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, బాల వీరాంజనేయస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభ శుక్రవారం ప్రారంభమైన అనంతరం ప్రశ్నోత్తరాల్లో వారు మాట్లాడుతూ ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. నకిలీ మందుల నివారణకు ఒక కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో దాడులు నిర్వహించి రూ.50 లక్షల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకుని, అందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టినట్లు తెలిపారు.

రూ.132 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు..

ఇ-క్రాప్ తదితర విధానాల వల్ల రాష్ట్రంలో 87,728 మంది రైతులకు రూ.132 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇ-క్రాప్ తదితర కారణాల వల్ల అందలేదని వీర్ ఎన్ వర్ల రఘునాథరెడ్డి చెప్పారు. పరిశీలించి మంజూరు చేయాలని ఆయన కోరారు. ఇ-క్రాప్ విధానంలో ఎక్కడైనా నమోదు కానివి ఉంటే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమాధానమిచ్చారు. శాటిలైట్ అనుసంధానంతో పంట నష్టాల లెక్కింపు (ఎన్యూమరేషన్)ను ఇరి అనే సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు.

లంబసింగిలో పర్యాటకులకు వసతులేవీ?

ఆంధ్రా ఊటీగా పేరొందిన లంబసింగిలో పర్యాటకులకు ఎటువంటి వసతులు లేవని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యేలు సత్యప్రభ, ఆనందరావు, వెంకటేశ్వరరావు వారి నియోజకవర్గాల పరిధిలో పర్యాటకాభివృద్ధి గురించి ప్రశ్నించారు. లంబసింగిలో రూ.5 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి అఖిలప్రియ తెలిపారు. రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు రూ.183.06 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

హిందుజాకు ఇచ్చిన భూములు వెనక్కి తీసుకోవాలి

అనంతపురంలో హిందుజా తదితర సంస్థలకు గతంలో కేటాయించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయనందున ఆ భూములను వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రభాకరచౌదరి కోరారు. కర్నూలులో జైన్ ఇరిగేషన్ సంస్థ పనులు ఎప్పుడు పూర్తి చేస్తుందని ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. హిందుజా తదితర సంస్థల భూములకు ఇది ఎలాట్‌మెంట్‌లో ఉన్నాయని మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు. జైన్ ఇరిగేషన్ సంస్థ పనులు త్వరలోనే పూర్తి చేస్తుందని జవాబిచ్చారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి చర్యలు

రాష్ట్రంలో పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని ఎమ్మెల్యేలు ఆలపాటి రాజా, బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో 1,782 మంది రైతులకు పశువులు, గొర్రెల పెంపకంపై శిక్షణ ఇచ్చినట్లు మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గం బియ్యపుతిప్పలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు రూ.20 కోట్లు వ్యయం కాగల ప్రతిపాదన సిద్ధంగా ఉందని, పనులు త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి, ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అడిగిన ప్రశ్నకు జవాబుగా తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఇంతవరకు రూ.18.55 లక్షల కోట్ల పెట్టుబడులు రాగల 2.536 ఎంఒయులు కుదుర్చుకోగా, వాటిలో సుమారు 1.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 533 ఎంఒయులు ఆచరణలోకొచ్చి 2.65 లక్షల మందికి ఉపాధి లభించిందని పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు.

నిబంధనల పేరిట అంధ విద్యార్థికి అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాసేందుకు వచ్చిన కవిటిభద్ర కస్తూరిబా విద్యాలయ అంధ విద్యార్థిని కేరెడ్డి ఆదిలక్ష్మికి నిరాశ ఎదురైంది. సదరం ధ్రువపత్రం తీసుకురాలేదని సహాయకురాలిని అనుమతించేది పరీక్ష కేంద్రం అధికారులు నిరాకరించారు. దీంతో, ఆ విద్యార్థిని పరీక్ష హాలులో మౌనంగా కూర్చోవాల్సి వచ్చింది.

జులై నాటికి హంద్రీ నీవా తొలిదశ

- వచ్చే ఏడాదికి ప్రాజెక్టు పూర్తి
- మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి దేవినేని



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఏడాది జులై నాటికి హంద్రీనీవా సుజల స్రవంతి తొలిదశ నిర్మాణం పూర్తి చేసి నీటిని అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అవుతున్న ఖర్చు తదితర వివరాలపై శుక్రవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ గోపాలరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి దేవినేని సమాధానమిచ్చారు. వచ్చే ఏడాది నాటికి ప్రాజెక్టు పూర్తి చేసి, రాయలసీమ జిల్లాలకు నీటి కొరత లేకుండా చూస్తామన్నారు. త్వరగా పూర్తి చేసేందుకు కేటాయింపులు కంటే రెండు రెట్లు పైగా అధికంగా వెచ్చించామని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం పశ్చిమ గోదావరి జిల్లాలో భూ సేకరణకు సంబంధించి ఎమ్మెల్సీ పోతుల సునీత ప్రశ్నించగా మంత్రి జవాబిస్తూ పట్టిసీమలో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి భూసేకరణ చేపట్టలేదన్నారు. పథకం ఒకటో దశకు అవసరమైన భూమిలో 6,683 ఎకరాల అటవీ భూమిని డీనోటిఫై చేసేందుకు అనుమతి కోరగా ఇప్పటివరకు 859 ఎకరాలకు అనుమతి లభించిందన్నారు. తూర్పు గోదావరి జిల్లాల్లో నదీ ప్రవాహాల కారణంగా భూమి కోత నుండి కాపాడేందుకు ప్రభుత్వ చర్యలను ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ ప్రశ్నించగా.. రూ 305.34 కోట్లతో గోదావరి జిల్లాల్లో పిట్చింగ్ ప్లాట్ ఫారాలు, అడ్డుకట్టలను ఏర్పాటు చేయడం ద్వారా 21 రక్షిత పనులను చేపడుతున్నామని చెప్పారు. వరదల కారణంగా కోతను నివారించేందుకు తూర్పు గోదావరి జిల్లాలో వైనతేయ కుడి వరద గట్టు 16.3 నుండి 18.5 కిమీ వరకు కోతకు గురయ్యే రీచ్ వద్ద గల 16.5 కోట్లతో కొత్త రక్షిత పని ప్రతిపాదనలో ఉందన్నారు. కబేళాలను ఆధునీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఎమ్మెల్సీ రాము సూర్యారావు ప్రశ్నించగా పురపాలక శాఖ మంత్రి నారాయణ సమాధానమిస్తూ కబేళాలు లేని, 25 పట్టణ స్థానిక సంస్థలలో కొత్త కబేళాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాటి కోసం స్థలాలను గుర్తిస్తున్నామని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో విశాఖలో ఉన్న విధంగా ఆధునిక కబేళాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఎంఏ షరీఫ్ సూచించారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ నీటి నాణ్యతను పరిశీలించే హెల్త్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేసి నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎంవివిఎస్. మూర్తి, వివి చౌదరి అరకు కాఫీ కి మార్కెటింగ్‌కు సంబంధించి ప్రశ్నించగా మంత్రి నక్కా ఆనందబాబు సమాధానమిస్తూ మార్కెటింగ్, గిట్టుబాటు ధర కోసం గిరిజన సహకార సంఘం (జిసిసి) ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పంచాయతీలకు ర్యాంకులను ప్రకటించే విషయం పై మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ మిషన్ అంత్యోదయ ద్వారా రాష్ట్రంలో 2213 గ్రామపంచాయతీలకు ర్యాంకులు ప్రకటించామని తెలిపారు. చేనేత కార్మికులకు ప్రభుత్వ చేయూతపై వి. గోపాలరెడ్డి ప్రశ్నించగా మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ రూ 75 కోట్లు చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్క్ ఉన్నప్పటికీ అందులో చేనేతకు సంబంధించిన కార్యకలాపాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మగ్గాలు, పనిముట్లు కూడా యాజై శాతం సబ్సిడీకి అందించాలన్నారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్రాజెక్టుపై మంత్రి కళా వెంకట్రావు మాట్లాడుతూ నిరంతర విద్యుత్ పథకం కింద సౌరశక్తి ప్రాజెక్టు లక్ష్యం 5105 మెగావాట్లు అదనపు సామర్థ్యంగా నిర్దేశించామన్నారు. ఇప్పటివరకు 2.17 కోట్ల ఎల్ఇడి బల్బులను పంపిణీ చేశామన్నారు. ఎన్‌డియాఫ్ ఉపాధ్యాయ పథకం కింద కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ 191.41 కోట్లు కేటాయించిందన్నారు. ఈ పథకానికి కేంద్రం ఏపికి 925 కోట్లు కేటాయించి, కేవలం రూ 211 కోట్లే ఇచ్చిందన్నారు.

ఓట్ల కోసమే కేంద్రంపై విమర్శలు

బడ్జెట్‌లో మూడోవంతు కేంద్ర నిధులే

బిజెపి శాసనసభా నేత విష్ణుకుమార్‌రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంతవరకు కలిసి ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఓట్ల కోసమే యూ టర్న్ తీసుకుని కేంద్రాన్ని విమర్శిస్తోందని బిజెపి శాసనసభా పక్ష నేత విష్ణుకుమారరాజు అన్నారు. బడ్జెట్ చర్చలో భాగంగా శుక్రవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ టిడిపి వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 14వ ఆర్థిక సంఘం నిబంధనల మేరకే ప్రత్యేక హోదా ఇవ్వలేకపోయినా అదనంగా వచ్చే 30 శాతం అంటే సుమారుగా రూ.16 వేల కోట్లు నిధులు మంజూరు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని మరోసారి స్పష్టం చేశారు. పొత్తు విడిపోయాక ఒకవిధంగా విడిపోక ముందు ఒక విధంగా తాను మాట్లాడనన్నారు. ప్రజా సమస్యలపైనే తన పోరాటమన్నారు. కేంద్రం నుంచి రూ.50,696 కోట్లు వస్తాయని మొత్తం బడ్జెట్‌లో ఇది మూడో వంతుకు సమానమని ఆయన తెల్పి చెప్పారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణాలన్నీ కేంద్రం నిధులతోనేనని, పోలవరం ప్రాజెక్ట్ కట్టేది కూడా కేంద్ర ప్రభుత్వమేనని ఆయన వివరించారు. వివిధ పథకాల అమలుకు బ్యాంకులు సహకరించడంలేదని విమర్శిం చారు. కాపు, వైశ్య, బ్రాహ్మణ కులాలకు కేటాయించినట్లే అన్ని ఫార్వార్డ్ కులాలకు నిధులు కేటాయించాలని ఆయన కోరారు. అడ్డూ అదుపూ లేని ఎక్సైజ్ విధానంతో రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గుడి, బడి తేడా లేకుండా 100 మీటర్ల నిబంధన పేరుతో రాష్ట్రంలో 5,292 మద్యం దుకాణాలకు అనుమతులిచ్చి ప్రజలతో ప్రభుత్వమే తెగ తాగించేస్తోందని విమర్శించారు. మద్యం ఆదాయం కోసం జాతీయ రహదారులను రాష్ట్ర రహదారులుగా మార్పు చేయ డం దారుణమన్నారు. ప్రస్తుత మద్యం దుకాణాల సంఖ్యలను 50 శాతానికి తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

సంపాదకీయం

కొరియాలో శాంతి పవనాలు

ఉప్పు నిప్పులాంటి ఉత్తర కొరియా, అమెరికా మధ్య త్వరలోనే శిఖరాగ్ర స్థాయి శాంతి చర్చలు జరుగనున్నాయని వస్తున్న వార్తలు మండుటెండల్లో ఒక్కసారిగా శీతల పవనాలు వీచినట్లనిపిస్తోంది. ఉత్తర కొరియా అణ్వస్త్ర కార్యక్రమాన్ని కట్టిపెట్టకపోతే అణుబాంబులతో ఆ దేశాన్ని భస్మీపటలం చేస్తానని హూంకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియా నేత కిమ్-ఇల్ ఉన్‌తో శిఖరాగ్ర చర్చలు జరపడానికి అంగీకరించడం అంతర్జాతీయ పరిణామాల్లో ఒక గొప్ప మలుపుగా చెప్పవచ్చు. ఇరు దేశాధినేతల మధ్య చర్చలు జరుగుతాయన్న విషయాన్ని రెండు దేశాలు నిర్ధారించాయి. కొరియా ద్వీపకల్పంలో మొదటి నుండి శాంతిని కోరుకుంటున్న చైనా, రష్యాలు దీన్ని స్వాగతించాయి. దక్షిణ కొరియా ట్రంప్ - ఉన్ చర్చలను స్వాగతించడమే కాకుండా దానికి ముందుగానే ఉభయ కొరియా అగ్రనేతలు కలుసుకోడానికి ఏర్పాట్లు చేస్తోంది. కొరియా రాజకీయాల్లో ప్రధాన పాత్ర వహిస్తున్న ఒక్క జపాన్ మాత్రమే చర్చల పట్ల పెదవి విరుస్తోంది. మొత్తం మీద నిన్నటి వరకు యుద్ధానికి దారితీస్తుందా అని ప్రపంచమంతా భయపడిన కొరియా ద్వీపకల్పం సమస్య ఇలా శాంతివైపు పయనించడం సంతోషించాల్సిన విషయం.

65 ఏళ్ల క్రితం కొరియాపై దాడి చేసి దాన్ని రెండు దేశాలుగా విభజించిన అమెరికా అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ ద్వీపకల్పంలో చిచ్చుపెడుతూనే ఉన్నది. దాదాపు 25 వేల మంది అమెరికా సైన్యం అధునాతన మారణాయుధాలతో దక్షిణ కొరియాలో తిష్ట వేసి ఉన్నారు. దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి అది నిత్యం ఉత్తర కొరియాపై కాలు దువ్వుతూనే ఉంది. జపాన్‌లో అమెరికా సైనిక స్థావరం, కొరియా జలాల్లో దాని యుద్ధ నౌకలు నిత్యం ఉత్తర కొరియాకు పక్కలో బల్లెంలా ఉంటూ వస్తున్నాయి. కొరియా విప్లవ నేత కిమ్ ఇల్ సంగ్ నేతృత్వంలో కొరియా దళాలు అమెరికాపై విజయం సాధించినప్పటి నుండి ఉత్తర కొరియాను మట్టుపెట్టడానికి అమెరికా చేయని ప్రయత్నాలు లేవు. కిమ్ ఇల్ సంగ్ నేతృత్వంలో తరువాత ఆయన కుమారుడు కిమ్ జోంగ్ ఇల్, నేడు ఆయన కుమారుడు కిమ్ ఇల్ ఉన్ నేతృత్వాల్లో కొరియా ప్రజలు అమెరికా కుట్రలు, కుయుక్తులను తిప్పి కొడుతూనే ఉన్నారు. అమెరికా - దక్షిణ కొరియా - జపాన్ కూటమి దాడులను ఎదుర్కొని దేశ సార్వభౌమత్వాన్ని నిలుపుకోడానికి ఉత్తర కొరియా తన పరిమిత వనరులను సైనిక పాటవం సమకూర్చుకోడానికి మళ్లించినందున ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులను కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది. అయినా కొరియా ప్రజలు ఈ ఆరున్నర దశాబ్దాలుగా అమెరికా సామ్రాజ్యవాదులకు ఎదురు నిలిచి పోరాడుతూనే ఉన్నారు.

ఉత్తర కొరియా అణ్వస్త్ర నిరోధక ఒప్పందంలో చేరినప్పటికీ అమెరికా దానిపై కక్ష సాధింపు మానుకోకపోవడంతో అది ఒప్పందం నుండి బయటకు వచ్చేసింది. స్వతంత్రంగా అణు కార్యక్రమం రూపొందించడం ప్రారంభించింది. దాంతో అమెరికా ఆంక్షలకు, బెదిరింపులకు దిగింది. 90వ దశకంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో దాన్ని నివారించడానికి చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఫలితంగా ఆరుదేశాలతో ఏర్పడిన శాంతి చర్చల ప్రక్రియ కొంతకాలం నడిచింది. కానీ అమెరికా కవ్వింపులతో ఆ ప్రక్రియ కుప్పకూలిపోయింది. ఇరాక్, లిబియా తదితర దేశాలపై అమెరికా దాడి చేసి, ప్రభుత్వాలు మార్చిన తరువాత ఆ దేశాలకు పట్టిన గతిని చూసిన ఉత్తర కొరియా అణ్వస్త్ర కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. వెంట వెంటనే అణు బాంబులనూ, వాటిని మోసుకుపోగల ఆధునిక క్షిపణులను పరీక్షించింది. అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తర కొరియాపై దురాక్రమణ యత్నాలను ముమ్మరం చేశారు. ఫైర్ అండ్ ఫ్యూరీ పేరుతో దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి కొరియా ద్వీపకల్పంలో అమెరికా జరిపిన యుద్ధ విన్యాసాలకు ప్రతిగా కొరియా అణు పరీక్షలు ముమ్మరం చేసింది. అమెరికా దాడికి దిగితే ప్రతిగా దాని మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియాలను నాశనం చేయగల అణు, క్షిపణి సామర్థ్యాన్ని సమకూర్చుకుంది. తన ఖండాంతర బ్యాలిస్టిక్ క్షిపణులు అమెరికాను కూడా చేరగలవని ప్రకటించింది. దాంతో యుద్ధ నాదాలు తగ్గి శాంతి వచనాలు పెరిగాయి.

ఉత్తర కొరియాలో కొత్తగా అధికారం చేపట్టిన లిబరల్ పార్టీ అధ్యక్షుడు కిమ్ జే మూన్ ఉత్తర కొరియాతో రాజీకి ప్రధాన్యత ఇవ్వడం, చైనా, రష్యాల దైత్యం... కొరియాలో మళ్లీ శాంతి స్థాపనకు బీజాలు వేశాయి. దక్షిణ కొరియాలో జరిగిన శీతాకాల ఒలింపిక్స్ సందర్భంగా జరిగిన దౌత్యం ఇందులో ఒక పెద్ద ముందడుగు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ ఇల్ ఉన్ అంగీకరించడమే కాదు తన చెల్లెల్ని క్రీడా పోటీలకు పంపించి దౌత్యం నడిపారు. రెండు దేశాలు ఒకే పతాకం కింద పోటీల్లో పాల్గొన్నాయి, ఐస్ హాకీ పోటీలో ఉమ్మడి టీమ్ పాల్గొంది. తదనంతరం వేగంగా జరిగిన పరిణామాలు కొరియాలో శాంతి వైపు వడివడిగా అడుగులు వేయించాయి. ఆ పరిణామాల ఫలితమే నేడు కిమ్ ఇల్ ఉన్ - ట్రంప్ మధ్య శిఖరాగ్ర సభ జరపాలన్న అంగీకారం. ఇరువురు నేతలు మే నెలలో చర్చలు జరపవచ్చని భావిస్తున్నారు. చర్చలు ఎక్కడ జరుగుతాయి, ఎజెండా ఏమిటి అన్న విషయాలు ఇంకా ఖరారు కాకపోయినప్పటికీ ఉత్తర కొరియా అణు కార్యక్రమం, దానిపై అమెరికా విధించిన ఆంక్షలు చర్చల్లో ప్రధానాంశాలుగా ఉంటాయి. ఏమైనా ఈ చర్చలు ఆటంకాలు లేకుండా జరగాలనీ, సత్ఫలితాలివ్వాలనీ కోరుకోని వారుండరు.

ఇదీ విషయం



అన్యాయం కలిసి చేసి
విడిపోతే ఎలా చెప్పు...
మూల్యం చెల్లించకుండ
వదిలేస్తే మహా తప్పు!


అవిశ్వాసం పైనైనా
విశ్వాసం ఉంచు బాబు...
జనం గొంతుతో నైనా
స్వరం కలుపు రేపు!

- కొల్లూరు వెంకట్

'గుంటూరు' హెచ్చరికను పట్టించుకోరా?

విశ్లేషణ

ఇటీవల రాష్ట్ర రాజధానిలోని గుంటూరు నగరంలో కలుషిత నీరు తాగిన 12 మంది పేదలు అతిసార వ్యాధితో మరణించడం పెను విషాదం. వందలాది మంది తీవ్ర అస్వస్థతకు గురై ఇంకా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనే 641 మంది బాధితులను గుర్తించినట్లు జిల్లా మంత్రి పుల్లారావు ప్రకటించారంటే పరిస్థితి తీవ్రత విదితమవుతుంది. ఈ అంశంపై శాసనసభలో మాట్లాడిన మున్సిపల్ శాఖా మంత్రి ఆ నేరాన్ని ఉద్యోగ బృందంపై నెట్టేసి చేతులు దులుపుకోవడం అమానవీయం. సమర్థవంతమైన పాలనను అందిస్తామని, అందుకు అధునాతన టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని డ్యాష్ బోర్డు, రియల్‌టైమ్ గవర్నెన్స్ లాంటి మాటలు చెప్పే ప్రభుత్వ పెద్దలు ఇందుకు బాధ్యత తీసుకోవడానికి నిరాకరించడం క్షంతవ్యం కాదు. ఒక రైలు ప్రమాదం జరిగితే తన మంత్రి పదవికి రాజీనామా చేసిన లాల్ బహదూర్ శాస్త్రి ఔన్నత్యాన్ని గురించి ఈనాటికీ చెప్పుకుంటున్నాం. నిరంతరం ఆదర్శాలు వల్లె వేస్తూ, పాలనా దక్షులమని జబ్బలు చరుచుకునే ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖామాత్యులకు ఆ విషయం మాత్రం గుర్తుకు రావడం లేదు.



బి తులసీదాస్

గుంటూరు నగరంలోని ఆనందపేట, సంగడిగుంట తదితర ప్రాంతాలలో నగర పాలక సంస్థ సరఫరా చేసిన కలుషిత నీటిని తాగి ఫిబ్రవరి చివరి, మార్చి మొదటి వారాల్లో వందలాది మంది అతిసార వ్యాధి బారిన పడ్డారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితోపాటు అనేక ప్రయివేటు ఆస్పత్రులలో చికిత్స పొందారు. మార్చి 5 నుండి 8 తేదీల మధ్య 12 మంది మృత్యువాత పడ్డారు. వారం రోజులు గడిచినా ఇంకా కొంతమంది చికిత్స పొందుతున్నారు. మూత్రపిండాలు దెబ్బతిన్నందున కొందరికి డయాలసిస్ కూడా కొనసాగించవలసి వస్తోంది. అతిసార వ్యాధి బారిన పడ్డ ప్రాంతంలో ప్రధానంగా నివసించేది పేదలే. మృతుల్లో ఎక్కువ మంది మైనార్టీలు, బలహీన వర్గాలకు చెందినవారే కావడం గమనార్హం.

డ్యాష్‌బోర్డు, రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టిజి) వంటివి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు బయోమెట్రిక్ పద్ధతిలో తీసుకోవడానికి, ఎక్కడైనా ప్రజలు ఆందోళన చేస్తే వారిని ఫోటో తీసే డ్రోన్‌లను తిప్పడం లాంటి పనులు చేయడమే తప్ప ఆ టెక్నాలజీని ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు వాడుతున్నట్లు లేదు. ముఖ్యమంత్రి డ్యాష్‌బోర్డుగా చెప్పబడే core.ap.gov.in వెబ్‌సైట్ పరిశీలిస్తే ఈ అభిప్రాయం ఎవరికైనా కలుగుతుంది. డ్యాష్‌బోర్డులోని మున్సిపల్ పరిపాలనా శాఖ విభాగంలో రాష్ట్రంలోని 110 పట్టణ స్థానిక సంస్థలలో ఆస్తి పన్ను మొదలు వీధి కుక్కల బెడద వరకు అనేక అంశాలుంటాయి. అందులో నీటి సరఫరా పైపులైన్ లీకేజిలపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు కూడా పేర్కొంటున్నారు. ఏ ఫిర్యాదు ఎవరు ఎప్పుడు చేశారు, దాన్ని ఎప్పుడు పరిష్కరించారు లేక ఇంకా పెండింగ్‌లోనే ఉందా లాంటి విషయాలు పొందుపరుస్తున్నారు. ఒక స్థానిక సంస్థలో పరిస్థితి ఎలా ఉందనేది ప్రపంచంలో ఏ మూలనుంచైనా తెలుసుకునే అవకాశం వుండడం మంచిదే!

> ఫిర్యాదుల నమోదు అన్నది ఒక ప్రమాద సంకేతం. అంటే ముందే హెచ్చరికలు వచ్చినా మున్సిపల్ మంత్రి గానీ, తాజాగా రాజీనామా చేసిన ఆరోగ్య శాఖా మంత్రి గానీ లేక సిఎం డ్యాష్‌బోర్డు గనుక అధినేత గానీ ఈ అంశాల పట్ల నామమాత్రపు శ్రద్ధ కూడా పెట్టిన దాఖలా లేదు. వారిలో ఒకరైనా ఈ అంశంపై దృష్టి పెట్టి ఉంటే 12 పేద ప్రాణాలు గాలిలో కలిసి పోయేవి కాదు. వందలాది కుటుంబాలు వేదనను అనుభవించేవి కావు.

అతిసార వ్యాధి కేసులు - మరణాలు

సంవత్సరం	2015		2016	
రాష్ట్రం	కేసుల సంఖ్య	మృతులు	కేసుల సంఖ్య	మృతులు
ఆంధ్రప్రదేశ్	11,22,740	5	11,94,005	11
తెలంగాణ	9,63,573	20	8,71,947	17
కర్నాటక	8,32,356	13	9,30,369	4
తమిళనాడు	3,08,358	8	3,67,815	9
ఒడిషా	7,82,151	139	7,75,824	103
పశ్చిమ బెంగాల్	17,98,754	196	20,45,451	192
భారత్	1,29,13,606	1,353	1,39,23,275	1,540



అయితే ఈ దుర్ఘటన జరగడానికి వారం రోజుల ముందు అంటే ఫిబ్రవరి 26 నుండి మార్చి 4 వరకు డ్యాష్ బోర్డులో మంచి నీటి పైపులైన్ లీకేజిపై రాష్ట్రంలోని 21 స్థానిక సంస్థల నుండి 49 ఫిర్యాదులు నమోదు కాగా వాటిలో కేవలం గుంటూరు నగర పాలక సంస్థకు చెందినవి 18. అంటే ఆ వారంలో రాష్ట్ర ఫిర్యాదుల్లోని మూడవ వంతు ఒక్క గుంటూరు నగరం నుండే వచ్చాయన్నమాట. ఆ వారంలో వచ్చిన ఫిర్యాదుల్లో రెండవ స్థానం నెల్లూరు (4), మూడో స్థానం కర్నూలు (3) నగర పాలక సంస్థలది. గత ఏడాది అదే వారంలో రాష్ట్రమంతటా 36 ఫిర్యాదులు నమోదు కాగా గుంటూరు నుండి ఒక్కటి కూడా లేదు. అంతేగాక 2018 ఫిబ్రవరి నెలలో 43 స్థానిక సంస్థల నుండి 258 ఫిర్యాదులు నమోదు కాగా వాటిలో 64 ఫిర్యాదులతో (నాల్గవ వంతు)గుంటూరు నగర పాలక సంస్థదే మొదటి స్థానం. ఒక నెల రోజులపాటు రాష్ట్రంలోని ఫిర్యాదుల్లో 25 శాతం ఒకే నగరం నుండి నమోదు కావడం మాత్రమే కాక తరువాతి వారంలో అవి 33 శాతానికి చేరుకున్నాయంటే పరిస్థితి నానాటికీ దిగజారుతోందని విదితమవుతుంది. ఈ వివరాలన్నింటినీ సమగ్రంగా విశ్లేషిస్తే గుంటూరు నగరంలో మంచి నీటి సరఫరా ప్రమాదంలో ఉందని స్పష్టంగా తెలుస్తుంది. ఇది హఠాత్పరిణామం కాదని తేటతెల్లమవుతుంది.

ఫిర్యాదుల నమోదు అన్నది ఒక ప్రమాద సంకేతం. అంటే ముందే హెచ్చరికలు వచ్చినా మున్సిపల్ మంత్రి గానీ, తాజాగా రాజీనామా చేసిన ఆరోగ్య శాఖా మంత్రి గానీ లేక సిఎం డ్యాష్‌బోర్డు గనుక అధినేత గానీ ఈ అంశాల పట్ల నామమాత్రపు శ్రద్ధ కూడా పెట్టిన దాఖలా లేదు. వారిలో ఒకరైనా ఈ అంశంపై దృష్టి పెట్టి ఉంటే 12 పేద ప్రాణాలు గాలిలో కలిసి పోయేవి కాదు. వందలాది కుటుంబాలు వేదనను అనుభవించేవి కావు. కానీ మున్సిపల్ మంత్రి శాసన సభలో 'అయివుండొచ్చు', 'కావచ్చు' అని మాట్లాడడం బాధ్యతా రహితం. అంతేగాక శాసనసభను తప్పుదారి పట్టించడమే అవుతుంది. ఇదిలా వుంటే రియల్‌టైమ్ గవర్నెన్స్ గొప్పగా ఉందని గవర్నర్ నరసింహన్ మార్చి 5న ముఖ్యమంత్రిని ఆకాశానికెత్తేశారు. పై వివరాలు విశ్లేషిస్తే ఆనాటికే గుంటూరు నగరంలో మంచి నీటి సరఫరా ప్రమాదకర పరిస్థితిలో ఉంది. కానీ దానిని ఆర్‌టిజి పట్టించుకోలేదు. అయినా సిఎంను గవర్నర్ పదేపదే ప్రశంసించారు. ఆ రోజు ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో సర్కారు గురించి ఆత్మ స్తుతి, అర్ధ సత్యాలు వల్లించినట్టే సిఎం పాలనా దక్షతను కూడా పొగిడారన్నమాట.

ప్రజల ప్రాణాలను బలి తీసుకునే వాటిలో అతిసార వ్యాధి పెద్ద మహమ్మారి. అతిసార వ్యాధి నివారణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ఏడు అంశాల్లో 'సురక్షిత మంచినీటిని అందించడం' మొట్టమొదటిగా ఉంది. అతిసార నివారణలో సురక్షిత మంచినీటి ప్రాధాన్యత అదీ! కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వెలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి) నివేదిక ప్రకారం 2017లో దేశమంతటా 1,649 అవుట్ బ్రేక్స్ (వ్యాప్తి)కాగా వాటిలో అతిసార వ్యాధి 312 చోట్ల ప్రబలింది. మన దేశంలో అవుట్ బ్రేక్స్‌లో అతిసార వ్యాధిది ప్రథమ స్థానం అయితే, విషాహారం సేవించడం రెండవదిగా ఉంది. దేశంలో 2008 నుండి ఇదే తీరు కొనసాగుతోంది. ఆ ఏడాది అతిసార వ్యాధి 228 చోట్ల ప్రబలగా 2017 ముగిసే సరికి 312కు పెరిగింది. దేశంలో అతిసార వ్యాధి ప్రబలుతున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం రెండవదిగా ఉండడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ హెల్త్ ప్రొఫైల్ 2017 మన ఇరుగుపొరుగు రాష్ట్రాలు, దేశంలో అత్యధిక అతిసార కేసులు నమోదైన రాష్ట్రాలకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే మన రాష్ట్రం ఎంత దయనీయ పరిస్థితిలో ఉందో బోధపడుతుంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వుండకపోడం దారుణం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖల సమాచారాన్ని బట్టి అతిసార వ్యాధి ప్రబలకుండా చూడడం ఎంత అవసరమో స్పష్టమవుతుంది. ప్రజారోగ్యం పట్ల పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకునేవి కావు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమానికి ఉపయోగించాలి తప్ప పాలకుల సొంత డబ్బా కొట్టుకోవడానికి కాదు. ✦

సోషల్ మీడియా

'మహా' రైతు ఉద్యమం



అన్నదాతలు అనూహ్యంగా కదిలారు. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కర్షకులు కదం తొక్కారు. కొత్త స్ఫూర్తి నింపారు. స్వతంత్ర్య భారతదేశ చరిత్రలో రైతాంగ ఉద్యమాల్లో లిఖించదగిన ఘనతను సాధించారు. మహారాష్ట్ర రైతులు తమ ఘోషను దేశమంతటా కాక ప్రపంచమంతటా చాటారు. మారుమూల గిరిజన పల్లెల నుంచి తమ అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని, రుణమాఫీ కోసం ఇచ్చిన హామీ అమలు చేయాలని కదిలిన కర్షక తరంగాన్ని ప్రారంభంలో మీడియా గుర్తించలేకపోయింది. తొలుత మహారాష్ట్ర లోని స్థానిక పత్రికలు లోపలి పేజీలకే పరిమితం చేశాయి. మొదటి రెండు రోజులు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోయినా రైతు స్వరం రణమై, భాస్వరమై ప్రజ్వరిల్లడంతో ఆ తర్వాత స్థానిక టీవీ చానెళ్ల కెమెరాల దృష్టి అటు మళ్లింది. అదే సమయంలో పత్రికలు, టీవీల కన్నా మిన్నగా సోషల్ మీడియా ఈ ఉద్యమంలో కీలకంగా మారింది. వాట్సాప్, ఫేస్ బుక్, ట్విటర్, యూట్యూబ్ లలో రైతు ఉద్యమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు హల్ చల్ చేశాయి. దేశ చరిత్రలో తొలిసారిగా ఓ ప్రజాసమస్య ట్విటర్ ట్రెండింగ్‌లో మొదటి స్థానంలో నిలిచిందంటే ఆశ్చర్యం కలిగించక మానదు. యాత్ర ముంబై ఆజాద్ మైదానానికి చేరుకోబోతున్న రోజు ఏకంగా 86 వేల ట్వీట్లతో కిసాన్ లాంగ్ మార్చ్ నెంబర్ వన్‌గా నిలిచింది. రైతులు రోడ్ల మీద పాదయాత్ర సాగిస్తుంటే వారికి మద్దతుగా ఆన్‌లైన్ లో లభించిన అనూహ్య స్పందనగా దీనిని చెప్పవచ్చు. దేశమంతటా ఇదో పెద్ద హాట్ టాపిక్ గా మార్చడంలో సోషల్ మీడియాదే కీలక పాత్రగా కనిపించింది. ట్విటర్‌లో కిసాన్ మార్చ్‌కి లభించిన ఆదరణతో చివరకు ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్న చానెళ్లు కూడా కదలాల్సి వచ్చింది. అన్ని చానెళ్లలోనూ రైతు ఉద్యమం కవర్ చేయాల్సిన స్థితికి ట్విటర్ తీసుకొచ్చింది. అదే సమయంలో వాట్సాప్, ఫేస్ బుక్ ద్వారా పాదయాత్రికుల ఫోటోలు విశేషంగా షేర్ అయ్యాయి. రైతులకు మద్దతుగా నెటిజన్ల నుంచి అమోఘ స్పందన వచ్చింది. యూట్యూబ్‌లో కూడా రైతు ఉద్యమాలకు సంబంధించిన వీడియోలు విశేషంగా వ్యూస్ సాధించాయి. ఇరుకు రోడ్డులో, గుబురు చెట్ల మధ్య రైతులు ఎర్రజెండాలు చేబూని కదులుతున్న ఒక్క వీడియో లక్షల సంఖ్యలో షేర్లు సాధించింది. సంప్రదాయ మీడియా విస్మరించిన చోట, విస్తృతంగా వ్యాపించిన సోషల్ మీడియా ద్వారా రైతు మహోద్యమం కోట్ల మందికి చేరింది. చివరకు బీబీసీ, వాషింగ్టన్ పోస్ట్ వంటి పత్రికల్లో కథనాలు రావడానికి సోషల్ మీడియా ద్వారా సాగిన ప్రచారమే మూలం.

కార్పొరేట్ మీడియాలో సామాన్యుడికి, అందులోనూ కర్షకుడికి ప్రాధాన్యత ఎప్పుడో పోయింది. చాలాకాలం క్రితమే వ్యవసాయ రంగం రిపోర్టింగ్ విధానం ఎత్తేశారు. అందుకే ఇంత పెద్ద స్థాయిలో రైతులు రణం సాగిస్తుంటే కనీసం ముందుగా దానిని గమనించ లేని స్థితిలో ఉండిపోయామని పలువురు జాతీయ స్థాయి మీడియా ప్రతినిధులు అంగీకరించక తప్పలేదు. రైతు కదిలిన తర్వాత కూడా కనీసం స్పందించలేకపోయామని వాపోయారు. శ్రీదేవి మరణించినప్పుడు చివరకు బాత్‌రూమ్‌లో, బాత్‌టబ్‌లో పడుకుని రిపోర్టింగ్ చేసిన వాళ్లు రైతు గొంతు వినిపించలేకపోయారు. సెలబ్రిటీలు, సంచలనాలు మాత్రమే వార్తాంశాలుగా మారుతున్న సమయంలో కడుపు నింపుతున్న వాడు కనిపించకపోయాడు. డబ్బావాలాలు మధ్యాహ్న భోజనాన్ని తీసుకెళ్లి తమకు నిత్యం అన్నం పెడుతున్న రైతు ఆకలి మంట చల్లార్చాలని భావించడం చూసైనా మీడియా మానవత్వాన్ని ప్రదర్శించలేకపోయింది. సోషల్ మీడియా సహాయంతో సమాచారం అందుకుని, కాళ్లకు చెప్పులు కూడా లేకుండా ఆరు రోజుల పాటు పగలూ, రాత్రి కాలి నడక సాగించినప్పటికీ మీడియా పెద్దలకు మాత్రం మనసు కరగలేదు. దీన్నిబట్టే సామాన్యుడికి మీడియాలో ఏమాత్రం చోటు దక్కుతుందో అర్థం చేసుకోవచ్చు.

అందుకే సోషల్ మీడియాను మరింత ప్రజాస్వామ్యయుతం చేయాల్సిన అవసరం ఉంది. జన స్వరానికి వేదికగా మలచుకోవాల్సి ఉంది. తద్వారా సంప్రదాయ మీడియాను కదిలించే అవకాశం ఉంది. ఏదో మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు కూడా కవరేజ్ ఇవ్వాల్సిన అనివార్యత తీసుకురావాల్సి ఉంది.

- శంకర్

జన వాక్యం

గుర్తుంచుకోండి!

ప్రస్తుతం పార్లమెంటరీ వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలు నేతల కప్పదాటు ధోరణికి నిదర్శనంగా వున్నాయి. 2014 ఎన్నికల సమయంలో ఏపికి పదేళ్ల ప్రత్యేక హోదా కావాలని వాదించిన పెద్ద మనుషులు పీఠమెక్కగానే మాట మార్చారు. అంతెందుకు! మన రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క ప్రధాన హామీనీ నెరవేర్చలేకపోయారు. మొన్నటి వరకు ఊరించిన రైల్వే జోన్ కూడా రాదని స్పష్టం చేసేశారు. ఇటువంటి పెద్దల పట్ల, వారి పెద్దరికం పట్ల మనకు నమ్మకం ఎలా కలుగుతుంది? అందుకే ఇకనైనా ఓటు ఓసే ముందు ఈ నేతల మాటలను గుర్తుంచుకోవాలి. ఓటుతోనే వారందరికీ బుద్ధి చెప్పాలి.

ఎస్ ఎస్ కుమార్, తిరుపతి.

కవులకు ప్రోత్సాహం...

ఇటీవల కొన్ని జిల్లాల్లో రెండో శనివారం, కొన్ని సెలవు రోజుల్లో కొన్ని సంస్థల వారు సాహిత్య సభలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది శుభ పరిణామం. తెలుగు భాష అభివృద్ధికి ఇవి ఎంతో దోహదం చేస్తాయి. అయితే సభా పద్ధతులు మారాలి. ముఖ్యంగా వక్తలు సమయపాలన పాటించాలి. ఇలాంటి సాహిత్య సభలలో చివరిగా కవితా గోష్ఠి నిర్వహిస్తూ వుండటం ఆనవాయితీగా మారింది. ఇది కూడా వర్ధమాన కవులకు, కవయిత్రులకు మంచి ఉత్తేజం కలిగిస్తుంది. అయితే ఈ కవితా గోష్ఠి కార్యక్రమం చివరిగా అంటే రాత్రి సమయంలో పెట్టడం వల్ల దూర ప్రాంతాల నుండి వచ్చి పాల్గొనేవారికి ప్రయాణ ఇబ్బందుల తలెత్తుతున్నాయి. కొన్ని జిల్లాల్లో ప్రతి నెలా క్రమం తప్పకుండా కవితా గోష్ఠులు నిర్వహిస్తున్నారు. అయితే కవితా వస్తువుపై కవులకు స్వేచ్ఛ ఇవ్వాలి. అలాగే ఉత్తమ కవితలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు ఇవ్వాలి.

జె సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

ఆధార్ కూడలిలో భారత ప్రజాస్వామ్యం

భారతీయులందరికీ గుర్తింపు ఆధారాన్ని అందించాలన్న ప్రకటిత లక్ష్యంతో 2009లో మొదలైన ఆధార్ కార్డు ప్రహసనం పతాక సన్నివేశానికి అతి చేరువలో ఉంది. ఇదేదో ప్రజలకు ఆధారంగా నిలుస్తుందని మొదట్లో అనిపించినా ఏకుమేకై చివరికి అశేష ప్రజా బాహుళ్యపు జీవితాలన్నీ తనపైన ఆధారపడేటట్లు చేయడమే దాని అప్రకటిత లక్ష్యమని తేలిపోతోంది. 'అందరికీ ఆధార్ కార్డు' విధానం అసలు స్వరూపం ఏంటి? అనేది దాని గమనాన్ని లోతుగా పరిశీలిస్తే తప్ప పూర్తిగా అర్థం కాదు.

గుర్తింపు కార్డుగా మొదలైన ఆధార్ ప్రస్థానం క్రమంగా ఇతర విషయాల్లోకి సైతం పాకసాగింది. నిజానికి ఆధార్ కార్డు పొందిన వారిలో 99.97 శాతం మంది తమ వద్ద ఇదివరకే ఉన్న గుర్తింపు కార్డు చూపించే పొందారు. అంటే కేవలం 0.03 శాతం మంది ప్రజలకు ఆధార్ కొత్తగా గుర్తింపు ప్రసాదించిందన్నమాట. అది మంచి విషయమే అయినా అందుకోసం కోట్లాది పని గంటలు వృథా చేయించడం మన పాలకులకే చెల్లింది. తద్వారా ఈ ఆధార్ కార్డు కనీవినీ ఎరుగనంత సామాజిక నష్టాన్ని కలుగజేసింది. దాంతో పాటు భారత రాజ్యాంగం, వివిధ చట్టాలు మన పౌరులకు ప్రసాదించిన అనేక నిర్దుష్టమైన హక్కులు ఆధార్‌కార్డు ఉంటేనే లభించేటట్లుగా షరతులతో కూడిన హక్కులుగా మారాయి. విచిత్రమేమిటంటే ఏ రకమైన చట్టబద్ధతా లేకుండానే ఈ ఆధార్ కార్డు నూరు కోట్లకి పైగా ఉన్న భారత ప్రజల మీద రుద్దబడింది. పార్లమెంటరీ సంఘం వ్యతిరేకించినా, అనేక మార్లు మన అత్యున్నత న్యాయస్థానం అక్షింతలు వేసినా వెరవక భారత ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ఆధార్ కార్డు ప్రాజెక్టును ముందుకే తీసుకుపోయింది. అప్పట్లో దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ముఖ్య నాయకుల్లో మన ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఉండటం గమనార్హం. అలాంటిది అంతకు ముందు ప్రభుత్వం కంటే మరింత దూకుడుగా ఆధార్ ప్రాజెక్టు అమలు చేయడం రాజకీయ కుప్పిగంతులు కాక మరేంటి? ఇంకొక విచిత్రమేంటంటే అప్పటి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న చిదంబరం, కపిల్ సిబాల్ వంటి వారు ఆధార్‌కి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వాదించడమే! ఏతావాతా ఏంటంటే పాత్రధారులు మారడమే తప్ప పాత్రలలో పెద్దగా తేడా ఏమీ ఉండట్లేదనే! అధికారంలో ఎవరున్నా ఆధార్ వల్ల పాలక వర్గాలకు ఒనగూడే ప్రయోజనాలను వదులుకోడానికి సిద్ధంగా లేరనే! అందుకే గ్యాస్ సిలిండర్ల కనెక్షన్‌తో మొదలైన ఈ ఆధార్ కార్డు విషపు వల రేషన్‌షాపులకీ, ఎరువుల కొనుగోలుకూ, మొబైల్‌ఫోన్ వాడకానికీ, బ్యాంకు ఖాతాలకీ, బీమా పాలసీలకీ, పన్ను చెల్లింపులకీ, విద్యార్జనకీ, పోటీ పరీక్షలకీ, స్థిరాస్థుల లావాదేవీలకీ.. అనేక విషయాలకు విస్తరించి చివరికి అంత్యక్రియల నిర్వహణకి సైతం ఆధార్‌కార్డు కావాలనే దుస్థితికి దిగజారింది. ప్రజల దైనందిన జీవితంలో ఆధార్ కార్డు లేకుండా మనుగడ సాధించడం ప్రశ్నార్థకంగా మారిన గడ్డు పరిస్థితులను సృష్టించింది.



ఆర్ శశికుమార్



కోట్లాది మంది భారతీయులు వేలి ముద్రలు, కంటి స్కాన్‌తో సహా వారి వ్యక్తిగత సమాచార సేకరణ అనే బృహత్తర బాధ్యతను ప్రభుత్వం కానీ యుఐడిఎఐ కానీ స్వీకరించకుండా ఆధార్ నమోదు కేంద్రాల పేరుతో ప్రయివేటు వ్యక్తులకూ, సంస్థలకూ అప్పగించారు. ఈ మొత్తం ప్రక్రియలో కనీసం ఏ రకమైన చట్టబద్ధ ఒడంబడికలూ లేకుండా కేవలం అవగాహనా పత్రాలతోనే (ఎంఒయు) సమాచార సేకరణా కేంద్రాలను నియమించడం ఎంతో ప్రమాదకరం అని ఎందరు నిపుణులు మొత్తుకుంటున్నా వినకుండా ఆధార్ కేంద్రాలను ఎంపిక చేశారు. దాని ఫలితంగానే యుఐడిఎఐ సుమారు 49 వేల ఆధార్ నమోదు కేంద్రాలను రద్దు చేయవలసిన దుస్థితి ఏర్పడింది. ప్రపంచంలోనే అతి పెద్ద బయోమెట్రిక్ ప్రాజెక్టు అనీ, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉన్నాయనీ గప్పాలు కొట్టుకోవడం మీద ఉన్న శ్రద్ధ నిజంగా భద్రతకు బాధ్యత వహించడంపై లేకపోవడం వల్లే అన్ని కేంద్రాలు అవకతవకలకు పాల్పడగలిగాయి. కానీ అవి అప్పటికే చేసిన తప్పులకు పరిష్కారం ఏంటి? అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకదు. ఎవరైనా ఆధార్ వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపితే వారిపై చర్యలు తీసుకోవడమే తప్ప ఆయా లోపాలను సరిదిద్దుకునే విధంగా ఈ నిర్వహణ జరగడం లేదు. అసలు 2009లో యుఐడిఎఐ మొదలైనప్పటికీ 2016లో ఆధార్ చట్టం రూపొందించేంత వరకూ కనీసం ఈ మొత్తం వ్యవహారానికి చట్టబద్ధత లేదు. అంటే కోట్లాది మంది భారతీయులు ఏ సహేతుక కారణం లేకుండానే తమ వ్యక్తిగత వివారాలను అనామక సంస్థలకు అప్పగించారన్నమాట. ఇదంతా చట్టబద్ధ పాలన అందించవలసిన రాజ్యాంగ పరిరక్షక ప్రభుత్వాలు సాగించిన దురాగతమే సుమా!

2016లో ఆధార్ చట్టం ద్వారా ఆధార్ ప్రక్రియకు పరిశుద్ధతను ఆపాదించారు. కానీ ఆ చట్టాన్ని సైతం రాజ్యసభలో ప్రవేశపెట్టకుండా ద్రవ్యబిల్లు పేరుతో దొడ్డిదారిన లోక్‌సభలోనే ఆమోదింపజేసుకొని మరొక్కసారి మన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలనీ అపహాస్యం చేసింది. పోనీ ఇంతా చేసి ఆ చట్టంలో ఎక్కడన్నా 'ఆధార్ కార్డు తప్పనిసరి' అని ఉందేమో దుర్భిణీ వేసి వెతికినా కనబడదు. అంటే తాము చేసిన చట్టానికి తామే వక్రభాష్యం చెప్పుకొని ప్రభుత్వ ఉత్తర్వుల పేరుతో ఆధార్ కార్డును బలవంతంగా ప్రజల మీద రుద్దుతున్నారన్నమాట. సెక్షన్ 57 ప్రకారం ఈ ఆధార్ కార్డును ప్రభుత్వం కానీ ప్రయివేటు సంస్థలు గానీ గుర్తింపు పత్రం కింద జమ కట్టవచ్చు అని ఉండగా, ఆధార్ మాత్రమే గుర్తింపు పత్రం అయినట్లుగా ప్రయివేటు సంస్థలు సైతం వ్యవహరించడం చట్ట వ్యతిరేకం. అంతేకాదు.. ఆధార్ లేనివారికి ఇతర గుర్తింపు పత్రాలు సైతం సరిపోతాయి అని చట్టంలో స్పష్టంగా ఉండగా ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులన్నీ అందుకు భిన్నంగా వుండటం శోచనీయం. చట్ట ప్రకారం చూస్తే ఆధార్‌కార్డు ఐచ్ఛికమే తప్ప విధాయకం కాదని స్పష్టమవుతుంది. కార్డు మీదే ఉన్నట్లు ఆధార్ కేవలం ప్రజల హక్కు మాత్రమే! దానిని ఇప్పుడు ప్రజల బాధ్యతగా మార్చే కుట్ర కొనసాగుతోంది. అందువల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. మచ్చుకు కొన్ని...

- ✦ భిన్న సంస్కృతులు, విభిన్న రకాల పేర్లు వుండే భారతదేశంలో కేవలం పేరు సరిపోలకపోయినా ఆధార్ కార్డు విపరీతమైన గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది.
- ✦ వేలి ముద్రలు వృద్ధాప్యం వల్ల గానీ కాయకష్టం వల్ల గానీ మారిపోయే అవకాశం వుంది. కనుక ప్రతి పనికీ వేలి ముద్రలే ఆధారమైతే ఇబ్బందులు తప్పవు.
- ✦ ఇప్పటికే వంద కోట్లు దాటిన మొబైల్ కనెక్షన్లు అన్నీ ఆధార్‌తో అనుసంధానమైతే ప్రతి వ్యక్తి కదలికలపై పూర్తి నిఘా పెట్టగల సామర్థ్యం ప్రభుత్వ సొంతమవుతుంది. వారికి కావల్సింది సైతం సరిగ్గా ఇదే! కానీ ఈ నిఘా ఉద్దేశపూర్వక నేరస్తులను నియంత్రించగలదు అనుకోవడం హాస్యాస్పదం. అయితే ఎప్పుడు కావాలంటే అప్పుడు కొంతమంది వ్యక్తులపై గానీ సమూహాలపై గానీ నిఘా నేత్రం సారించగలగడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలివ్వడమే!
- ✦ వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ఒక పక్క ఆధార్ రాజ్యాంగబద్ధతపై వాదోపవాదాలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడలు పోతూ ప్రతి ప్రాథమిక సేవకీ ఆధార్ కార్డు తప్పనిసరి అని పోరు పెట్టడం న్యాయ వ్యవస్థను సైతం అవమానించడమే కాదూ!
- ✦ బయోమెట్రిక్ వివరాలు సేకరించే యంత్రాల నుంచే కోట్లాది మంది సమాచార నిల్వ వరకూ అనేక విదేశీ కంపెనీల ప్రత్యక్ష ప్రమేయం ఉండటం మన దేశ భద్రతకు సైతం ప్రమాదం కాదూ!
- ✦ వేల కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగనామం పెడుతున్న వారూ, అవినీతి సంద్రంలో మునిగి తేలుతున్న వారూ, విదేశీ సంస్థల ద్వారా నల్లడబ్బును తెల్ల బరుచుకుంటున్నవారూ, ప్రజా ధనాన్ని పందికొక్కుల్లా దోచుకుంటున్నవారూ ఈ ఆధార్‌కార్డు ఉన్నా లేకున్నా అవే పనులు చేస్తారు. మరి ఈ ఆధార్ రుద్దుడు సామాన్యుల మీదే ఎందుకు?

ఎందుకంటే బడా కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు తమ వస్తు, సేవలను మార్కెటింగ్ చేసుకోవడానికీ, నగదు రహిత లావాదేవీల పేరుతో విత్త నిర్వహణ సంస్థలు సొమ్ము చేసుకోవడానికీ, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు నిఘా నేత్రంతో ఎల్లెడలా ప్రజల సామాజిక జీవికను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికీ, అవసరమైనప్పుడల్లా ఎవరి హక్కులైనా చిటికెలో హరించగల అపరిమిత అధికారం చలాయించడానికీ, సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యత, స్వీయ నిర్ణయాధికారం వంటి మౌలిక ప్రజాస్వామ్య విలువలకు పాతర వేయడానికీ మాత్రమే ఈ ఆధార్ కార్డు బలవంతపు విస్తరణ ఉపయోగపడుతుంది. ఇంకా మిణుకు మిణుకుమంటున్న చిట్టచివరి ఆశ ఏదైనా ఉందంటే అది రాబోయే రోజుల్లో సుప్రీంకోర్టు ఈ ఆధార్ రాజ్యాంగబద్ధతపై వెలువరించబోయే నిర్ణయమే! అదైనా ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా ఉంటుందని ఆశిద్దాం!

(రచయిత చార్టర్డ్ ఎకౌంటెన్సీ ఉపాధ్యాయుడు,
sasichamps@gmail.com)

ప్రజాశక్తి
jeevanapageps@gmail.com
జీవన the family
JEEVANA



ఫ్యామిలీ కౌన్సెలింగ్

అత్తంటే విలనేనా?

'మా అత్తగారు మహా గయ్యాళి!' అని.. ఒకావిడంటే.. 'మా అత్త ఏకంగా.. సూరేకాంతమే!".. అని మరో కోడలు అనడం వింటుంటాం. అయితే 'అత్తా ఒకింటి కోడలే!' అనే మాటా.. మనకు తెలుసు. అత్తల గురించి కొందరు కోడళ్లు ఇలా వ్యంగ్యంగా.. అనుకోవడం చూస్తుంటాం. అసలు మన ఇంట్లో అమ్మ కూడా.. మరొకరికి అత్తే కదా?! ఇది ఇలా ఉంటే.. అత్త పోస్టుల్లోకి రాగానే సదరు అత్తలు కూడా.. కొత్తగా ఏదో అధికారం వచ్చినట్టు.. కావాలనే.. కోడలు మీద పెత్తనం చెలాయిస్తుంటారు. కానీ, కోడలూ మనపిల్లే.. అత్తా మన అమ్మే అని అనుకుంటే.. ఏ గొడవా ఉండదు. లోపల నాటుకుపోయిన భావజాలం అలాంటిది. ఇలాంటి భావజాలంగల కుటుంబంలో ఎలాంటి చిచ్చులు తలెత్తుతాయో.. ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.

ఆమె పేరు సంగీత. అతని పేరు సంపత్.

సంగీత రైతు కుటుంబంలో పుట్టింది. తల్లే పనులన్నీ చేసుకుని, పొలం వెళ్లిపోయేది. పెద్దగా బాధ్యతలు తెలియకుండా పెరిగింది. వయసులో కూడా చిన్న అమ్మాయి. పెళ్లయ్యాక కొన్నిరోజులు బాగానే ఉంది.

సంపత్‌కు ఒక అక్క ఉంది. తల్లి సావిత్రి ఒంటరిమహిళ. తండ్రి భార్యాపిల్లల్ని పట్టించుకోకుండా ఎటో వెళ్లిపోయాడు. సావిత్రినే పిల్లలిద్దరినీ తన రెక్కల కష్టం మీద పెంచి, పెద్ద చేసింది. ముందు కూతురికి పెళ్లి చేసింది. కొంచెం కష్టాలు గట్టెక్కాయని అనుకునే దశలో ఆమెకు క్యాన్సర్ వచ్చింది. జీవిత పోరాటం చేసిన అనుభవమే ఆమె క్యాన్సర్‌పైనా పోరాడేందుకు తోడ్పడింది. దాన్ని కూడా ఎదుర్కొని నిలదొక్కుకుంది. కొడుక్కి పెళ్లి చేసింది. క్యాన్సర్ వచ్చిందని స్థిమ్మితంగా కూర్చోలేదు. తనవంతు ఏదో ఒకటి చేస్తూనే ఆర్థికంగా సమకూరుస్తూనే ఉంది. గతంలో కొనుక్కున్న స్థలంలో ఇల్లు కూడా కట్టింది. కొడుకు, కోడళ్లతో కలిసి ఆ ఇంట్లోనే ఉంటుంది.

ఇంతవరకూ ప్రశాంతంగానే వారి జీవనం కొనసాగింది. ఇప్పుడు అత్తాకోడళ్లకు చిన్న చిన్న తేడాలు రావడం మొదలైంది. అత్త సావిత్రి ఏం చెప్పినా వ్యతిరేకంగానే తీసుకుంటుంది సంగీత. 'ఆఖరుకి ఎప్పటి పని అప్పుడు చేసుకో!' అని చెప్పినా.. తప్పుపడుతుంది. ఈ పరిస్థితుల్లో భర్తను వేరే కాపురం పెట్టాలంటూ సంగీత అలిగి పుట్టింటికి వెళ్లింది. ఎంత సర్ది చెప్పినా సంగీత వినకపోవడంతో.. సావిత్రి వాళ్లతో వేరుకాపురం పెట్టించింది. కొన్ని రోజుల తర్వాత అనారోగ్యసమస్యలు, భర్తతో వచ్చిన చిన్న చిన్న భేదాభిప్రాయాలతో మళ్లీ ఇద్దరూ గొడవపడ్డారు. పెద్దల పంచాయతీలతో మళ్లీ అత్త సావిత్రితో కలిసి ఉండేందుకు అంగీకరించింది సంగీత.

మళ్లీ గొడవలు ప్రారంభం కావడంతో భార్యాభర్తలు ఇద్దరూ, అత్త సావిత్రితో కలిసి 'ఐద్వా అదాలత్'కు వచ్చారు.

సంగీత: మా అత్త చుట్టుపక్కల అందరితో బాగానే ఉంటుంది. అంతెందుకు మా ఇంటిపక్కనే ఒక పసిపిల్ల తల్లి ఉంది. ఆమెకు కూరగాయలు కోసిపెడుతుంది. నాతో కూడా అలాగే ఉండొచ్చు కదా? ఆ పక్కింటామెతో గొడవ పడినప్పుడు 'వాళ్లతో అంత జోరుగా ఉండటం ఎందుకు? గొడవలు తెచ్చుకోవడం ఎందుకు?' అన్నా. తప్పా? చెప్పండి. మా ఆడపడుచు కూడా అంతే. మా ఇంటికి దగ్గరలోనే ఆమె ఉండేది. మా ఇంటికి వస్తుంది కానీ నాతో అసలు మాట్లాడదు. ఏదైనా విషయం ఉంటే అమ్మాకూతుళ్లిద్దరే మాట్లాడుకుంటారు. గతంలో ఒకసారి మా అత్తగారు ఎవరి గురించో వచ్చి నాకు చెప్పబోతే.. "నాకు ఎవరి విషయాలు చెప్పొద్దు" అన్నాను. విషయాలేమైనా ఇక వాళ్లే మాట్లాడుకుంటుంటే నాకు బాధగా ఉంటుంది. ఈయన రాత్రి ఇంటికి వస్తాడా.. వచ్చిన దగ్గర నుంచీ ఆ సెల్ నొక్కుకుంటూ కూర్చుంటాడు. నాతో ఒక్క మాట మాట్లాడు. ఆ ఇంట్లో నాకు ఎలా ఉంటుంది? అందరూ ఉన్నా నేను ఒంటరినే. నాకెందుకీ బతుకు అనిపిస్తుంది. ఇలా ఉండేకన్నా చచ్చిపోవడం నయం.

సంపత్: ఆ అమ్మాయి అన్నదాంట్లో కొంత నిజం ఉంది. మరికొంత అబద్ధం ఉంది. మా అమ్మ ఏం చెప్పినా ఈ అమ్మాయికి నచ్చదు. చుట్టుపక్కల వాళ్లందరికీ మా అమ్మ టైలరింగ్ నేర్పుతుంది. మా అమ్మ దగ్గర కాకుండా బయటకు ఎక్కడికో వెళ్లి, డబ్బులిచ్చి మిషన్ నేర్చుకుంటాననంటుంది. ఇలా అనడం కరెక్టు కాదు కదా? మా అమ్మ ఏదైనా చెప్పినప్పుడు చెప్పొద్దని, ఇప్పుడేమో.. చెప్పడం లేదని అంటే ఎలా?

సావిత్రి: పిల్లలు చిన్నప్పుడే నా భర్త వేరే ఆమెను తీసుకుని ఎటో పోయాడు. ఆరోజు నుంచీ నేను వీధిలైటు కింద మిషను కుట్టి, పిల్లల్ని పెంచుకున్నా. ఎట్టాగో పెద్దవాళ్లను చేసి, పెళ్లిళ్లు చేశా. ఇప్పటికీ నలుగురికి మిషన్ నేర్పి, నాకు చేతనైనంత కష్టం చేస్తున్నా. ఉన్నది ముగ్గురం. ఎప్పుడు అంట్లు అప్పుడు తోముకోదు. కనీసం ఉదయం చేయకపోయినా, సాయంత్రమైనా చేసుకో వాలిగా? మూడురోజులకోసారి తోముతుంది. ఇల్లంతా కంపు. బట్టలు అంతే.. నాలుగేసి రోజులు వరకూ ఉతకదు. నేను ఇలా చెయ్యి.. అని చెప్తే తప్పు. వాళ్లమ్మోళ్లకి ఫోను చేసి చెబుతుంది. చెప్పినా వాళ్లు కూడా ఈ అమ్మాయికి వివరం చెప్పాలిగా? నిప్పుకు ఉప్పు వేస్తారు తప్ప.. బిడ్డకి ఎలా ఉండాలో చెప్పరు. ఇంట్లో నేను బతికే ఉన్నానుగా.. ఊరెళ్లేప్పుడు ఒక్క మాట చెప్పదు. నేనింక ఎవరితో చెప్పుకుంటా.. ఏదైనా ఇదమ్మాయి సంగతని చెప్పబోతే.. "నాకేం చెప్పొద్దు" అంటుంది. మా అమ్మాయి వచ్చినప్పుడు మాట్లాడుకుంటే.. "మీరే మాట్లాడుకుంటున్నారు.. నన్ను ఒక్కదాన్ని చేసి" అంటుంది. ఏం చేయాలో మీరే చెప్పండి.

బాధ్యులు ఏమన్నారంటే ...

సంగీతా! అత్తంటే నీ దృష్టిలో పెద్ద విలన్ అనుకుంటున్నావు. ఆమె చెప్పినా వినకూడదనే భావం బాగా ఉన్నట్లుంది. అత్త అమ్మ ఎలా అవుతుంది? అని అడుగుతున్నావు. ఎందుకు కాకూడదు? ఆమె సంపాదించే ప్రతిపైసా మీకే పెడుతోంది. మీకు ఇల్లు కట్టించింది. అది ఆమెది అంటుందంటే.. ఆమెదే కదా! కానీ ఆమె తదనంతరం మీకే అంటోంది కదా?! ఇరుగుపొరుగు మాట్లాడే విషయాలు నీకు చెబితే, నాకెందుకు అంటున్నావు? చెప్పకపోతే చెప్పలేదంటున్నావు? సమస్య నీదే కదా?! మీ ఆడపడుచుతో, ఇరుగుపొరుగుతో మాట్లాడుతుందంటే, నీవు వారిలా కలవలేకపోతున్నావు. అదే నిన్ను ఒంటరిదాన్ని చేస్తోంది. ఇది తర్వాతర్వాత మానసిక సమస్యకూ దారితీస్తుంది. అందుకే అందరిలో కలవాల్సింది నీవే. నీవైపు నుంచే మాట కలుపు. నీ వైపు నుంచి మార్పు ప్రారంభమైతే.. అటు నుంచి తప్పక మార్పు కనిపిస్తుంది. ఎప్పటి పనులు అప్పుడు చేసుకుంటేనే తేలిగ్గా ఉంటుంది. ఎప్పటికప్పుడు చేసుకోకుండా పేరబెట్టుకుంటే.. తర్వాత ఆపని నువ్వే చేసుకోవాలి కదా? ఒకేసారి చేసుకోవడం ఎవరికైనా కష్టమే. అలా అంట్లూ, బట్టలూ శుభ్రం చేసుకోకుండా రోజులతరబడి ఉంచడం ఆరోగ్యానికీ మంచిది కాదు. ఎప్పుడైనా ఆరోగ్యం బాగోక చేయలేకపోతే, అత్తయ్యకి చెప్పు. తప్పకుండా నీకు సహాయం చేస్తారు. అలాంటిదేమీ లేకుండా, నిన్ను ఇబ్బందిపెడితే మాతో చెప్పు. పుట్టింటికి వెళ్లినప్పుడు తిరిగి వచ్చేటప్పుడు అమ్మకు చెప్పే వస్తావు కదా? అలాగే మీ అత్తకి చెప్పాలి. ఆమెను నీ మనిషి అనుకోకపోవడమే కారణం. మీ అత్త కష్టజీవి. ఆమె ఆరోగ్యమూ సరిగా లేదు. నువ్వే ఆమెను జాగ్రత్తగా చూసుకోవాల్సింది. నిన్ను చూసుకోవాల్సిందీ ఆమె.. మీరంతా కలిస్తేనే కుటుంబం.

సంపత్! నువ్వు కూడా రాత్రి ఇంటికి రాగానే.. సెల్‌ఫోనుతోనే గడపడమేంటి? భార్య అనే మనిషి ఇంట్లో ఉందన్న స్పృహ ఉండాలిగా?! ఆమె ఇష్టాయిష్టాలు తెలుసుకుని, చక్కగా ప్రేమగా ఉండండి.

పార్వతీ! మీరు కష్టపడి, బాధ్యతతో కుటుంబాన్ని నడుపుకొచ్చారు. సంగీత కూడా మీ అమ్మాయి అనుకోండి. ఆమెకు మొదటి నుంచి బాధ్యతలు తెలియకపోవడం. అత్తంటే వ్యతిరేక భావం బాగా నాటుకుపోయింది. మీరూ అది చేయి, ఇది చేయి అన్నట్లు అజమాయిషీగా కాకుండా, ఒప్పించేలా చెప్పండి. తను తప్పక వింటుంది. అదే మీ ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు రావడానికి కారణమవుతుంది. మా దగ్గరకు వచ్చారు కదా.. మేము ఆ అమ్మాయికి ఎలా ఉండాలో చెబుతాం.

ఇరుగుపొరుగు మాట్లాడే విషయాలు నీకు చెబితే, నాకెందుకు అంటున్నావు. చెప్పకపోతే చెప్పలేదంటున్నావు. సమస్య నీదే కదా?! మీ ఆడపడుచుతో, ఇరుగుపొరుగుతో మాట్లాడుతుందంటే, నీవు వారిలా కలవలేకపోతున్నావు. అదే నిన్ను ఒంటరిదాన్ని చేస్తోంది. ఇది తర్వాతర్వాత మానసిక సమస్యకూ దారితీస్తుంది. అందుకే అందరిలో కలవాల్సింది నీవే. నీవైపు నుంచే మాట కలుపు. నీ వైపు నుంచి మార్పు ప్రారంభమైతే.. అటు నుంచి తప్పక మార్పు కనిపిస్తుంది.

ప్రేమతోనే మీరంతా మీ మధ్య సమస్యలన్నీ జయించవచ్చు. భార్యాభర్తలు ఇద్దరూ పదిహేనురోజులకు ఒకసారి రావాలి. ఎవరికి ఎవరి వల్ల సమస్య వచ్చినా మా దగ్గరకు రండి. ప్రతి చిన్నదానికీ మాత్రం గొడవపడొద్దు.

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

అందుకు అందరూ ఒప్పుకోవడంతో ఆ మేరకు రిజిష్టర్‌లో రాసి, సంతకాలు చేయించుకున్నారు.

పదిహేనురోజుల తర్వాత సంగీత, సంపత్ వచ్చారు. ఈసారి సంగీత చక్కగా రెడీ అయ్యి, నవ్వుతూ వచ్చింది. వాళ్ల నాన్నకు బాగోలేదని, అత్తకి చెప్పడం ఇష్టంలేక వెళ్లడం మానుకున్నానని చెప్పింది. 'మీరు ఎంత చెప్పినా, అత్త అమ్మ కాలేదుగా?' అంటుంది.

మళ్లీ బాధ్యులు కౌన్సెలింగ్ చేశాక, అత్తకి చెప్పి వెళ్తానంది. సంపత్ సెల్‌ఫోన్‌లో సంగీతతో కలిసి గేమ్స్ ఆడుతున్నానని చెప్పాడు. 'ఎందుకొచ్చిన గేమ్స్ కానీ, చక్కగా మాట్లాడుకోండి. బయటకు ఎక్కడికైనా వెళ్లి రండి!' అని బాధ్యులు చెప్పారు.

అలాగే అంటూ ఇద్దరూ సంతోషంగా వెళ్లారు.

- శాంతిశ్రీ



బ్యాంగిల్‌లాంటి రక్షణకవచం

చూడడానికి అది మహిళలు ధరించే బ్యాంగిల్(గాజు) లానే ఉంటుంది. కానీ అది గర్భిణుల పాలిట రక్షణకవచం. వారి ఆరోగ్యానికి ఏ చిన్న సమస్య వచ్చినా ఇట్టే హెచ్చరిస్తుంది. అదేమిటో తెలుసుకుందామా!

ఆరోగ్యవంతులపై కూడా అనేక వ్యాధులు స్వైర విహారం చేస్తున్న రోజులివి. ముఖ్యంగా గర్భిణులకు. థైరాయిడ్ మొదలుకొని, క్యాల్షియం నుంచి కామెర్ల దాకా...ఎప్పుడేం ఎటాక్ చేస్తుందో తెలియదు. పట్టణాలు, నగరాల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటే ఉండొచ్చు కానీ మారుమూల గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యానికి ఎన్నో సవాళ్లు. సరైన వైద్య సలహా ఉండదు. సకాలంలో మందులు అందే అవకాశాలు లేవు. తినే ఆహారంలో పోషకాలుండవు. గర్భం ధరించిన మొదటినెల నుంచీ జీవన్మరణ సమస్యలను ఎదుర్కోవాల్సిందే. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం రోజుకి 830 మంది ప్రసవ సంబంధమైన వ్యాధులతో కన్నుమూస్తున్నారు. ఈ మరణాల్లో మూడోవంతు దక్షిణ ఆసియాలోనే సంభవిస్తున్నాయి. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేని మారుమూల గ్రామాల్లోనే ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయి.



గర్భిణులకు నెలనెలా మెడికల్ చెకప్స్ అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అసలు తమకు ఏం జరుగుతోందో తెలిస్తే డాక్టర్ దగ్గరికి వెళ్లాలా వద్దా అన్నది నిర్ణయించుకోవచ్చు. అలాంటి అలర్ట్స్ ఇవ్వడానికి కనిపెట్టిందే హైటెక్ స్మార్ట్ బ్యాంగిల్. కలర్‌ఫుల్, లైట్ వెయిట్ బ్యాంగిల్ ధరించిన గర్భిణులకు ఠంచనుగా మెడికల్ అలర్ట్స్ ఇస్తుంది. హైటెక్ అంటే ఇదేదో అర్బన్ వాళ్లకు సంబంధించిందే అనుకుంటే పొరపాటే. మారుమూల గ్రామీణ మహిళలు సైతం ఈజీగా అర్థం చేసుకునేలా ఉంటుంది. డ్యూరబుల్ ప్లాస్టిక్ తో తయారు చేసిన ఈ బ్యాంగిల్ నీళ్లలో తడిసినా పాడవదు. రెగ్యులర్ గాజులాగే ధరించవచ్చు. బ్యాటరీ కూడా పదేపదే మార్చాల్సిన అవసరం లేదు. ఒక్కసారి ధరిస్తే తొమ్మిది నెలల వరకు చార్జింగ్ పెట్టాల్సిన పనిలేదు. ఇంటర్నెట్ కూడా అవసరం లేదు. ఒకేసారి వాడి పడేసిది కూడా కాదు. ఎన్నిసార్లయినా పనికొస్తుంది.

ఇంటెల్ కార్పొరేషన్- బంగ్లాదేశ్ నాన్ ప్రాఫిట్ గ్రామీణ్ ట్రస్ట్ సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తిగా గర్భిణి మహిళల కోసమే. ఇప్పటికీ చాలాచోట్ల మొబైల్ కనెక్టివిటీ మహిళల దాకా రాలేదు. ఇంట్లో మగవాళ్లే ఫోన్ చేస్తారు. ఏదో అవసరానికి మాట్లాడ్డం తప్ప, వాళ్లకంటూ సొంతంగా ఫోన్ లేదు. ఈ నేపథ్యంలో ఎలాంటి నైపుణ్యం లేకుండానే బ్యాంగిల్ ద్వారా అవసరమైన మెడికల్ హెల్ప్ పొందవచ్చు. ఎప్పటికప్పుడు ఆడియో ద్వారా వాళ్లను అలర్ట్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు చేపట్టిన మరో మంచి పని ఏంటంటే.. మెటర్నల్ హెల్త్ కోసం మొబైల్ యాప్స్.



దక్షిణ ఆసియా మహిళలను దృష్టిలో పెట్టుకుని ఈ కలర్ ఫుల్ బ్రేస్ లెట్‌ని బంగ్లాదేశ్‌లో రూపొందించారు. ఇది ఫిట్ నెస్ బ్యాండ్స్, స్మార్ట్ వాచీలను కాపీ కొట్టి చేసింది కాదు. వారానికి రెండు సందేశాలను పంపిస్తుంది. అది కూడా లోకల్ లాంగ్వేజీలోనే. పిండం ఎదుగుదలను బట్టి ఏం తినాలి? శరీరం బరువుని బట్టి ఏం తినకూడదు.. ఏ సమయంలో డాక్టర్‌ని కలవాలి లాంటి సందేశాలను పంపిస్తుంది.

ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నిండు గర్భంతో ఉన్నా కూడా నీళ్లు తెస్తుంటారు. వంట వండుతుంటారు. అది కూడా కట్టెల పొయ్యిమీద. గంటల కొద్దీ పొగలో ఉంటారు. అదెంత హానికారకమో రూరల్ ఏరియాలో తెలియదు. అలాంటి పరిస్థితి నుంచి బయటపడేయడంలో బ్యాంగిల్ చక్కగా పనిచేస్తుంది. పొగ ఎక్కువైంది దూరం వెళ్లిపో, లేదంటే ప్రమాదం అని అర్థం వచ్చేలా మోగుతుంది. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ పరిశోధన ప్రకారం జనం చాలా ఎక్కువగానే ఈ స్మార్ట్ వేరబుల్ డివైజ్ గురించి మాట్లాడుతున్నారు. స్మార్ట్ వాచీలు, బ్యాండ్స్ తదితర ఉపకరణాల గురించి ఆసక్తి చూపిస్తున్నారు. అందుకే స్మార్ట్ మార్కెట్ నానాటికీ పుంజుకుంటోంది. గత ఏడాది 2.5 మిలియన్ డివైజెస్ అమ్ముడుపోయాయి. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్, ఇండియా, నేపాల్ లాంటి దేశాల్లో ఈ స్మార్ట్ బ్యాంగిల్ ప్రారంభ ధర 12 డాలర్ల నుంచి 15 డాలర్లుగా, వెయ్యి రూపాయలు దాటకుండా ఉంది. ఇలాంటి ఆరోగ్య హెచ్చరిక పరికరం గర్భిణులకు చాలా ఉపయోగమే. ★

సైకాలజీ

అతనికి చెప్పాలా? వద్దా?

నేను ప్రేమించిన అబ్బాయి వేరే పెళ్లి చేసుకున్నాడు. ఇది జరిగి నాలుగేళ్లు అవుతోంది. ఇప్పుడిప్పుడే ఆ జ్ఞాపకాల్లోంచి బయటపడుతున్నాను. గతేడాది నాకు గవర్నమెంటు ఉద్యోగం వచ్చింది. ఇంట్లో వాళ్లు సంబంధాలు వెదుకుతున్నారు. గత ప్రేమ విషయం తనతో చెప్పాలో వద్దో? తెలియడం లేదు. ఏం చేయమంటారు?

- ఓ సోదరి

మీ ఇద్దరి జీవితాలు వేరయిపోయాయి. ఎవరి జీవితం వాళ్లు సాగిస్తున్నారు. అతను గతానికి సంబంధించిన ఒక జ్ఞాపకమే తప్ప, వర్తమానంలో ఏ మాత్రం భాగం కాదు. అలాగే, అతను తనకంటూ ఓ జీవితాన్ని సృష్టించేసుకున్నాడు. అందులో ఎక్కడా మీకు స్థానం లేదు. అలాంటప్పుడు అతని గురించి ఏ ఆలోచనైనా మీకు అప్రధానమే! మీ జీవితంలో అడుగు పెట్టబోయే కొత్త వ్యక్తి మీ గతాన్ని ఏ విధంగా స్వీకరిస్తాడో తెలియదు. కాబట్టి, అవతలి వ్యక్తి తాలుకా వ్యక్తిత్వం సంపూర్ణంగా అంచనా వేయకుండా ఈ విషయం చెప్పడం సబబుకాదు! జీవితంలో ఇలాంటివి చిన్నతనం చేష్టలుగా తీసుకునేవారైతే పర్వాలేదు. అలాకాకుండా మీకు సమస్య సృష్టించే వ్యక్తయితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. మీరు చేసింది తప్పని భావించి అపరాధ భావంతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్న ఆలోచన తీవ్రంగా ఉంటే, రాబోయే వ్యక్తిని సరిగా అంచనా వేసుకోవాలి. మిమ్మల్ని స్వీకరించే వ్యక్తా? కాదా! అనే అవగాహనకు వచ్చిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా గతంతో వర్తమానానికి నిమిత్తం లేదు అనుకుంటే జీవితంలో ఒక కొత్త అధ్యాయం తెరుస్తున్నానని మీరు అనుకుంటారు. అలాంటప్పుడు అవతలి వ్యక్తి వ్యక్తిత్వాన్ని, మనస్తత్వ ప్రవర్తనా ధోరణిని సాధ్యమైనంతగా లోతుగా అర్థం చేసుకోవడం అవసరం. ఎందుకంటే, పెళ్లయ్యాక కూడా ఎవరైనా గాలివాటానికి చెప్పిన మాటలు తీవ్రంగా తీసుకొని, మీ పట్ల సందేహాలు పెంచుకొనే అవకాశం ఉన్నవాడా! లేదా! అనేది అర్థం చేసుకోవాలి. మిమ్మల్ని సంపూర్ణంగా ఇష్టపడి, పెళ్లి చేసుకునే వ్యక్తి అయితే, ఆ విషయం చెప్పినా అది గతం కాబట్టి మిమ్మల్ని ఇష్టపడతాడు. సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాడు. కాబట్టి ముందుగా మీరు చేసుకోబోయే వ్యక్తి మీకు పూర్తిగా విలువనిచ్చే, గౌరవించే వ్యక్తిగా ఉంటే, పారదర్శకత మరింత సుగమమవుతుంది. లేకపోతే ప్రస్తావించకపోవడమే ఉత్తమం. ★





డా. పద్మజ, సైకాలజిస్టు

మీకోసం

దుస్తులపై కాఫీ మరకలు పోవాలంటే.. కోడిగుడ్డు సొనతో ఆ ప్రదేశంలో రుద్ది తరువాత సబ్బుతో ఉతకాలి.



జీవన సౌరభం

ఎంచుకున్న మార్గాన్నే జీవిత లక్ష్యం చేసుకోవాలి. దాన్నే కలగనాలి. దాన్నే శ్వాసించాలి. ఇదే విజయానికి మార్గం

సెన్సెక్స్ ⬇ 510
33,176

నిఫ్టీ ⬇ 165
10,195

రూపాయి ⬇ 02 పైII
అమెరికా డాలరుకు రూ.
64.94



జియోకు నాంది ఇషానే..

తన కూతురు ఇషా ఇచ్చిన ఐడియాతోనే జియోను ఏర్పాటు చేశామని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ అన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఆర్సిలర్ మిట్టల్ బోల్డ్‌నెస్ ఇన్ బిజినెస్ అవార్డ్స్ కార్యక్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 'డ్రైవర్స్ ఆఫ్ ఛేంజ్' అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ముఖేష్ మాట్లాడుతూ మొబైల్ మార్కెట్ కోసం 31 బిలియన్ డాలర్లు ఖర్చు చేశామన్నారు.



వెంకయ్యతో టాటా భేటీ..

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడితో టాటా గ్రూపు అధినేత రతన్ టాటా భేటీ అయ్యారు. న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి ఇంట్లో టాటా మర్యాదపూర్వకంగా కలిశారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆంధ్రా బ్యాంకుకు స్టీల్ అప్పుల దెబ్బ

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఆంధ్రా బ్యాంకును ప్రధానంగా ఇనుము, స్టీల్, మౌలిక వసతుల రంగాల అప్పులు దెబ్బతీస్తున్నాయి. ఈ రంగాలకు చెందిన పారు బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఓ ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. ఇనుము, స్టీల్ రంగాలకు రూ.7800 కోట్ల కోట్ల అప్పులిస్తే ఇందులో 5118 కోట్లు ఎన్‌పిఎలుగా మారాయి. కాగా మౌలిక వసతులు రంగాలకు ఇచ్చిన రుణాల్లో రూ.4173 కోట్లు పారు బకాయిలుగా మారాయి. ఇందులో రూ.363 కోట్ల రుణాలు ఏకంగా రద్దు చేశారు. టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి రూ.153 కోట్లు రద్దు చేశారు. ప్రస్తుత సవాళ్ల నేపథ్యంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో కేసుల సంఖ్య పెరుగుతుందని ఆ బ్యాంకు సీనియర్ అధికారి ఒక్కరు తెలిపారు. శుక్రవారం బిఎస్ఇలో ఆంధ్రా బ్యాంకు షేర్ 2.79 శాతం తగ్గి రూ.41.80 వద్ద ముగిసింది.



పెరిగిన కరెంట్ ఎకౌంట్ లోటు
ఆర్‌బిఐ రిపోర్టు

ముంబయి : అధిక దిగుమతుల వల్ల కరెంట్ ఎకౌంట్ లోటు (సిఎడి) స్వల్పంగా పెరిగిందని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఒక రిపోర్టులో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జిడిపిలో సిఎడి లోటు 2 శాతం పెరిగి 13.5 బిలియన్ డాలర్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సిఎడి 8 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎగుమతులు తగ్గడం, దిగుమతులు పెరగడం ద్వారా వాణిజ్య లోటు పెరగడంతో సిఎడి పెరిగిందని ఆర్‌బిఐ పేర్కొంది. 2017-18 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత వాణిజ్య లోటు 44.1 బిలియన్ డాలర్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో 33.3 బిలియన్ డాలర్లుగా ఉంది.

దలాల్ స్ట్రీట్‌కు 'అవిశ్వాస' సెగ

- కుప్పకూలిన మార్కెట్లు
- సూచీలకు రాజకీయ వేడి
- సెన్సెక్స్ 510 పాయింట్లు ఫట్
- నాలుగో రోజూ క్షీణత
- 10,200 దిగువకు నిఫ్టీ
- లోహ, గ్యాస్ రంగాలపై ఒత్తిడి



ముంబయి : దలాల్ స్ట్రీట్‌కు అవిశ్వాస సెగ తాకింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంలో ఎన్‌డిఎ ప్రభుత్వం నుంచి టిడిపి వైదొలగడానికి తోడు మోడీ సర్కార్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు తెలుగు దేశం పార్టీ ప్రకటించింది. దీనికి వైఎస్‌ఆర్‌సిపితో పాటు మరిన్ని పార్టీలు కలిసి రావడంతో దేశ రాజకీయాల్లో వేడి మొదలయ్యింది. దీంతో దేశంలో ఏకపార్టీ మెజార్టీతో కొనసాగడం చాలా క్లిష్టమనే సంకేతాలు మదుపర్లలోకి వెళ్లాయి. ఈ పరిణామాల మధ్య ఇన్వెస్టర్లు భారీగా విక్రయాలకు మొగ్గు చూపడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 509.54 పాయింట్లు లేదా 1.51 శాతం క్షీణించి 33,176కు దిగజారింది. అదే విధంగా ఎన్ఎస్ఇ నిఫ్టీ 165 పాయింట్లు లేదా 1.59 శాతం పతనమై 10,195 వద్ద ముగిసింది. దీంతో వరుసగా నాలుగో రోజూ కూడా మార్కెట్లు నష్టపోయినట్లయ్యింది. అదే విధంగా వరుసగా మూడు వారంలోనూ మార్కెట్లు పతనాన్ని చవి చూశాయి.

వారాంతంలో సెన్సెక్స్ ఇంట్రా ట్రేడింగ్‌లో 33,119.92-33,691.32 వద్ద కదలాడింది. ఉదయం 33,686 వద్ద మొదలైన సూచీ రోజంతా ఒత్తిడికి గురైంది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.07 శాతం చొప్పున నష్టపోయాయి. లోహ, ఆయిల్, గ్యాస్, పిఎస్‌యు, విద్యుత్, ఆటో, బ్యాంకింగ్ సూచీలు రికార్డు స్థాయిలో నష్టపోయాయి. అవిశ్వాసం భయాలతో ఫిబ్రవరి 6 తర్వాత తొలిసారి మార్కెట్లు అత్యధికంగా నష్టపోయాయి. భారత రాజకీయ పరిణామాలకు తోడు ఆసియన్ మార్కెట్లు కూడా ప్రతికూలతను ఎదుర్కోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లపై మరింత ఒత్తిడి నెలకొంది.

మెజారిటీ క్లిష్టమే..

గుజరాత్ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయని డైమెన్షన్స్ కన్సల్టింగ్ సిఇఒ అజయ్ శ్రీవాస్తవా పేర్కొన్నారు. దేశంలో ఏకపార్టీ మెజారిటీని సాధించి కొనసాగడం చాలా క్లిష్టమైన వ్యవహారమని అభిప్రాయపడ్డారు. మదుపర్ల మదిలో ఇదే నెలకొని ఉందని అన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన ఉప ఎన్నికల్లోనూ బిజెపికి తీవ్ర పరాభవం ఎదురైన విషయం తెలిసిందే. గోరక్‌పూర్, ఫూల్‌పూర్‌లో బిజెపిపై సమాజ్ వాది పార్టీ గెలుపొందింది. బీహార్‌లోని అరారియాలోనూ ఆర్‌జెడి జయకేతనం ఎగరవేసింది. ఈ పార్లమెంట్ సీట్లలో బిజెపి ఘోరంగా ఓడిపోవడం మదుపర్లను ఆలోచనకు గురి చేస్తుందని బ్రోకర్లు పేర్కొంటున్నారు.

రంగాలన్నీ నేల చూపులే..

అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. బిఎస్ఇలోని మొత్తం 19 రంగాల్లో 15 రంగాలు కూడా ఒక్క శాతం మేర నష్టపోయాయి. లోహ సూచీ అత్యధికంగా 2.3 శాతం పతనమయ్యింది. ఇదే క్రమంలో ఆయిల్ అండ్ గ్యాస్ 2.09 శాతం, ఇంధనం 1.97 శాతం, విద్యుత్ 1.69 శాతం, రియాల్టీ 1.57 శాతం, ఆటో 1.66 శాతం, కాపిటల్ గూడ్స్ 1.66 శాతం, ఫైనాన్స్ 1.32 శాతం, వైద్య 1.32 శాతం చొప్పున నష్టాల పాలయ్యాయి. సెన్సెక్స్-30లో 26 స్టాక్స్ కూడా ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 0.88 శాతం, విప్రో 0.85 శాతం, హెచ్‌యుఎల్ 0.51 శాతం, యస్ బ్యాంకు 0.16 శాతం చొప్పున పెరిగాయి. టాటా మోటార్స్ 3.67 శాతం, ఆసియన్ పెయింట్స్ 3.09 శాతం, అదానీ పోర్ట్సు 2.89 శాతం, హీరో మోటో కార్ప్ 2.67 శాతం, ఎన్‌టిపిసి 2.65 శాతం, సన్ ఫార్మా 2.63 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఆడి కార్ల ధరలు భారీగా పెంపు

న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి భారత్‌లో తన కార్ల ధరలను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించింది. భారత ప్రభుత్వం దిగుమతులపై సుంకం పెంచిన కారణంగా ధరలు పెంచాల్సి వచ్చిందని శుక్రవారం ఆ కంపెనీ పేర్కొంది. అన్ని మోడళ్ళపై రూ.1 నుంచి రూ.9 లక్షల వరకు ధరలు పెంచనున్నట్లు వెల్లడించింది. వచ్చే ఏప్రిల్ 1వ తేది నుంచి పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని ఆడి ఇండియా హెడ్ రాహిల్ అన్సారీ పేర్కొన్నారు. భారత్‌లో ఆడి కార్ల ధరలు రూ.35 లక్షల నుంచి రూ.2.8 కోట్ల మధ్య శ్రేణీలో ఉన్నాయి. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మోటార్ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలు తదితర వాటిపై దిగుమతిపై సుంకాన్ని 10 నుంచి 15శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

ఆదిత్య బిర్లా నుంచి యాక్టివ్ అస్యూర్

హైదరాబాద్ : ఆదిత్యా బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ మరో కొత్త వైద్య బీమా పాలసీని ఆవిష్కరించింది. కనీస వయసు 5 ఏళ్ల నుంచి తీసుకునేందుకు వీలైన 'యాక్టివ్ అస్యూర్'ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ సిఇఒ మయాంక్ భత్వాల్ తెలిపారు. ఈ పాలిసీలో భాగంగా ఇద్దరు పెద్దవారు, నలుగురు చిన్నవారులకు బీమా వర్తిస్తుందని, ఒక సింగల్ పాలసీలో 25 సంవత్సరాల వయసున్నవారిని కూడా చిన్నరులుగా పరిగణించడం జరుగుతుందన్నారు.రూ.10 లక్షల పాలసీపై 150 శాతంగా రూ. 5 లక్షల రీలోడ్ లభిస్తుందని, 586 రకాల డేకేర్ చికిత్సల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు.

సిగ్నస్ రే జడ్ఆర్‌లో కొత్త రంగులు

న్యూఢిల్లీ : ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ ఇండియా యమహా మోటార్ (ఐవైఎం) యువ రైడర్లను లక్ష్యంగా చేసుకుని సిగ్నస్ రే జడ్ఆర్‌ను కొత్త రంగుల్లో ఆవిష్కరించింది. ఈ పోర్టు పోలియోలో ఐదు రంగులతో పాటు కొత్త ఫీచర్లను జోడించినట్లు ఆ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాయ్ కురియన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద డ్రమ్‌బ్రేక్ మోడల్ ధర ధర రూ.53,451గా, డిస్క్ డ్రమ్ బ్రేక్ మోడల్ ధర రూ.55,898గా నిర్ణయించామన్నారు. ఈ స్కూటర్లను 4 స్ట్రోక్, ఎస్ఓహెచ్‌సి, 2 వాల్వ్, 113 సిసి, బ్లూకోర్ ఇంజిన్ తదితర ఫీచర్లతో రూపొందించినట్లు తెలిపారు.



S.S.C. MODEL PAPER

ENGLISH PAPER-1

(ప్రాక్టీస్ బిట్ పేపర్లు)

Part – B (1)

Time: 1 Hour **Marks:15**

Instructions :

1. Answer the questions in 'Part-B' on the paper itself.
2. This part of the question paper should be attached to the Main Answer Book of the student.

1. Answer the questions in 'Part-B' on the paper itself.
2. This part of the question paper should be attached to the Main Answer Book of the student.

9. Kovalam was (a) one of a (b) most beautiful beach (c) in Kerala. It attracted (d) tourists all over India but (e) abroad. 5 × 1/2 = 21/2

a .... b........................
c .... d........................
e ....

10. Shravan _______(1) orphan. He came ______(2) Delhi from ______(3) village. He ______(4) in a tea ________shop in the village ________(5) a while before he left it. 5 × 1/2 = 21/2

1. (A) the (B) an (C) a (D) any
2. (A) to (B) from (C) for (D) in
3. (A) her (B) he (C) his (D) she
4. (A) for (B) from (C) at (D) in

11. Nick has a small foot on his left hip It helps him balance and enables him to kick 1
(Combine the sentences with 'which')

12. Savitri played the role of sasirekha 1
(Change into passive voice)

13. Mrs. Sater said "Don't talk. Sol silly, Victoria 1
(Change into Reported speech)

14. Kalam can speak Tamil. Kalam can speak English. 1
(Combine the sentences using either-or) 2 × 1/2 = 1

15. a) I was terrified _____her (by /of)
b) Ray was even shy ____ (off / of) receiving compliments

16. His feet ____(develop) cracks and some how ____ (resemble) those of an elephant 2 × 1/2 = 1

17. Your uncle is suffering from tooth ache. Advise him to see a doctor 1

18. You to your friend: Switch off the T.V. 1

19. Your neighbour wanted to borrow your bicycle. What would you say to her / him.
(a) All the best (b) Best of luck
(c) Congratulations (d) With Pleasure.

20. (a) Won't you get me a glass of water? 2×1/2= 1
(A) Request (B) Order
(C) Advise (D) Offer.
(b) It's time we went home.
(A) Suggesting (B) Requesting
(C) Offering (D) Questioning.

Part -B (1) (Answers)

9. a) is b) the c) beaches d) attracts e) and
10. 1) B 2) A 3) C 4) A
11. Nick has a small foot on his left hip which helps him balance and enables him to kick.
12. The role of Sasirekha was played by Savithri.
13. Mrs. Slater asked Victoria not to talk and not to be silly.
14. Kalam can either speak Tamil are English.
15. a) of b) off
16. a) had developed b) resembles
17. You should consult a dentist
18. Pleas switch of the TV
19. With Pleasure
20. a) Request b) Suggesting

Part – B (2)

Time: 1 Hour **Marks:15**

Instructions :

1. Answer the questions in 'Part-B' on the paper itself.
2. This part of the question paper should be attached to the Main Answer Book of the student.

9. Edit the following passage correcting the under lined parts. 5 × ½ = 2½ M
A true friend is one who praise (a) you before everybody and criticises when you are alone. He let (b) you know your faults and guides you to lead a finely (c) life. A true friend is acting (d) like a fire side that provides you warm (e) in cold times.

a) ____________________
b) ____________________
c) ____________________
d) ____________________
e) ____________________

10. Read the following paragraph and fill in the blanks with the correct options given against the number of blanks. 5×½ = 2½ M
When a person ____ (1) a treasure, he will be very happy and ____ (2). In the same manner if a person possesses a good friend, he will be _____(3) and more comfortable. A friend is a gift of God _____ (4) you extend your love, _______ (5) return you will get gratitude.

1. A) possess B) possessing
C) possesses D) possessed
2. A) comfortable B) comforting
C) comfort D) comforts
3. A) happy B) happier
C) happiest D) happily
4. A) While B) When
C) If D) An
5. A) on B) in
C) upon D) by

11. Combine the following sentences using "which". 1 M
The express has just arrived. It started from Tirupati yesterday.
Ans: ____________________

12. Change the following sentence into Passive voice. 1 M
My father sought a solution.
Ans: ____________________

13. Change the following into Reported Speech. 1 M
"I can remember the time", she said wistfully.
Ans:____________________

14. Combine the following sentences using 'because'. 1 M
He was suspended. He had to go out.
Ans:____________________

15. Fill in the blanks with suitable prepositions given in brackets. (2 × ½ = 1 M)
a) The students should do the project work ____ the instructions given by the teacher.
(in accordance with/ in spite of)
b) Ray was even shy ____ receiving compliments. (with/ of)

16. Fill in the blanks with suitable forms of verbs given in brackets. 1M
a) I _____ (do) my homework. I am free now.
b) When I went to the railway station, the train ____ already ____ (leave) the station.

17. Your brother is waking up till midnight. Advise him not to do so. 1M
Ans: ____________________

18. Change the following into a polite request. 1 M
You to passer by: Where is the Railway Station?
Ans: ____________________

19. Your friend greeted you 'How do you do?'
How would you respond in return? 1 M
A) Nice B) I am well
C) How do you do? D) Never mind

20. What do the following sentences mean?
Put a tick (_) mark against the right answer. 2 × ½ = 1 M
i) Shall I carry this bag for you?
A) Asking information ( )
B) Offering help ( )
C) Giving information ( )
D) Proposing ( )
ii) It's time we went home.
A) Giving advice ( )
B) Making a suggestion ( )
C) Questioning ( )
D) Seeking information ( )

Part -B (2) (Answers)

9. a) praises b) lets c) fine d) acts e) warmth
10. 1) C 2) C 3) A 4) A 5) A
11. The express, which started from Tirupati yesterday has just arrived.
12. A solution was sought by my father.
13. She told wistfully that she could remember the time.
14. He had to go out because he was suspended.
15. a) in accordance with b) of
16. a) did b) had left
17. You should have sufficient rest and sleep
(Any relevant answer can be given full credit)
18. Could you please tell me where the railway station is? (Any relevant answer can be given full credit)
19. How do you do?
20. i) B (Offering help)
ii) A (Giving advice)

ఉద్యోగాలు

ఐఐటీ పాలక్కాడ్‌లో 34 ఖాళీలు

కేరళలోని పాలక్కాడ్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వివిధ విభాగాల్లోని 34 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: డిప్యూటీ రిజిస్ట్రార్-1, అసిస్టెంట్ రిజిస్ట్రార్-3, టెక్నికల్ ఆఫీసర్ (టీవో)/ కంప్యూటర్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ (సీఎస్ఏ)-1, జూనియర్ సూపరింటెండెంట్-6, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ (లైబ్రరీ)/ సీనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్-2, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-6, జూనియర్ టెక్నీషియన్ (జేటీ)-7, జూనియర్ అసిస్టెంట్ (జేఏ)-8.

వేతనశ్రేణి: డిప్యూటీ రిజిస్ట్రార్-రూ.78,800-రూ.2,09,200, అసిస్టెంట్ రిజిస్ట్రార్, టీవో/ సీఎస్ఏ-రూ.56,100-రూ.1,77,500, జేటీ, జేఏ-రూ.21,700-రూ.69,100, మిగిలిన పోస్టులకు రూ.35,400-రూ.1,12,400.

వయసు: డిప్యూటీ రిజిస్ట్రార్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, టీవో/ సీఎస్ఏ-45 ఏళ్లు, జేటీ, జేఏ-27 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: టెస్ట్/ ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు: రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా చేరేలా పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11, 2018.

హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ: ఏప్రిల్ 16, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: https://iitpkd.ac.in

మోడీ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

అవినీతి కేసుల్లో జగన్ ఎ1 ముద్దాయి అయితే, నమ్మించి మోసం చేయటంలో మోడీ ఎ1గా నిలిచారని టిఎన్‌ఎస్‌ఎఫ్ (తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మం చౌదరి అన్నారు. రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిన నరేంద్రమోడీ వైఖరిని నిరసిస్తూ టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జిసెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రధాని మోడీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో వైసిపి, జనసేనలను అడ్డుపెట్టుకుని బిజెపి రాష్ట్ర ప్రజలను అంటరానివారిగా చూస్తోందని మండిపడ్డారు. మోడీ ఇప్పటికైనా రాజకీయాలు మానుకుని విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ సందర్భంలో కొద్దిపాటి ఉద్రిక్తత తలెత్తింది.



గుంటూరులో మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యకర్తలు

ప్రేమను అంగీకరించలేదని దాడి

గుంటూరు జిల్లా సీతానగరంలో ఘటన

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ప్రేమను అంగీకరించకపోగా, పోలీసులకు ఫిర్యాదు చేసిందనే కక్షతో యువతి, ఆమె కుటుంబంపై మారణాయుధాలతో దాడికి పాల్పడిన ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీతానగరంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరానికి చెందిన కావాటి దివ్య తల్లిదండ్రులు చనిపోవడంతో తాతయ్య వద్దే ఉంటోంది. విజయవాడలోని ఓ కాలేజీలో చదివే సందర్భంలో తమ ప్రాంతానికే చెందిన సాతుపాటి నవీన్ ప్రేమ పేరుతో వేధించేవాడు. కాలేజీ దగ్గరకూ వెళ్లి నిత్యం తన ప్రేమను అంగీకరించాలని ఒత్తిడి చేసేవాడు. ఇది భరించలేని దివ్య విషయాన్ని తన కుటుంబీకులకు చెప్పడంతో పాటు గతేడాది అక్టోబర్ 20న తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసులో 40 రోజులు శిక్ష అనుభవించిన నవీన్ బెయిల్‌పై వచ్చి మళ్లీ దివ్యను వేధించడం మొదలుపెట్టాడు. కేసును ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపుతానని బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి దివ్య తన సోదరుడు ప్రణీత్‌కుమార్, మేనమామ, మేనత్తలైన మ్యాంద్రగుత్తి సురేష్, దైవరాజ్యంతో కలిసి ఇంట్లో ఉండగా నవీన్ అతని సోదరుడు రాము కలిసి గొడ్డలి, కర్రలతో దాడికి దిగారు. దాడిలో సురేష్, ప్రణిత్‌కుమార్ తలలు పగిలాయి. దైవరాజ్యాన్ని కర్రలతో చితకబాది పరారయ్యారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

53వ రోజుకు చేరిన న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - కడప/కర్నూలు/అనంతపురం

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కడప,కర్నూలు, అనంతపురం జిల్లాలో న్యాయవాదుల దీక్షలు కొనసాగుతున్నాయి కడప జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 53వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో న్యాయవాదులు ఎం.బాలగంగాధర్‌రెడ్డి, ఎం.డి. అబ్దుల్ నయీమ్, పి.నాగరాజు, వి.శ్రీనివాసరావు, ఎం.ఇమాన్యుయల్ కూర్చున్నారు. అనంతపురంలో రాయలసీమ హైకోర్టు సాధన సమితి, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు పలువురు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కర్నూలులో న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతుగా మాట్లాడారు. హైకోర్టు కేటాయించే వరకు దీక్షలు కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు.

19న అంగన్‌వాడీల చలో విజయవాడ

ప్రజాశక్తి-నెల్లూరు

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 19న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హైమావతి, సుజాతమ్మ తెలిపారు. నెల్లూరు సిఐటియు కార్యాలయంలో శుక్రవారం వారు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తల్లి, బిడ్డ సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఐసిడిఎస్ పథకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం అన్యాయమని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక ఏళ్లుగా సేవలందిస్తున్నా వారికి ఇప్పటికీ కనీస వేతనం రూ.18వేలు అమలు జరపడం లేదన్నారు. వారికి రూ.3వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యకర్తలకు పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఫీడింగ్, పిల్లలకు సాయంత్రం అల్పాహార విందు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ హెల్పర్లకు అన్న అమృత హస్తానికి ఇస్తామన్న రూ.250లను వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యల సాధన కోసం విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం చలో విజయవాడ గోడ పత్రికలను వారు విడుదల చేశారు.

నిర్బంధంతో ఉద్యమాలు ఆగవు

ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై సిద్దయ్య

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

ప్రజల సొమ్మును, దేశవనరులను వేల కోట్లలో దోపిడీ చేసే దోపిడీదారులు, దొంగలు యథేశ్చగా బయట తిరుగుతున్నారని, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసేవారిని జైల్లో నిర్బంధిస్తు న్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై సిద్దయ్య విమర్శించారు. జైల్లో ఉన్న సిపిఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిద్దయ్య మాట్లాడారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ఏడు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాను కూడా వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని సిపిఎం, వామపక్షాలు ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోరాటంలో 50 మంది సిపిఎం నేతలపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడం దారుణమన్నారు. కమ్యూనిస్టులకు జైళ్లు కొత్తకాదన్నారు. జైల్లో నిర్బంధించిన మాత్రాన ఉద్యమాలు ఆగవన్నారు. జిల్లా వెనుకబాటు పై ప్రత్యేకంగా చర్చిస్తామని, సిపిఎం నేతలపై కేసులు ఎత్తివేస్తామని, జైలు నుండి విడుదల చేస్తామని అసెంబ్లీలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర నాయకులు అన్న నల్లూరి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రాంతికుమార్, అభివృద్ధి వేదిక అధ్యక్షులు టి గోపాల్‌రెడ్డి, జనసేన జిల్లా నాయకులు ఆర్ బుజ్జి మాట్లాడారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిద్దయ

సంకెళ్లతో ప్రదర్శన

జైల్లో ఉన్న సిపిఎం నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో సిపిఎం కార్యకర్తలు ఎర్రజెండాలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. ప్రజా ఉద్యమ కారులను సంకెళ్లతో నిర్బంధిస్తే ఉద్యమాల ఆగవంటూ ఆరుగురు సిపిఎం కార్యకర్తలు సంకెళ్లతో ప్రదర్శన ముందు భాగాన నడిచారు. సుందరయ్య భవన్ నుండి ప్రారంభమైన ప్రదర్శన కర్నూల్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు జరిగింది. అక్కడ ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

ఉపాధి హామీ కోసం 21న చలో అసెంబ్లీ

ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం కింద రోజు కూలీ రూ.500లకు పెంచాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఈ చట్టాలన్ని పరిరక్షించి సరిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న చేపట్టిన చలో అసెంబ్లీకి కూలీలంతా దండుగా రావాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యూయు) ప్రధాన కార్యదర్శి, వి వెంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు,దాసరి భవన్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, జల్లి విల్సన్ శుక్రవారం దాసరి భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వలసల నివారణ కోసం సాధించుకున్న గ్రామీణ

ఉపాధి హామీ చట్టం కూలీలకంటే దళారీలకే ఉపయోగపడుతోందని వారు విమర్శించారు. గ్రామాల్లో పనులు లేక కూలీలు వలస పోతుంటే, ఆదుకోవాల్సిన బిజెపి, టిడిపి నాయకులు గాదికింది పందికొక్కుల్లా నిధులను మెక్కుతున్నారని దుయ్యబట్టారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా మిగీతా జిల్లాల్లోనూ కూలీలు వలసలు పోతుంటే, కూలీలు పని చేసినట్లు దొంగ లెక్కలతో డబ్బు కాజేస్తున్నారని ఆరోపించారు. పనుల కోసం కూలీలు అధికారుల చుట్టూ తిరిగినా రాయలసీమలో పనులు కల్పించడం లేదన్నారు. ప్రతి గ్రామంలో వెంటనే పని కల్పించాలని, 100 రోజులు దాటిన ప్రతి కుటుంబానికి 200 రోజుల పని, రోజు కూలీ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసిన పనికి పేస్లిప్‌లు ఇవ్వాలని, పోస్టాఫీస్‌ల ద్వారా వారంలోపు బిల్లులు చెల్లించాలని, పాత బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. రెండు పూటలా పని ఆలోచన విరమించాలని, పని ప్రదేశాల్లో మధ్యాహ్న భోజన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రసూతి మహిళలలకు 90 రోజులు పని దినాలకు ఉచితంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. ఒంటరి, వృద్ధాప్య మహిళలకు ప్రాధాన్యంతో పని ఇవ్వాలని తెలిపారు. ఉపాధి మేట్లకు గుర్తింపు కార్డులు, జీతాలు సహా ఇన్‌సెంటివ్స్ ఇవ్వాలని కోరారు. ఉపాధి నిధులను సిమెంట్ రోడ్లకు, భవనాలకు, స్టేడియాలకు, గోడౌన్‌లకు మళ్లించొద్దని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజనుల భూములు అభివృద్ధి చేయాలని కోరారు. చెరువులు, కుంటలు, పంటకాలువలు, భూగర్భ జలాలు పెరిగే అన్ని రకాల మట్టి పనులు, మట్టిరోడ్ల పనులు చేయించాలని డిమాండ్ చేశారు. యంత్రాలను నిషేధించాలని, అందరికి పనిముట్లు, టెంట్, మెడికల్ కిట్ ఇవ్వాలని, ప్రమాదాల్లో చనిపోయిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

త్రిపురలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడులపై ఫొటో ప్రదర్శన

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

త్రిపుర రాష్ట్రంలో సిపిఎం కార్యకర్తలపైనా, సిపిఎం కార్యాలయాలపైనా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడులు, మహనీయుల విగ్రహాల ధ్వంసంపై సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం విజయనగరంలో కోట జంక్షన్ వద్ద ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదుల దాడులు అధికమయ్యాయన్నారు. త్రిపురలో బిజెపి గెలిచిన వెంటనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రధానంగా సిపిఎం, వామపక్షాల నాయకులపై దాడికి పాల్పడడం, కార్యాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేయడం లక్ష్యంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్మికవర్గ రాజ్యం కోసం, సమసమాజం కోసం కృషి చేసిన మహనీయుడు లెనిన్ విగ్రహాన్ని, అంబేద్కర్, పెరియార్ విగ్రహాలను ధ్వంసం చేయడం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆరాచకాలకు నిదర్శనమన్నారు. అప్రజాస్వామిక చర్యలను ప్రజాతంత్రవాదులంతా ఖండించాలని కోరారు.



తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చెవులకు గుడ్డలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న భాషాభిమానులు

తెలుగుకు పట్టం కట్టాలి

తెలుగు భాషోద్యమ సమితి వినూత్న నిరసన దీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'తెలుగు భాషను విస్మరిస్తే, జాతి అంతరించే ప్రమాదం ఉందని, మాతృభాషకు పట్టం కట్టాలి' అని అభ్యుదయవాదులు, భాషాభిమానులు ఉద్ఘాటించారు. శుక్రవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో చెవులకు గుడ్డలు కట్టుకుని వినూత్నరీతిలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాకం నాగరాజు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిందని, ప్రస్తుతం తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగువారిపై ఉందన్నారు. గిడుగు స్ఫూర్తితో ఇంటినుంచే భాషోద్యమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భాషోద్యమకర్త ఎస్.రమేష్‌బాబు మాట్లాడుతూ అమరావతిలో పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రచయిత గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భాషను కాపాడుకోవడం కోసం ప్రతి ప్రాంతం నుంచి ఉద్యమాలు రావాలని, భాషా సాధికారతకు ప్రాంతాల వారీగా కమిటీలను వేసుకుని ముందుకు సాగాలన్నారు.

బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని నాయీ బ్రాహ్మణుల ధర్నా

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించాలని నాయీ బ్రాహ్మణులు శుక్రవారం ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు మాట్లాడారు. ధర్నాలు, ఆందోళనలు చేయకుండా ఈ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే పరిస్థితిలో లేదని విమర్శించారు. ఎన్నికల ముందు అన్ని వర్గాల వారికి హామీలు గుప్పించిన ప్రభుత్వం, అందలమెక్కిన తరువాత వాటిని విస్మరించడం బాధాకరమన్నారు. ఆందోళనకు సిపిఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ద్రాక్షారపు సూరిబాబు, కె.ఈశ్వరరావు మాట్లాడారు. ఇటీవల ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో నాయీ బ్రాహ్మణులకు కేవలం రూ.30 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించి, ప్రతీ కుటుంబానికి నూరుశాతం సబ్సిడీపై లక్షరూపాయలు, 80 శాతం సబ్సిడీతో 2 లక్షలు, 60 శాతం సబ్సిడీతో 5 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సెలూన్‌లలో వినియోగిస్తున్న 250 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలన్నారు. నగర పరిధిలో ప్రభుత్వం నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో తమకు 5 శాతం కేటాయించి, 50 శాతం అద్దె రాయితీ ఇవ్వాలన్నారు.

ముగిసిన వ్యకాస జీపుజాతాలు

ప్రజాశక్తి - విశాఖ గ్రామీణ విలేకర్లు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో యంత్రాలను నిషేధించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం ఈ నెల 13న చేపట్టిన జీపుజాతా శుక్రవారం ఎస్.రాయవరం, అచ్యుతాపురం, మునగపాక, కశింకోట, అనకాపల్లి మండలాల్లో సాగింది. చివరిగా అనకాపల్లి మండలం కొండుపాలెంలో సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ యుపిఎ-1 ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని నేటి ప్రభుత్వాలు నీరుగార్చుతున్నాయని విమర్శించారు. ఉపాధి హామీ నిధులను నీరు-చెట్టు, సిసి రోడ్లు, గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పథకాలకు మళ్లించి ఆ పనులను యంత్రాలతో చేయించడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయన్నారు. కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21న విజయవాడకు దండుగా కదిలి వచ్చి ప్రభుత్వ మెడలు వంచాలని ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు.

ఇసుక మాఫియా కొనసాగుతుందనడం సరికాదు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

క్వారీల్లో ఎటువంటి సీనరేజిలు లేకుండా ఇసుకను ఉచితంగానే ప్రభుత్వం అందిస్తుందనీ, కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే తాము చెల్లిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షులు చావా రమేష్ బాబు, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎపి అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో నారెడ్‌కో, బిఎఐ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా కొనసాగుతుందని, అత్యధిక ధరలకు అమ్ముతున్నారని ఓ పార్టీ నాయకుడు ఆరోపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక క్వారీల నిర్వహణ బాధ్యతను డ్వాక్రా గ్రూపులకు ఇవ్వడంతో ఇసుక రేటు తగ్గిందన్నారు. అయితే ఇనుము, సిమెంటు రేట్లు అధికంగా ఉన్న కారణంగా నిర్మాణ రంగం కొంత ఆందోళనకరంగా ఉందన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. 7.3 శాతం
2. మార్చి 15, 3. న్యూఢిల్లీ
4. ఇంఫాల్ (ఈ నెల 16 నుంచి 20 వరకూ)
5. ఛ్చన్వెయ్ బ్లాక్ (మిర్జాపూర్ జిల్లా)

బడ్జెట్లో నిధుల కేటాయింపుపై సిఎంకు ఎపిడబ్ల్యుజెఎఫ్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న మీడియా జర్నలిస్టుల గృహ వసతి కోసం బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయిస్తున్నట్లు శుక్రవారం జరిగిన శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. జర్నలిస్టుల గృహ వసతి విధివిధానాలు రూపొందించడానికి, గృహవసతిపై ముందుకు వెళ్లడానికి వీలుగా ప్రభుత్వం ఇప్పటికే ఓ కమిటీని నియమించినం దుకు ఫెడరేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును, సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులును శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనే యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటి శ్రీనివాస్, నాయకులు ఎం.బి. నాథన్, ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రంగారెడ్డి కలిసి కృతజ్ఞ తలు తెలిపారు. వీలైనంత త్వరగా ఈ కమిటీ విధివిధా నాలను ఖరారు చేసి జర్నలిస్టుల ఇంటి కలను సాకారం చేయాలని కోరారు. వివిధ సందర్భాల్లో మండల కేంద్రాల నుండి రాజధాని వరకు ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించి ప్రభుత్వం సత్వరం నిర్ణయం తీసుకునేందుకు తోడ్పడిన జర్నలిస్టులకు ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

సభ

ఐక్య పోరాటాలతోనే హోదా

- రాష్ట్రానికి బిజెపి మోసం చేసింది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి/గుంటూరు

'బిజెపి, టిడిపి కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేశాయి, పార్లమెంటు లోపలా, బయట ఉధృత పోరాటాలు జరిపితే తప్ప విభజన చట్టంలోని హామీలు అమలు కావు. ప్రజాభాగస్వామ్యంతో ఐక్యపోరాటాలు చేసినప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమవుతుంది.' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. శుక్రవారం విజయనగరంలోని కోట జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విశాఖకు రైల్వేజోన్ ఇస్తామని ఎన్నికల ముందు బిజెపి చెప్పిందని, గెలిచాక రైల్వేజోన్ లేదనడం దుర్మార్గమని విమర్శించారు. మోడీ, వెంకయ్యనాయుడు రాష్ట్రాన్ని మోసం చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. హోదా సంజీవని కాదంటూ, రాష్ట్రానికి ప్యాకేజీ వస్తుందంటూ ప్రజలను చంద్రబాబు మభ్యపెట్టారన్నారు. హోదా ఇవ్వబోమని కేంద్రం చివరికి చేత్తులెత్తేయడంతో మంత్రుల రాజీనామాతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. దేశంలో 11 రాష్ట్రాలు హోదా వల్లే అభివృద్ధి చెందాయన్నారు. హోదా లేకపోవడం వల్లే రూ.15 లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు సంతకాలకే పరిమితం అయ్యాయని తెలిపారు. ఈ నాలుగేళ్లు చంద్రబాబు ఈవెంట్ షో చేశారే తప్ప, అభివృద్ధి చేయలేదని అన్నారు. త్రిపురలో బిజెపి గుండాల దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. బిజెపి పతనం ప్రారంభమైందని, వారితో ఎవరు జతకడితే వారు నాశనం కాక తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, టి.వి.రమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వ రరావు ప్రసంగించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ యూత్ అండ్ స్టూ డెంట్ జెఎసి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ మోడీ ఇప్పటికైనా రాజకీయాలు మానుకుని విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

18న ఎంబివికెలో ప్రకృతి ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - గవర్నర్‌పేట (విజయవాడ)

మత సాంప్రదాయ పండుగలలోని మూఢత్వాన్ని ఛేదిస్తూ ఉగాది పేరుతో పంచాంగం, జ్యోతిష్యం, జాతకాల్లోని అశాస్త్రీయతను సవాల్ చేస్తూ అభ్యుదయ, శాస్త్రీయ, నాస్తిక, హేతువాద పద్ధతుల్లో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నట్లు వేడుకల ఆహ్వాన కమిటీ కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది బ్రోచర్‌ను విడుదల చేశారు. 18న మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో వేడుకలను ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేలా గత రెండేళ్లుగా వేడుకలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు తెలుగు వెలుగు బృందగీతాలు, వేమన నృత్యరూపం, మ్యాజిక్ షో, కవితాపఠనం తదితర కార్యక్రమాలతో పాటు ప్రముఖుల సందేశాలు ఉంటాయని వివరించారు. విజ్ఞానకేంద్రం కన్వీనర్ కె.ఎస్.సి బోస్, నాస్తిక సమాజం కార్యదర్శి మోతుకూరి అరుణ్ కుమార్‌లు మాట్లాడుతూ వేడుకలలో ప్రగతిశీల నాస్తిక అభ్యుదయ ఆలోచనపరులు భాగస్వామ్యం కావాలని కోరారు. నగర ప్రజలంతా కుటుంబసమేతంగా విచ్చేయాలని కోరారు. ఈ సమావేశంలో 17 సంస్థల ప్రతినిధులు, యువి.రామరాజు,

సోహ్రాబుద్దీన్ కేసులో 22న విచారణ

ముంబయి : సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్‌లో నిందితులైన ముగ్గురు సీనియర్ పోలీసు అధికారులను విడిచిపెట్టడాన్ని సవాలు చేస్తూ రుబాబుద్దీన్ షేక్ దాఖలుచేసిన రివిజన్ పిటిషన్‌పై ఈనెల 22న బాంబే హైకోర్టు నూతన న్యాయమూర్తి విచారించనున్నారు న్యాయమూర్తి మార్పు జరగడానికి ముందుగా, జస్టిస్ రేవతి మొహితె, రుబాబుద్దీన్ దాఖలు చేసిన మూడు పిటిషన్లను విచారించారు. రాజస్థాన్ పోలీసు కానిస్టేబుల్ దళ్‌పత్ సింగ్ రాథోడ్, గుజరాత్ పోలీసు అధికారి ఎన్.కె.అమిన్‌లను విడిచిపెట్టడాన్ని సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన రెండు పిటిషన్లను కూడా ఆమె విచారించారు. మొత్తం ఐదు పిటిషన్లకు గానూ మూడింటిపై ఆమె విచారణ జరిపారు. ఈ వారంలో రుబాబుద్దీన్ తరపు లాయర్ గౌతమ్ తివారి ఈ కేసును జస్టిస్ ఎన్.డబ్ల్యు. సాంబ్రే బెంచ్ ముందు ప్రస్తావించారు. ఆయన ఈ నెల 22న విచారణకు నిర్ణయించారు.



ఆధారాలు లేవు

లాలూప్రసాద్ యాదవ్ రైల్వేమంత్రిగా ఉన్నపుడు ప్రైవేటు సంస్థలకు హోటళ్ళను ఇచ్చి ప్రతిఫలంగా భూములు తీసుకున్నాడని ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన సిబిఐ ప్రస్తుతం ఆధారాలు లభించలేదని చెబుతున్నది.

తొలి విడతలో రు.222 కోట్ల ఎన్నికల బాండ్ల విక్రయం : కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే వారు తమ గుర్తింపు బయటపడకుండా వుండేందుకు ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్లు తొలివిడతగా రు.222 కోట్ల మేర అమ్ముడు పోయినట్లు ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. తొలివిడత విక్రయాలు ఈ నెల 1 నుండి ప్రారంభమయ్యాయని, ఈ నెల 9వ తేదీ వరకూ ఈ బాండ్ల విక్రయాల ద్వారా వసూలైన సొమ్ము మొత్తం రు.222 కోట్లకు చేరిందని ఆర్థికశాఖ సహాయమంత్రి పి రాధాకృష్ణన్ లోక్‌సభలో ఒక సభ్యుడి ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. రాజకీయ పార్టీలు చట్టబద్ధంగా నిధులు సమీకరించుకునేందుకు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ ఎన్నికల బాండ్లపథకాన్ని 2017-18 బడ్జెట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇతర బాండ్ల తరహాలో కాక ఈ పద్ధతిలో దాతలు రాజకీయ పార్టీలకు బ్యాంకులు చెల్లించే నిధుల కోసం ప్రామిసరీ నోట్ల తరహాలో వుండే ఈ బాండ్లను కొనుగోలు చేస్తారు. ఈ బాండ్లు కేవలం భారతీయ స్టేట్ బ్యాంకుకు చెందిన ఎంపిక చేసిన బ్రాంచ్‌ల్లో మాత్రమే లభిస్తాయని, ఈ పథకం కింద స్టేట్ బ్యాంకును మాత్రమే ఇందుకు అధీకృత బ్యాంకుగా ఎంపిక చేశామని మంత్రి తన జవాబులో వివరించారు. ఈ పథకాన్ని ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో నోటిఫై చేసిందని, తొలి విడత విక్రయాలు ఈ నెల 1 నుండి ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు.

త్వరలో రూ.10 ప్లాస్టిక్ నోటు



న్యూఢిల్లీ : రూ.10 ప్లాస్టిక్ నోట్లను చలామణీలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. తొలుత ప్రయోగా త్మకంగా ఐదు నగరాల్లో వీటిని తీసుకురానుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి రాధా కష్ణన్ లోక్ సభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. 'రూ.10 విలువ గల ప్లాస్టిక్ నోట్లను ఐదు నగరాల్లో ప్రయోగాత్మకంగా తీసుకు రావా లని నిర్ణయించాం. కోచి, మైసూర్, జయపుర, సిమ్లా, భువనేశ్వర్ నగరాల్లో వీటిని ప్రయోగాత్మకంగా చలామణీ లోకి తీసుకొస్తాం' అని రాధాక ష్ణన్ తెలిపారు. అయితే ఎప్పుడు తీసుకురానున్నది మాత్రం వెల్లడించలేదు. ఇక రూ.2000 నోట్ల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. రూ.2వేల నోట్ల చలామణీని నిలిపివేయా లనే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం దృష్టికి రాలేదని చెప్పారు. 2016 నవంబరులో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత రూ. 2000 నోటును ప్రవేశ పెట్టారు. దీంతో చిల్లర సమ స్యలు ఏర్పడ టంతో రూ.500 కొత్త నోట్లను కూడా విడుదల చేశారు. అయితే రూ.2వేల నోట్లను మళ్లీ వెనక్కి తీసుకుంటా రని, వాటి ముద్రణను కూడా నిలిపివేశారని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఈ వార్తలను ప్రభుత్వం అనేకసార్లు తోసి పుచ్చింది. రూ.2వేల నోట్ల చలామణీని నిలిపివేయడం లేదని పలుమార్లు స్పష్టం చేసింది.

అవిశ్వాసంపై నిర్ణయాన్ని త్వరలో ప్రకటిస్తాం : ఎఐఎడిఎంకె

చెన్నై : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం పట్ల తమ వైఖరిపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని ఎఐఎడిఎంకె శుక్రవారం తెలిపింది. పార్టీ కో ఆర్డినేటర్ ఓ. పన్నీర్ సెల్వం, కో-కోఆర్డినేటర్ కె. పళనిస్వామి నిర్ణయం తీసుకుంటారని ఎఐఎడిఎంకె సీనియర్ నేత జయకుమార్ తెలిపారు. అవిశ్వాస తీర్మానాన్ని పార్లమెంట్ చేపట్టినప్పుడు నిర్ణయం తీసుకుంటామన్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతి వ్వాలా? వద్దా అనే విషయమై పార్టీ నిర్ణయిస్తుందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి జయకుమార్ ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఎన్డీయే నుంచి బయటకు రావాలని తెలుగుదేశం పార్టీ శుక్రవారం నిర్ణయం తీసుకున్నసంగతి తెలిసిందే. ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

స్టీఫెన్ హాకింగ్‌కు రష్యా వ్యోమగాముల ఘన నివాళి



మాస్కో : ఇటీవల కన్నుమూసిన ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్‌కు రష్యా అంతర్జాతీయ రోదసీ కేంద్రం లోని వ్యోమగాములు ఘనంగా నివాళు లర్పించారు. భూమిని సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ చుట్టి వస్తున్న రోదసీ కేంద్రాన్ని చూపుతున్న వీడియోను రష్యా టుడే ఛానల్ ప్రసారం చేసింది. ఇందులో పాల్గొన్న ఒక వ్యోమగామి మాట్లాడుతూ తాము ప్రకృతిని అన్వేషిస్తూ ఉత్సాహంగా ముందుకు సాగుతున్న సమయంలో మానవత్వానికి సంబంధించిన హాకింగ్ సందేశాన్ని విన్నామని ఆయన చెప్పారు. ఇంతలోనే హాకింగ్ దూరమయ్యారన్న వార్త తమకు తెలిసి ఖిన్నులమయ్యామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వారు హాకింగ్ ప్రవచనాలను ఉటంకించారు.

లోయా మృతి కేసుపై తీర్పు వాయిదా : సుప్రీం

న్యూఢిల్లీ : సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా మృతి కేసులో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును సుప్రీం కోర్టు శుక్రవారం రిజర్వు చేసింది. సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్‌షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారణ జరుపుతున్న లోయా నాగపూర్‌లో డిసెంబరు 1, 2014న గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. తన సహచరుని కుమార్తె వివాహ వేడుకకు ఆయన నాగపూర్ వెళ్ళారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎంఎ ఖన్విల్కర్, డి.వై. చంద్రచూడ్ లతో కూడిన ధర్మాసనం లోయా మృతి కేసుపై దాఖలైన పలు పిటిషన్లపై విస్తృతంగా విచారణ జరిపింది. ఆ తరువాత తీర్పును వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. జడ్జి లోయా మృతి కేసులో దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లను మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది.

అన్సారీ హత్య కేసులో దోషులుగా 11 మంది గో గూండాలు : జార్ఖండ్ కోర్టు

గో గూండాలపై దేశంలోనే తొలి తీర్పు

రామ్‌గడ్ (జార్ఖండ్) : గో రక్షకుల పేరుతో గూండాగిరి చేసి అలిముద్దీన్ అలియాస్ అస్గర్ అన్సారీ హత్యకు కారణమైన 11 మంది గో గూండాలను జార్ఖండ్‌లోని ట్రైల్ కోర్టు దోషులుగా తేల్చింది. గోరక్షణ పేరుతో హింసకు పాల్పడ్డ కేసులో నిందితులను దోషులుగా తేల్చడం దేశంలోనే ఇది తొలిసారి. కోర్టు వీరికి ఈ నెల 20న శిక్ష విధించనున్నది. ఒక స్థానిక బిజెపినేతతో సహా మొత్తం 11 మంది నిందితులపై ఐపిసి సెక్షన్ 302(హత్య) కింద దోషులుగా కోర్టు నిర్ధారించింది. అంతేకాకుండా వారిలో ముగ్గురిని ఐపిసి సెక్షన్ 120 బి (కుట్ర) కింద కూడా దోషులుగా పేర్కొంది. అలిముద్దీన్ అలియాస్ అస్గర్ అన్సారీని గత ఏడాది జూన్ 29న రామ్‌గఢ్‌లోని కొంతమంది దుండగులు కొట్టి చంపారు. అన్సారీ గో మాంసాన్ని తీసుకెళ్తున్నాడన్న ఆరోపణలతో దుండగులు దాడి చేశారు. ఈ దాడి అనంతరం గో గూండాయిజంపై మోడీ మౌనం వీడారు. అన్సారీ తన వాన్‌లో 200 కిలోల మాంసాన్ని తీసుకు వెళ్తుండగా దాడి చేసినట్లు సమాచారం. ఈ కేసులో పోలీసులు జోక్యం చేసుకున్నారు. అన్సారీ తీవ్రమైన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ కేసులో స్థానిక బిజెపి నేత నిత్యానంద మహతో తో సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు లొంగి పోయారు.

ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కెర్లు కొట్టాయి. అందులోని దృశ్యాలను చూస్తే దుండగులు అన్సారీని మాంసంతో కొట్టినట్లు, ఒక కారు తగలబడుతున్నట్లు కనిపించాయి. దీనిపై అన్సారీ భార్య మారియం ఖాటూన్ మాట్లాడుతూ తన భర్త హత్యకు భజరంగ్ దళ్‌దే బాధ్యతన్నది. తన భర్తపై దాడి చేసిన నిందితులు భజరంగ్‌దళ్‌కు విధేయులని పేర్కొంది. ఈ కేసు 2017లో అన్ని పత్రికలలోనూ ప్రముఖంగా ప్రచురితమైంది. ఈ దుర్ఘటనలో ఒక సాక్షి తాను చూసింది చెప్పడానికి చాలా భయపడ్డాడు. కోర్టు రూము వెలుపల జరిగిన ఒక ప్రమాదంలో అతని భార్య మరణించడమే ఇందుకు కారణం. అలిముద్దీన్ సోదరుడు జలీల్ అన్సారీ సాక్ష్య మిచ్చేందుకు గురువారం కోర్టుకు వచ్చాడు. అయితే జలీల్ తన గుర్తింపునకు సంబంధించిన ప్రూఫ్‌ను మరిచిపోయాడు. అలిముద్దీన్ కుమారుడు షహజాద్ అన్సారీ ఇంటికి వెళ్ళి దానిని తీసుకు వచ్చాడు. వీరు తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని ఒక బైక్ బాధితుల బైక్‌ను ఢీ కొన్నదని పోలీసులుతెలిపారు.


ముంబయి కార్మికుల ఆకలి కేకలు



ముంబయి : దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరంలో ఉపాధి అవకాశాలకు క్రమంగా గండిపడుతుండటంతో దినసరి వేతనాలు, రోజుకూలీపై ఆధారపడుతున్న చిరుద్యోగులు,కూలీలు అర్ధాకలితో గడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 20 ఏళ్ల క్రితం ఉపాధి కోసం ముంబయి నగరానికి వచ్చిన కూలీలకు ఇప్పుడు పనులు లభించటం కష్టతరమౌతోంది. కాంట్రాక్టర్ల నుండి వచ్చే పిలుపు కోసం వీరంతా నగరంలోని ప్రధాన కూడళ్లలో పడిగాపులు కాస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకూ నెలకు కనీసం 20 రోజుల పాటు పని లభించేదని, ఇప్పుడు కనీసం నాలుగైదు రోజులకు కూడా పని లభించటం గగనమవుతోందని కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ఐదేళ్లలో రోజు కూలీ ద్వారా రోజుకు రు.300 నుండి 400 సంపాదించే ఒక కూలీకి ఇప్పుడు ఉపాధి అవకాశాలకు గండిపడటంతో అతడి నెలసరి సంపాదన రు.2 వేలకు మించటం లేదు. నగరంలో ఇంటి అద్దెలు, నిత్యావసరాల ధరలు భారీగా పెరగటంతో చాలీ చాలని సంపాదనతో అర్ధాకలితో బతుకీడుస్తున్నామని కొందరు కూలీలు చెబుతున్నారు. ఆర్థికాభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తా మన్న హామీతో 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి తన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం నిరుద్యోగ యువతకు ఉపాధి అవ కాశాలను పెంచుతామంటూ గంభీర ప్రకటనలు చేస్తూనే వున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఉపాధి అవకాశాలకు భారీగా గండిపడిందని పలువురు కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. 2016 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు ప్రకటించిన తరువాత ఉపాధి అవకాశాల కొరత తీవ్రంగా పెరిగిందని 12 మందిలో కనీసం ఏడుగురు అభిప్రాయపడ్డారు. వస్తు, సేవల పన్ను విధానంతో తమ కష్టాలు మరింత పెరిగాయని మరో ఐదుగురు కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన హామీలను విస్మరించి తమను కష్టాల్లోకి నెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. చాలీ చాలని సంపాదనతో ఇప్పుడు అర్ధాకలితో అలమటిస్తున్న తాము ఈ ప్రభుత్వానికి మరోసారి ఓటు వేయబోమని స్పష్టం చేశారు.

ప్యాకేజీ ఇచ్చేందుకు సుముఖంగానే ఉన్నాం

కానీ ఏపి నుంచి వివరాలు రాలేదు
కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు నెరవేర్చడంలో వైఫల్యం చెందడంపై వైసిపి, టిడిపి కేంద్రంపై అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు ఇచ్చేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని పునరుద్ఘాటించారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ టిడిపి పట్టుబట్టిన నేపథ్యంలో ఇవ్వడం కుదరదని ఇటీవల జైట్లీ ప్రకటించారు. దీంతో కేంద్ర మంత్రివర్గం నుంచి టిడిపి తప్పుకొంది. తాజాగా ఎన్డీఏతో తెగదెంపులు చేసుకుంది. టిడిపి ఈ నిర్ణయం తర్వాత తొలిసారిగా జైట్లీ స్పందించారు. "ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో సమానమైన ప్యాకేజీ ఇచ్చేందుకు కేంద్రం ఎప్పుడూ సుముఖంగానే ఉంది. కానీ, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏపి ప్రభుత్వం కేంద్రానికి ఇవ్వడంలేదు. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఏపి నుంచి వచ్చే స్పందన కోసం మేం నిరంతరాయంగా ఎదురుచూస్తున్నాం" అని జైట్లీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో సమానమైన మొత్తాన్ని అందించడానికి కేంద్రం కట్టుబడి ఉందని కూడా జైట్లీ ప్రకటించారు.

దబ్బులడిగారు...పనులు చేయలేదు : పియూష్ గోయల్

కేంద్రంలో ఎన్డీఏ కూటమితో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెగతెంపులు చేసుకోవడం, ఏపికి ప్రత్యేక హోదాపై కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయెల్ స్పందించారు. ఈ నిర్ణయం వెనుక వాస్తవాల కంటే సెంటిమెంట్లే బలంగా పనిచేశాయని ఆయన అన్నారు. రైజింగ్ ఇండియా సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో చేసిన అన్ని కమిట్‌మెంట్లకు వంద శాతం కట్టుబడి ఉన్నామని, అమరావతికి రూ.2.500 కోట్లు ఇచ్చామని, అయితే అమరావతిలో ఏ పనులూ చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు. వాస్తవాలు కంటే సెంటిమెంట్లే బలంగా పనిచేయడం వల్ల ఎన్డీఏకు దూరంగా ఉండాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ఏపి ప్రత్యేక హోదా అంశంపై రాజ్యసభలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి మధ్య వాగ్వాదం జరిగింది. హోదా ఇస్తామని విభజన సమయంలో చెప్పి, ఇప్పుడు ఎందుకు మాట మార్చారంటూ సుజనా చౌదరి ప్రశ్నించారు. దీనిపై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.

2019లో బిజెపి 110 స్థానాలు కోల్పోతుంది

శివసేన



ముంబయి : వచ్చే ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 100-110 స్థానాలను కోల్పోతుందని దాని మిత్రపక్షం శివసేన జోస్యం చెప్పింది. కమలం పార్టీకి కంచు కోటలుగా వున్న గోరఖ్‌పూర్, ఫూరల్‌పూర్ ఉప ఎన్నికలలో వీచిన వ్యతిరేక పవనాలు ఇలాగే కొనసాగితే ఆ పార్టీ 110 స్థానాలు కోల్పోవడం ఖాయమని శివసేన తన అధికార పత్రిక సామ్నా తాజా సంచిక సంపాదకీయంలో పేర్కొంది. త్రిపురలో వామపక్షంపై గెలిచిన సంబరాల్లో వున్న కమల నాధులకు ఈ ఉప ఎన్నికల ఫలితాలు తీవ్రమైన షాక్‌నిచ్చాని శివసేన వ్యాఖ్యానించింది. ఉప ఎన్నికల ఫలితాల ప్రభావం సార్వత్రిక ఎన్నికల్లో కన్పించబోదని బిజెపి డాంబికాలు పలుకుతున్నా ప్రధానిగా నరేంద్రమోడీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ తొమ్మిది స్థానాలను కోల్పోయిందని గుర్తు చేసింది. దీనితో 282గా వున్న ఆ పార్టీ బలం దాదాపు మొత్తం 543 మంది సభ్యులున్న సభలో సగమైన 272కు చేరిందని వివరించింది. యుపి అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 325 స్థానాలను గెల్చుకున్న బిజెపి, దానికి నేతృత్వం వహిస్తున్న యోగి ఆదిత్యనాథ్ సొంత స్థానం గోరఖ్‌పూర్‌ను నిలుపుకోలేక పోయిందని తెలిపింది. 1991 నుండి ఈ స్థానంలో ఎన్నడూ ఓటమినెరుగని బిజెపి, ఈ ఫలితాలపై ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం వుందని అభిప్రాయ పడింది. 2014లో ప్రజల కళ్లకు కమ్మిన 'మాయ' పొరలు బిజెపి విజయానికి తోడ్పడ్డాయని, ఇప్పుడు ఆ భ్రమలన్నీ క్రమంగా తొలగిపోతుండటంతో ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారని ఈ సంపాదకీయం వివరించింది. ప్రజల్లో ఉత్సాహం లేకపోవటం, బిఎస్పీ, ఎస్పీ మధ్య కుదిరిన రహస్య ఒప్పందం అంటూ కబుర్లు చెబుతున్న బిజెపి 2014లో ఎన్ని రహస్య ఒప్పందాలతో అధికారంలోకి వచ్చిందో చెప్పాలని సామ్నా నిలదీసింది. జెహానాబాద్, అరారియాలలో ఆర్‌జెడి అభ్యర్థుల విజయాన్ని ప్రస్తావిస్తూ లాలూ ప్రసాద్ యాదవ్ పట్ల ప్రజల సానుభూతి ఇక్కడ పనిచేసిందని చెబుతూ బిజెపి శ్రేణులు అబద్ధాల స్వర్గంలో జీవిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

చెప్పకోదగిందేమీ లేదు

తమిళనాడు బడ్జెట్‌పై కమల్‌హాసన్



చెన్నై : తమిళనాడు ప్రభుత్వం సమర్పించిన బడ్జెట్‌ను మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్‌ఎం) వ్యవస్థాపకుడు కమల్ హాసన్ శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. రైతులు, చేనేత కార్మికులు, మత్స్యకారులకు సంబంధించి ఈ బడ్జెట్‌లో చెప్పుకోదగ్గది ఏమీ లేదన్నారు. తమ భవిష్యత్‌ను రూపొందించే మరింత మెరుగైన ప్రతినిధులు ఈ రాష్ట్ర ప్రజలకు అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. గత సంవత్సరాల బడ్జెట్‌లకు కాపీలా ఈ ఏడాది బడ్జెట్ వుందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

పాకిస్తాన్‌లో భారత దౌత్యవేత్తలకు వేధింపులు

ఇస్లామాబాద్ : అర్ధరాత్రుళ్ళు తలుపు కొట్టి, పారిపోవడం, అభ్యంతరకరంగా ఫోన్ కాల్స్ చేయడం, విద్యుత్, నీటి సరఫరాలు బంద్ చేయడం, కారును వెంటాడడం, దూకుడుగా వ్యవహరించడం, పిల్లలను అడ్డగించడం...ఇవన్నీ ఏంటి అనుకుంటున్నారా? చూస్తుంటే ఇరుగు, పొరుగువారితో గొడవలు వచ్చే విషయాలు అనుకుంటున్నారా? ఇది నిజమే, అయితే ఇక్కడ ఇరుగు పొరుగు ఇళ్లవారు కాదు, ఇరుగు, పొరుగు దేశాలు ఇటీవల కాలంలో భారత్, పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖలు పరస్పరం ఈ వేధింపుల గురించి ఆరోపణలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌లో పొలిటికల్ కౌన్సెలర్‌గా పనిచేసిన విష్ణు ప్రకాష్ ఈ వేధింపుల గురించి గుర్తు చేసుకున్నారు. తెల్లవారు జామున 3గంటల సమయంలో తమ ఇంటి డోర్‌బెల్ మోగేదని, పాక్ ఐఎస్ఐ గూఢచారులు తమను వెంటాడేవారని, తాను డాక్టర్ దగ్గరకు వెళితే, బయట నిలబడి ఏం మాట్లాడుతున్నానో వినేవారని చెప్పారు. తమ దౌత్య సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందుల జాబితాను ఈ నెల 13న భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు న్యూఢిల్లీలోని పాక్ హై కమిషన్ అందచేసిన నేపథ్యంలో ప్రస్తుత వివాదం బయటకు వచ్చింది. భారత్‌లో విదేశీ దౌత్యవేత్తలకు రక్షణ కల్పించలేని భారత ప్రభుత్వ ఉదాసీన వైఖరిని పాక్ ప్రభుత్వం ప్రశ్నించింది.

ఆర్చ్ బిషప్‌పై ఎఫ్ఐఆర్... హై కోర్టు 'స్టే'

కొచ్చి : ఆర్చ్ బిషప్ జార్జ్ అలెన్చరి, ఇతరులపై క్రిమినల్ కేసు నమోదు చేయడంపై కేరళ హై కోర్టు డివిజన్‌బెంచ్ స్టే విధించింది. సైరో-మల్బార్ చర్చికి చెందిన వివాదాస్పద భూ వ్యవహారాలకు సంబంధించి ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయకుండా ఈ ఆదేశాలిచ్చింది. ఫిర్యాదు మేరకు కార్డినల్, మరో ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టుకు చెందిన ఏకసభ్య ధర్మాసనం పేర్కొంది. పోలీసు ఫిర్యాదు దాఖలైన మరుసటి రోజే రిట్ పిటిషన్ ఎలా దాఖలైందో తెలపాలని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడానికి సంబంధించిన కేసుగా డివిజన్ బెంచ్ అభిప్రాయ పడింది. ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌తో సహా అన్ని రకాల ప్రక్రియలపై స్టే విధిస్తూ విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది.

ప్రత్యేకం

బిస్లరీ వంటి టాప్ బ్రాండ్‌లన్నీ కలుషితాలే



మియామీ : ప్రపంచంలో తాగునీటి ప్యాకేజింగ్ సంస్థలైన బిస్లరీ, తదితర సంస్థలు అందచేస్తున్న తాగునీరు అంతా కాలుష్యమేనని తాజా అధ్యయనంలో వెల్లడయింది. దాదాపు 9 దేశాలలో నిర్వహించిన ఈ సర్వేలో నీరు ప్యాకేజింగ్ ప్రక్రియలో ప్లాస్టిక్ కణాలు నీటిలో కలిసి దానిని విషపూరితం చేస్తున్నాయని వెల్లడయింది. న్యూయార్క్ నగరంలోని ఫ్రెడోనియా స్టేట్ యూనివర్శిటీకి చెందిన పరిశోధకుడు షెర్రీ మాసన్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. బిస్లరీ తదితర టాప్ బ్రాండ్ సంస్థలు అందచేస్తున్న తాగునీటిలో ప్లాస్టిక్ కణాల కాలుష్యం విస్తారంగా వున్నట్లు తాము గమనించామని ఈ అధ్యయన నివేదికలో వివరించారు. బ్రెజిల్, చైనా, భారత, ఇండోనేసియా, లెబనాన్, మెక్సికో, థాయ్‌లాండ్, అమెరికా దేశాలలో దాదాపు మూడు నెలల పాటు 250 వాటర్ బాటిళ్లను సేకరించి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 93 శాతం శాంపిళ్లలో ప్లాస్టిక్ కణాలను కనుగొన్నామని, ఇందులో ఆక్వా, ఆక్వాఫినా, దాసాని, ఎవియన్, బిస్లరీ, నెస్లే ప్యూర్ లైఫ్, శాన్ పెల్‌గ్రినో వంటి ప్రధాన బ్రాండ్‌లువున్నాయని పరిశోధకులు వివరించారు. ఈ ప్లాస్టిక్ కణాలలో ఎక్కువగా మూతలు తయారు చేయటానికి ఉపయోగించే పోలీ ప్రొపిలిన్, నైలాన్, పోలి ఇథెలిన్ టెరిఫ్థలేట్ (పిఇటి) వంటి విషపదార్థాలున్నాయని వివరించారు. ఒక్కో బాటిల్‌లో 10 వేలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను కనుగొన్నట్లు ఈ నివేదికలో వివరించారు.

సంక్షిప్తం

సింగర్ మెహందీకి రెండేళ్ళు జైలు శిక్ష

పాటియాల : మానవ అక్రమ రవాణా కేసులో సింగర్ దలేర్ మెహిందీకి రెండేళ్ళు జైలు శిక్ష పడింది. ఆయనపై 2003లో ఈ కేసు నమోదయ్యింది. పాటియాల కోర్టు ఆయనకు జైలు శిక్ష విధించింది. తమ బృందంలో సభ్యులుగా పేర్కొంటూ కొంతమందిని విదేశాలకు అక్రమంగా రవాణా చేసి పెద్ద మొత్తంలో డబ్బు గడించారన్న ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు. మెహిందీ సోదరులు 1998, 1999 సంవత్సరాలలో రెండు సార్లుగా పది మందిని తమ బృంద సభ్యులుగా అమెరికా తీసుకు వెళ్ళి అక్కడ చట్టవిరుద్ధంగా వదిలేశారన్న ఆరోపణలు వారిపై నమోదయ్యాయి.

కార్తీ బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరం బెయిల్ అభ్యర్ధనపై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తీర్పు రిజర్వు చేసింది. ఈ కేసులో ఉభయపక్షాల వాదనలు విన్న అనంతరం జస్టిస్ ఎస్.పి. గార్గ్ తీర్పును రిజర్వు చేశారు. కార్తీ చిదంబరం బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశ ముందని పేర్కొంటూ ఆయన బెయిల్ పిటిషన్ ను సిబిఐ వ్యతిరేకించింది. తన బెయిల్ పిటిషన్‌ను అత్యవసరంగా వినడాన్ని ప్రత్యేక సిబిఐ న్యాయమూర్తి నిరాకరించడంతో కార్తీ హైకోర్టును ఆశ్రయించారు.

ఆప్‌కు భగవంత్ మన్ రాజీనామా

ఆమ్ ఆద్మీ పార్టీ నేత భగవంత్ మన్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. శిరోమణి అకాళీదల్ ఏత విక్రమ్ సింగ్‌మజితియాకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణ చెప్పడానికి నిరసనగా భగవంత్ మన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తాను రాజీనామా చేసినప్పటికీ పంజాబ్‌లో డ్రగ్ మాఫియా, అన్ని రకాల అవినీతిపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని ఆ ట్వీట్‌లపేర్కొన్నారు.

బేషరతుగా శాంతి చర్చలు...!

ఐక్యరాజ్యసమితి : ఆఫ్ఘన్ ప్రభుత్వంతో త్వరలో జరుగనున్న శాంతి చర్చలకు ఎటువంటి ముందస్తు షరతులు పెట్టకుండా హాజరు కావాలని ఐరాస భద్రతా మండలి తాలిబన్లకు సూచించింది. తాలిబన్లతో ఈ నెల 28 శాంతి చర్చలు ప్రారంభించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఆఫ్ఘన్ అధ్యక్షుడు ఆష్రఫ్‌ఘనీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాతో ప్రత్యక్ష చర్చలను తాము కోరుకుంటున్నట్లు తాలిబన్లు ప్రకటించిన నేపథ్యంలో తాము వారిని రాజకీయ పార్టీగా గుర్తించే అంశాన్ని పరిశీలించనున్నట్లు ఆఫ్ఘన్ అధ్యక్షుడు ఘనీ ఈ కార్యాచరణ ప్రణాళికలో వెల్లడించారు. ఈ శాంతి చర్చలకు ఎటువంటి ముందస్తు షరతులూ లేకుండా హాజరు కావాలని, హింసకు పాల్పడ వద్దని భద్రతా మండలి తాలిబన్లకు విజ్ఞప్తి చేసింది.



శ్రద్ధాంజలి
వియత్నాంలోని సన్‌మై వద్ద 1968, మార్చి 16న అమెరికన్ సైనికులు 504 మంది వియత్నామీయులను సామూహికంగా హత్యచేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న బాలలు

అమెరికా ఆర్థిక దిగ్బంధాన్ని ఇప్పటికైనా తొలగించండి..!

ఐరాస వేదికపై క్యూబా డిమాండ్

జెనీవా: అమెరికా తమ దేశంపై కొనసాగిస్తున్న ఆర్థిక, వాణిజ్య దిగ్బంధానికి ఇప్పటికైనా తెరదించాలని ఐరాసలో క్యూబా రాయబారి లూయిస్ పెడ్రోసో డిమాండ్ చేశారు. ఇక్కడ జరుగుతున్న ఐరాస మానవ హక్కుల మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా చట్టవిరుద్ధంగా ఆక్రమించుకున్న తమ భూభాగం గ్వాంటనామో ప్రావిన్స్‌ను తమకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేసినట్లు క్యూబా దౌత్య వర్గాలు తెలిపాయి. తమ దేశ ప్రజలకు న్యాయం చేసేందుకు అవసరమైన పోరాటాన్ని క్యూబా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. క్యూబా ప్రజలు తమకు నచ్చిన రాజకీయ వ్యవస్థను ఎంచుకునే హక్కును తాము గట్టిగా సమర్ధిస్తున్నామని, ఎటువంటి జోక్యం లేకుండా స్వయం నిర్ణయాధికారాన్ని అనుసరిస్తున్నామని ఆయన వివరించారు. మానవ హక్కుల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరించటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. ఆయా దేశాలలో ప్రభుత్వాలను మార్చటం కోసం రాజకీయ వత్తిళ్లు, అమానుష చర్యల వంటి వాటిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అమెరికా ప్రతినిధి తన ప్రసంగంలో క్యూబాపై చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఇతర దేశాలను విమర్శిస్తూ వారు తమ దేశంలోనూ, ఇతర దేశాలలోనూ మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన ఘటనలను మర్చిపోమ్మంటున్నారని క్యూబా రాయబారి వ్యాఖ్యానించారు.

సైనిక విన్యాసాలను కుదిస్తున్న దక్షిణ కొరియా, అమెరికా

సియోల్ : ఉత్తర కొరియాతో దౌత్యపరమైన సంబంధాలు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఏటా నిర్వహించే వార్షిక సంయుక్త సైనిక విన్యాసాలను కుదించాలని దక్షిణకొరియా, అమెరికాలు నిర్ణయించాయి. ఈసారి విన్యాసాల్లో అమెరికా బి-1బి బాంబర్లతో సహా వ్యూహాత్మక ఆయుధాలేవీ ప్రదర్శించడం లేదు. ప్రతి ఏటా వసంత కాలంలో నిర్వహించే ఈ విన్యాసాలు తమపై దాడికి సన్నాహాలంటూ ఉత్తర కొరియా ఖండిస్తూ వుంటుంది. దీంతో ఉద్రిక్తతలు మరింత ఎక్కువవుతాయి. ఇటీవల వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా ఉభయ కొరియాల మధ్య కొంత సామరస్యత ఏర్పడింది. వచ్చే నెల్లో ఇరు దేశాల మధ్య సమావేశం నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నట్లు దక్షిణ కొరియా ప్రకటించింది.

ఉత్తర కొరియాతో త్వరలో ఉన్నతస్థాయి చర్చలు

వెల్లడించిన దక్షిణ కొరియా

సియోల్ : ఉభయ కొరియాల మధ్య జరిగే సమావేశానికి చేపట్టాల్సిన సన్నాహాలపై మార్చి చివరిలో ఉత్తరకొరియాతో ఉన్నతస్థాయి చర్చలు జరపాలని దక్షిణ కొరియా భావిస్తోందని అధ్యక్షుడు మూన్ జే ఇన్ ప్రతినిధి జోంగ్ సియోక్ తెలిపారు. కొరియా ద్వీపకల్పం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ఉభయ కొరియాల సమావేశం కీలక మలుపు కావాలని అధ్యక్ష కమిటీ మొదటి సమావేశం భావించిందని చెప్పారు. ఉత్తర కొరియా అణు నిరాయుధీకరణ, సైనిక ఉద్రిక్తతలను నివారించడం, ఉభయ కొరియాల మధ్య కొత్తగా నెలకొనే సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడం, శాశ్వత శాంతి స్థాపన దిశగా చర్యలు తీసుకోవడంపై చర్చలు జరపాలని భావిస్తున్నట్లు జోంగ్ తెలిపారు.

రష్యాతో ప్రచ్ఛన్న యుద్ధం వద్దు

సాక్ష్యాలు లేకుండా తొందరపడొద్దు

బ్రిటీష్ కార్మిక నేత కార్బిన్ హెచ్చరిక

నాలుగు దేశాల ఆరోపణ

ఖండించిన రష్యా



లండన్ : రష్యా మాజీ గూఢచారిపై విష ప్రయోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై పూర్తి స్థాయి సాక్ష్యాధారాలు లేకుండానే ఆ దేశంతో కొత్తగా ప్రచ్ఛన్న యుద్ధానికి దిగడంపై బ్రిటీష్ కార్మిక నేత జెరిమి కార్బిన్ హెచ్చరించారు. ఇటువంటి ఉద్రిక్త వాతావరణంలో సాక్ష్యాధారాల కన్నా ముందుగానే మనం తొందరపడడం వల్ల జాతీయ భద్రతా ప్రయోజనాలు నెరవేరవని వ్యాఖ్యానించారు. పోలీసులు ఒక పక్క సాక్ష్యాలను సేకరిస్తున్నా రని, ఈలోగా ఇలా వ్యవహరించడం సరైన పని కాదని గార్డియన్ పత్రికకు రాసిన వ్యాసంలో ఆయన పేర్కొన్నారు. ఈ దారుణమైన సంఘటనపై ముందుగా కూలంకషంగా, క్రిమినల్ దర్యాప్తు జరగాలని కోరారు. లేబర్ పార్టీ, పుతిన్‌కు మద్దతివ్వడం లేదని, అయితే ఈ దాడి వెనుక రష్యా వుందని తేలితే అప్పుడు ఆ దేశాన్ని జవాబుదారీ చేయాలని కోరారు. బహుశా రష్యన్ మాఫియా ఈ దాడి వెనుక వుండవచ్చని భావిస్తున్నట్లు కార్బిన్ చెప్పారు. రష్యా మాజీ గూఢచారిపై విష ప్రయోగం జరిగిందనే వివాదం గురువారం మరింత ముదిరింది. రసాయన దాడికి రష్యానే కారణమని పేర్కొం టూ అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ నేతలు సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేశాయి. కాగా ఈ ఆరోపణలను రష్యా తిరస్కరిస్తోంది. బ్రిటన్‌లోని సాలిస్‌బరీలో సెర్గి, యులియాలపై జరిగిన దాడిని తాము ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. రసాయన ఆయుధాల నిషేధ సంస్థకు తక్షణమే ఈ దాడి గురించి పూర్తి వివరాలు అందచేయాలని నాలుగు దేశాలు రష్యాను కోరాయి. కాగా దీనిపై రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జకరోవా స్పందిస్తూ, రసాయన ఆయుధ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశంగా తన విధులను పూర్తిగా నిర్వర్తించడంపై రష్యాతో సహకరించ డానికి బ్రిటన్ తిరస్కరిస్తోందని పేర్కొన్నారు. కాగా,బ్రిటీష్ ప్రధాని థెరిస్సా మే బుధవారమే ఈ వివాదానికి సంబంధించి మాస్కో త్వరలో ప్రతీకార చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రష్యాకు వ్యతిరేకంగా కొన్ని చర్యలు తీసుకున్నారు. వారం రోజుల్లో 23మంది రష్యా దౌత్యవేత్తలను బహిష్కరించడం, బ్రిటన్‌లో రష్యా ఆస్తులను స్తంభింపచేయడం వంటివి వున్నాయి.

అంతర్జాతీయ నేర న్యాయస్థానం నుండి తప్పుకుంటామన్న ఫిలిప్పైన్స్

మణిలా : అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) నుండి తాము తప్పుకుంటామని ఫిలిప్పైన్స్ ప్రకటించింది. అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్ట్ మాదకద్రవ్యాలపై తలపెట్టిన పోరుకు ఐసిసి ఒప్పందం అడ్డుగా నిలుస్తున్నందున తాము ఈ ఒప్పందం నుండి తప్పుకుంటామని, ఇప్పటికే అధికారికంగా నోటీసు ఇచ్చామని ఫిలిప్పైన్స్ ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న తమపై ఐసిసి ప్రాథమిక దర్యాప్తునకు ఆదేశించటాన్ని ఫిలిప్పైన్స్ తప్పుపట్టింది. డ్రగ్స్ వ్యాపారులపై తలపెట్టిన పోరు మానవత్వంపై దాడి అనటం తగదని తన ప్రకటనలో పేర్కొంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో అరెస్ట్ చేస్తున్న సమయంలో ఎదురు తిరిగిన దాదాపు నాలుగు వేల మందిని తాము హతమార్చినట్లు ఫిలిప్పైన్స్ పోలీసులు చెబుతుండగా, ఈ సంఖ్య వాస్తవానికి మరో మూడు రెట్లు అధికంగా వుంటుందని హక్కుల సంఘాలు చెబుతున్నాయి. ఫిలిప్పైన్స్ ప్రభుత్వం డ్రగ్‌వార్ పేరుతో హత్యలకు పాల్పడుతోందని విమర్శిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఐసిసి ఏర్పాటు ఒప్పందం నుండి తాము తప్పుకుంటామని ఫిలిప్పైన్స్ గురువారం ఐరాసకు రాసిన లేఖలో తెలియచేసింది. మాదకద్రవ్యాలపై తాము కొనసాగిస్తున్న పోరాటాన్ని రాజకీయం చేస్తూ మానవ హక్కులను దానికి వ్యతిరేకంగా ఉపయోగించుకుంటున్నందుకు నిరసనగా తాము ఈ ఒప్పందం నుండి ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ఫిలిప్పైన్స్ ప్రభుత్వం తన లేఖలో వివరించింది. వాస్తవానికి ఈ కోర్టు నుండి తప్పుకోవాలంటే ఒక ఏడాది నోటీసు ఇవ్వాల్సి వుంటుంది. కాగా ఫిలిప్పైన్స్‌లో కొనసాగుతున్న మారణ కాండపై దర్యాప్తు ఈ నిర్ణయం కారణంగా ఆగబోదని నిపుణులు చెబుతున్నారు.

జాతీయ భద్రతా సలహాదారుకు ట్రంప్ ఉద్వాసన

ఆర్థిక సలహాదారు నియామకం



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉద్వాసనల పర్వంలో మరో అధికారి చేరారు. ప్రస్తుతం జాతీయ భద్రతా సలహాదారుగా వున్న సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ హెచ్‌ఆర్ మెక్‌మాస్టర్‌ను పదవి నుండి తొలగించాలని అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించుకున్నట్లు వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తన తాజా సంచికలో ప్రచురించిన వార్తా కథనంలో వెల్లడించింది. మెక్‌మాస్టర్ ప్రభుత్వానికి ఇచ్చే వివర ణలన్నీ సుదీర్ఘంగా వుంటున్నాయని, ఆయన ఈ పదవికి అనర్హుడని అధ్యక్షుడు భావించినందు వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని ఈ పత్రిక తన కథనంలో పేర్కొంది. అయితే ఈ నిర్ణయం వెంటనే అమలు చేయకుండా కొద్దికాలం ఆగే అవకాశం వుందని తెలిపింది. ఆయనతో పాటు ఐరాసలో అమెరికా మాజీ రాయబారి జాన్ బోల్టన్, జాతీయ భద్రతా మండలి చీఫ్ ఆఫ్ స్టాఫ్ కీత్ కెల్లాగ్‌లను కూడా పదవుల నుండి తొలగించాలని ట్రంప్ భావిస్తున్నారని ఈ పత్రిక వివరిం చింది. అయితే ఈ కథనంపై అధ్యక్ష భవనం వైట్‌హౌస్ నుండి ఎటువంటి స్పంద నా వెలువడలేదు. గత మంగళ వారం నాడు విదేశాంగ మంత్రి రెక్స్‌టిల్లర్సన్‌ను పదవి నుండి తప్పించిన అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళన ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదన్న సంకేతాలు పంపిన విషయం తెలిసిందే.

కొత్త ఆర్థిక సలహాదారుగా లారీ కుడ్లో

అధ్యక్షుడి ఆర్థిక సలహాదారుగా ప్రముఖ టీవీ వ్యాఖ్యాత లారీ కుడ్లోను నియమించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ నిర్ధారించారు. ఇప్పటి వరకూ ఈ పదవిలో వ్యవహరించిన గారీ కోన్ గత వారం అధ్యక్షుడితో విభేదాలతో పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తొలుత మీడియాలో వచ్చిన ఈ వార్తను ట్రంప్ శుక్రవారం నాడు అధికారికంగా తన ట్విట్టర్ ఖాతాలో ధృవీకరించారు. లారీ కుడ్లో తనకు ప్రధాన ఆర్థిక సలహాదారుగానూ, జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తారని ట్రంప్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. కుడ్లో గతంలో రొనాల్డ్ రీగన్ (1981-85) హయాంలో పెట్టుబడుల బ్యాంకు బెర్న్ స్టెర్న్ప్ ప్రధాన ఆర్థిక వేత్తగా వ్యవహరించిన విషయాన్ని స్థానిక మీడియా తన వార్తాకథనాలలో గుర్తు చేసింది.

మొదటిపేజీ తరువాయి

మామిడి మార్కెట్‌కు గ్రహణం

పశ్చిమగోదావరి, రాష్ట్ర సరిహద్దుల్లోని తెలంగాణా జిల్లాలైన ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి వస్తాయి. ఈ ప్రాంతాల్లో మామిడి కాపు అంతంత మాత్రంగానే ఉన్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో వ్యాపారులు మార్కెట్ లావాదేవీలను నెల రోజుల పాటు వాయిదా వేసినట్లు తెలిసింది. ఏటేటా ఉగాదికి ముందే మార్కెట్లో 100 టన్నులు క్రయ, విక్రయాలు జరిగేవి. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో గానీ వ్యాపార లావాదేవీలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

మార్కెట్ నుంచి ఏటేటా తగ్గిపోతున్న లావాదేవీలు

గత కొన్నేళ్లుగా పరిశీలిస్తే నున్న మార్కెట్‌లో ఏటేటా మామిడి వ్యాపార లావాదేవీలు తగ్గుతున్నాయి. దీనికి ప్రధాన కారణం వర్షాభావం, బెట్ట, సాగర్ జలాలు అందని పరిస్థితులు. ఫలితంగా ఎక్కువ మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. వందలాది ఎకరాల్లో మామిడి తోటల్లోని ముదురు చెట్లను తొలగిస్తున్నారు. గతేడాది 25 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. 50 మంది వ్యాపారులు రూ.40 కోట్ల వ్యాపార లావాదేవీలు మాత్రమే నిర్వహించారు. ఈ ఏడాది ఆ మాత్రం వ్యాపారం కూడా జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఆరేళ్ల క్రితంతో పోల్చితే లావాదేవీలు మూడో వంతుకు తగ్గిపోయాయి. మార్కెట్‌లో 85 దుకాణాలున్నాయి. 2010 నుంచి 2012 మధ్య కాలంలో ఈ మార్కెట్ నుంచి ప్రతి ఏడాది సగటున రూ.125 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయి. ఈ ఏడాది 50 శాతం మాత్రమే పూత రావడంతో ఆ మేరకూ జరిగే అవకాశం లేదు.

రవాణా ఛార్జీలు పెరగడమూ కారణమే?

ఈ కాలంలో రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగాయి. మామిడి తోటల నుంచి కాయలను మార్కెట్‌కు చేర్చడానికి దూరాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ.5 వేల వరకు రైతులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో స్థానికంగా నూజివీడు, తిరువూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటైన స్థానిక మండీల వద్దే రైతులు కాయలను విక్రయిస్తున్నారు. దీనికి తోడు వాతావరణ మార్పులు, తెగుళ్లతో కాపు తగ్గడం వంటి కారణాలతో మార్కెట్‌కు వచ్చే కాయలు ప్రతి ఏటా తగ్గిపోతున్నాయి.

డబ్బు ఏమవుతోంది..?

బ్యాంకులకు ఎంత నగదు వచ్చింది.. ఎంత డ్రా అయింది. ఎక్కడ, ఎవరి ఖాతాల్లో డ్రా అయింది. ఎప్పటి నుండి ఎప్పటిలోగా ఎంత డ్రా చేశారు.. తదితర విషయాలన్నీ విచారించే అవకాశమున్నట్లు తెలిసింది. ఎన్నిసార్లు డబ్బు పంపించారు. అది ఏ బ్యాంకులకు చేరింది అనే విషయాలపైనా సమగ్ర నివేదిక తయారు చేయనున్నారు. రాష్ట్రానికి పంపించిన డబ్బు తమిళనాడుకు వెళ్లిపోయిందనే అనుమానాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ఆర్‌బిఐ పంపించిన మొత్తానికి ఇక్కడ జరుగుతున్న లావాదేవీలకు పెద్దగా తేడా లేదని, అయినా ఇప్పుడు సమస్య ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదని జైట్లీ కూడా వ్యాఖ్యానించినట్లు సమాచారం. బిజెపి పాలిత రాష్ట్రాలకు కూడా అంత డబ్బు పంపించలేదని అన్నట్లు తెలిసింది. చంద్రబాబు చైర్మన్‌గా ఉండటం వల్ల తొలిలో కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ డబ్బు వెళ్లిందని, అయినా తాము అభ్యంతరం చెప్పలేదని, వెళ్లిన డబ్బంతా కొద్దిమంది చేతుల్లోకి చేరిందని తమకూ అనుమానంగా ఉందని, విచారణలో ఇవన్నీ వెలుగులోకి వస్తాయని బిజెపి నాయకులు చెబుతున్నారు.

రేపు అర్ధరాత్రి నుంచి ఊబర్, ఓలా డ్రైవర్ల సమ్మె

చేరుకుందని ఆయన చెప్పారు. వారు రూ.5 నుంచి రూ. 7 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి, నెలకు రూ.1.5 లక్షలు వస్తాయని ఆశించారని, ఇందులో సగం కూడా వారికి రావడం లేదని సంజయ్ నాయక్ తెలిపారు. నిర్వహణ లోపమే దీనికి కారణమని ఆయన చెప్పారు. తొలుత కంపెనీకి చెందిన కార్లకు ప్రాధాన్యతనిచ్చి, తరువాత డ్రైవర్ల కార్లకు ప్రాధాన్యతనిస్తున్నారని దీంతో వారి వ్యాపారంలో మాంద్యం ఏర్పడిందన్నారు. ఊబర్, ఓలా కాబ్‌లకు చెందిన ఇతర సంఘాలు కూడా తమ సమ్మెకు మద్దతిస్తున్నాయని నాయక్ పేర్కొన్నారు

'బాబు ప్రజా విశ్వాసం కోల్పోయారు'

మేల్కొన్నారన్నారు. ప్రసుత్తం ఉన్న పరిస్థితులు ఎదుర్కోవడం తప్ప మరోమార్గం లేదని పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిందని, విమర్శిస్తే సరిచేసుకోవాల్సింది పోయి ఎదురుదాడికి దిగడం దేనికినిదర్శమని ప్రశ్నించారు. హోదా విషయంలో నాలుగేళ్లుగా నాన్చి ప్రజలను మోసం చేశారన్నారు.

అతిసార బాధితులకు పరామర్శలు

(మొదటి పేజీ తరువాయి)

స్పందించి పరిస్థితిని చక్కదిద్దకపోతే బంద్‌కు పిలుపునిస్తానని, అవసరమైతే గుంటూరులోనే ఉండి సమస్య పరిష్కారమయ్యేదాకా పోరాటం చేస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మరొకరు మృతి

గురువారం మధ్యాహ్నం వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిలో చేరిన పల్లపు రత్తయ్య (34) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య 16కు చేరింది. అయితే రత్తయ్య గుండెపోటుతో చనిపోయాడని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో ఆగ్రహానికి గురైన మృతుని కుటుంబ సభ్యులు కార్పొరేషన్ ఎదుట ధర్నాకు పూనుకున్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రితో పాటు పలు ప్రయివేటు ఆస్పత్రులకూ అతిసార వ్యాధి గ్రస్తులు పెద్ద సంఖ్యలో వస్తూనే ఉన్నారు. పోస్టుమార్టం చేసి నిర్ధారిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన ముగిసింది. ఈ క్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసరావుకూ, ఎమ్మెల్యే ముస్తాఫాకూ మధ్య కొద్దిసేపు వాగ్వాదం తలెత్తింది.

మరణ మృదంగం మోగుతుంటే ఆనందలహరా ?

బిజెపి ఎమ్మెల్యే పి.మాణిక్యాలరావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పివి మాధవ్ తదితరులు ప్రభుత్వ ఆస్పత్రిలో



గుంటూరులోని అనందపేటలో అతిసార బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న జనసేత అధినేత పవన్‌కల్యాణ్

బాధితులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలను కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉదాశీనతతోపాటు గుంటూరు నగరపాలక సంస్థ అధికారుల వైఫల్యమే అతిసారకు కారణమని చెప్పారు.. నగరంలో ఆదివారం ఆనందలహరి పేరుతో సంబరాలు మాత్రం బాగానే చేస్తున్నారని, ఆనంద్‌పేటలో మాత్రం మరణమృదంగం మోగుతోందని దుయ్యబట్టారు.

మృతుల నిర్ధారణకు ముగ్గురు అధికారులతో ఓ కమిటీ : :మంత్రులు

గుంటూరు అతిసార బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పి.నారాయణ, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ట్యాంకులో నిల్వ ఉన్న నీరు కలుషితం కావడంతో ఆరు ప్రాంతాల్లోని ప్రజలు డయేరియా బారిన పడినట్లు గుర్తించడం జరిగిందన్నారు. నీరు కలుషితం కావడానికి కారకులైన 8మంది శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందిని సస్పెండ్ చేయడం జరిగిందని, వీరిపై క్రిమినల్ కేసులు పెట్టినట్లు తెలిపారు. మృతుల నిర్ధారణకు ముగ్గురు అధికారులతో ఓ కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు చంద్రన్న భీమాతో బాటు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో అందించడం జరిగిందని మంత్రులు తెలిపారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గుంటూరు సంఘటనపై చేసిన విమర్శలను స్వాగతిస్తున్నామన్నారు. గుంటూరులో అన్ని అంశాలను 48 గంటల్లో పరిష్కరించి ఆరోగ్య గుంటూరుగా మారుస్తామని మంత్రులు తెలిపారు.

సొంతంగానే అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

సంకేతాలు ఇస్తున్న చంద్రబాబు అవిశ్వాస తీర్మానానికి ముందే ఎన్‌డిఎ కూటమి నుండి బయటకు రావాలని నిర్ణయించారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్న తరువాత బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాకు దానిని తెలియచేశారు. కూటమి నుండి బయటకు రావడానికి పూర్తి కారణాలను వివరిస్తూ ఒక లేఖ రాశారు. ఆ వెంటనే టిడిపి ఎంపీలు లోక్‌సభ స్పీకర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానానిని నోటీస్ ఇచ్చారు. తాము ఇప్పుడు ఎన్‌డిఎ కూటమిలో లేమని, అందువల్లే అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తున్నామని వారు చెప్పారు. ఎన్‌డిఎ కూటమి నుండి బయటకు రావాలన్న తమ నిర్ణయాన్ని పలు పార్టీలు స్వాగతిస్తున్నాయని వారు అన్నారు. అయితే, టిడిపి నిర్ణయాన్ని వైసిపి తప్పు పట్టింది. గురువారం సాయంత్రం మద్దతిస్తామని చెప్పి శుక్రవారం ఉదయానికల్లా నిర్ణయాన్ని ఎలా మార్చుకుంటారని వైసిపి నాయకులు ఆళ్ల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.

ఎన్జీరంగా అధ్యాపకులకు ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పలువురు అధ్యాపకులు ఉగాది పురస్కారాలు అందుకోనున్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాం నుంచి పి ప్రభు ప్రసాదిని, మహానంది వ్యవసాయ కళాశాల నుంచి కె బాలగురవయ్య, తిరుపతి వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల నుంచి కె జాన్, లాం వ్యవసాయ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి రఘుబాబు, రాజమ హేంద్రవరం వ్యవసాయ కళాశాల నుంచి సిహెచ్ శ్రీనివాస్, నంద్యాల ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధనా స్థానం నుంచి డా విజయ లక్ష్మి, బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి పి రామకృష్ణ ప్రసాద్, గరికపాడు క్రిషి విజ్ఞాన కేంద్రం నుంచి ఎం రాజశ్రీ ఎంపికయ్యారని విశ్వ విద్యాలయం పౌర సంబంధాల అధికారి జి వీరేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్య కార్యకర్తల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (మచిలీపట్నం)

మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగావ కాశం కల్పించాలని డిమాండ్‌చేస్తూ ఆరోగ్య కార్యకర్తలు కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు శుక్రవారానికి రెండోరోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా సిఐటియు పట్టణ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడారు. మెరిట్ ఆధారంగా ఉద్యోగాలివ్వ కుండా అనర్హులకు ఉద్యోగాలు కేటాయించిన వైద్య, ఆరోగ్య శాఖాధికారులపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సిఐటియు పట్టణ సహాయ కార్యదర్శి సిహెచ్.జయరావు సంఘీభావం తెలిపారు.

కమ్యూనిస్టులతో కలిసి 'హోదా' ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద మనుషులు ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రానికి హోదా రాలేదనీ, వారికి మాత్రం పదవుల హోదాలు దక్కాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 25 మంది ఎంపీలపై కేంద్రం బ్లాక్‌మెయిల్ విధానాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఎంపీలను భయపెట్టవచ్చునేమోగానీ, ఆంధ్రుల్ని కాదని వ్యాఖ్యానించారు. వామపక్ష నేతలతోపాటు తనతోపాటు జనసేన సైనికులు సైతం కేంద్రం అనుసరిస్తున్న బ్లాక్‌మెయిల్ విధానాలకు బెదరబోమని నొక్కి చెప్పారు. వామపక్ష, సోషలిస్టు భావజాలాలను తాను గౌరవిస్తానని చెప్పారు. తన తండ్రి మొదటి నుంచీ కమ్యూనిస్టు పార్టీల సభ్యు లేనని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో అవినీతి, దోపిడీ అరికట్టేందుకు వామపక్ష భావజాల ఉద్యమమే ముందుం టుందని కొనియాడారు. వారి ఉద్యమాలు అందరికీ స్ఫూర్తిదా యకమని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజనహామీల సాధన కోసం మొదటి నుంచీ ఉద్యమిస్తున్న కమ్యూనిస్టులను, ప్రత్యేక హోదా సాధన సమితి నేతలను ఆయన అభినందించారు.

టిడిపి, బిజెపికి కనువిప్పు కలిగేలా ఆందోళనలు : మధు

ఎన్నికల హామీలు, విభజన చట్టాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజల్ని టిడిపి, బిజెపి మోసగించాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా భవిష్యత్తులో ఆందోళనలు నిర్వహిస్తామ న్నారు. ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో టిడిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర ప్రజల కోసం కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమానికి పవన్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం ఉభయ కమ్యూనిస్టులు, జనసేన కలిసి పోరాడతామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుతామని స్పష్టం చేశారు.

బిజెపి నేతలు పదవులకు రాజీనామా చేయాలి : రామకృష్ణ

రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు వారి పదవులకు రాజీనామా చేసి, తిరిగి ఒంటరిగా పోటీ చేసి గెలవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సవాల్ విసిరారు. ప్రత్యేక హోదా, విభజన హక్కుల హామీల అమలు సాధన కోసం ఉభయ కమ్యూనిస్టులు, హోదా సాధన సమితి ఆధ్వర్యాన ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఫలితంగానే వైసిపి, టిడిపిల్లో కదలిక వచ్చిందన్నారు. టిడిపికి చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసి ఉద్యమించాలన్నారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన నిర్వహించ నున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి పవన్ కల్యాణ్ వస్తారని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఐ మాజీ ఎమ్మెల్సీలు పిజె చంద్రశేఖర్‌రావు, జల్లివిల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ముందే తెలుసు..

(మొదటి పేజీ తరువాయి)

అటువంటి నగరం రాష్ట్రంలో ఒక్కటి కూడా లేదన్నారు. దుగరాజపట్నం పోర్ట్ విషయంలో చిక్కులున్నాయని, ప్రత్యామ్నాయం చూపిస్తే మంజూరు చేస్తామని కేంద్రం చెబుతోందని, అయితే ఒక సంవత్సరంలో పూర్తి చేస్తారనే నమ్మకం లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకూడదని14వ ఫైనాన్స్ కమిషన్ పేర్కొందని, అందుకే ఇవ్వడం సాధ్యం కాదని కేంద్రం చెబుతోందని, దీంట్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వొచ్చని ఆ కమిషన్ చైర్మనే చెప్పారన్నారు. పదవుల కోసం కాదని, ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. తాను మాట్లాడబట్టే పోలవరం ముంపు మండలాలను రాష్ట్రంలో కలిపారన్నారు. నోట్ల రద్దు గురించి అందరి కంటే తానే ముందు మాట్లాడినట్టు చెప్పారు. ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చిన అనంతరమే కేంద్రం ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధపడ్డామని, దీనికి అన్ని పార్టీల మద్దతు అడుగుతున్నామని చెప్పారు.

జగన్, పవన్‌లపై విమర్శలు

సుమారు 16 కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారిని కేంద్ర ప్రభుత్వం ఎలా దగ్గరకు తీసుకుంటుందని ధ్వజమెత్తారు. జగన్‌తో సహా వైసిపి నేతలు కేంద్ర పెద్దలతో కలవడమే దీనికి నిదర్శనమన్నారు. తానైతే కేంద్రం మాట వినని, జగన్ పై కేసులున్నాయి కాబట్టి, కేంద్రం చెప్పినట్టు వింటాడని, చెప్పు చేతుల్లో ఉంటాడనే కేంద్రం జగన్‌కు మద్దతు పలుకుతోందని విమర్శించారు. జగన్ కేసుల నుంచి తప్పించుకోవడానికే ఎవరికీ నమస్కారం పెట్టని జగన్, రాష్ట్రపతి కాళ్ళకు పాదాభి వందనం చేశారన్నారు.

ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్నారని, వాస్తవాలు తెలియకుండా మాట్లాడటం సరికాదని సిఎం తీవ్ర విమర్శలు చేశారు. నాలుగు సంవత్సరాలు మంచిగా కనిపించిన తాను ఇప్పుడు చెడ్డ వ్యక్తిగా ఎలా అయ్యానంటూ పవన్‌పై మండిపడ్డారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అదొక వేస్ట్ కమిటీగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న తనకు మద్దతు తెలపకుండా కేంద్రానికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. తనను ఇరుకున పెట్టడానికే వీరు ఈ కుట్రలు చేస్తున్నాం ́న్నారు. తనను విమర్శిస్తే ప్రతిపక్ష నేత జగన్‌కు, పవన్ కళ్యాణ్‌కు ఏమొస్తుందని ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శాసన మండలిలో తీర్మానాన్ని సిఎం చదివి వినిపించారు. విభజన చట్టం, హామీల అమలులో కేంద్ర వైఖరిపై తీర్మానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాసన మండలిలో ప్రవేశపెట్టారు.

'చిరుతేజ్ సింగ్' జీవిత గాథ

అద్భుత మేధాశక్తితో ప్రపంచ రికార్డును నెలకొల్పిన గిరిజన బాలిక చిరుతేజ్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించబడిన బాలల చిత్రం 'చిరుతేజ్ సింగ్'. ఫ్యాషన్ డిజైనర్ ఫేమ్ మనాలి రాథోడ్, 'కాటమరాయుడు' ఫేమ్ సౌమ్యవేణుగోపాల్ ప్రధానపాత్ర పోషించారు. కేవలం 3 నిమిషాల వ్యవధిలో 236 ప్రపంచ పటాలను గుర్తించి, బాల మేధావిగా ఎన్నో పతకాలను, ప్రశంసలను సొంతం చేసుకొని తెలుగు జాతి, భారతదేశ ప్రతిష్టను పెంచిన చిరుతేజ్ సింగ్ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. 'తల్లి, కూతురి మధ్య ప్రేమ, ఉపాధ్యాయుడు విద్యార్థి మధ్య వున్న ఆసక్తికరమైన మనసుకు హత్తుకునే సన్నివేశాలతో ఎంతోమంది చిన్నారులకు ప్రేరణ కలిగించేలా రూపొందించబడిందని' పలువురు ప్రశంసించారు. ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా అనాథ పిల్లకోసం అన్నపూర్ణ స్టూడియో ప్రివ్యూ థియేటర్‌లో శుక్రవారంనాడు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సమంత అక్కినేని తన అభినందనలు తెలియచేశారు. దర్శకుడు వీరశంకర్, నిర్మాత శ్రీ రాజ్ కందుకూరి, మధుర శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. నిర్మాత ఎన్ఎస్. నాయక్ సహాయసహకారాలతో అవార్డ్ విన్నింగ్ లఘు చిత్రాల దర్శకులు డా. ఆనంద్ కుమార్ దర్శకత్వంలో రూపొందింది.



సౌమ్య, చిరుతేజ్‌సింగ్, డా. ఆనంద్, నాయక్, సౌమ్య



'హ్యాపీడేస్' కంటే తక్కువే

'హ్యాపీడేస్'లో ఓ కాలేజీ కుర్రాడిగా అల్లరిచేసి ఎంటర్‌టైన్ చేసిన నిఖిల్ తాజా చిత్రం 'కిరాక్ పార్టీ'. ఇందులో తనే లీడ్‌రోల్ చేశాడు. కన్నడ సినిమా 'కిరిక్ పార్టీ'కి రీమేక్‌గా రూపొందింది. ఈ చిత్రం శుక్రవారమే తెలుగులో విడుదలైంది. నూతన దర్శకుడు శరన్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం.

నటీనటులు: నిఖిల్, సిమ్రన్ పరీన్జ, సంయుక్త హెగ్డే, కార్తీక్ తదితరులు

సాంకేతికత: **సంగీతం :** అంజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫర్ : అద్వైత గురుమూర్తి, ఎడిటర్ : ఎం.ఆర్.వర్మ, స్క్రీన్ ప్లే : సుధీర్ వర్మదర్శకత్వం : శరన్ కొప్పిశెట్టి, నిర్మాత : సుంకర రామబ్రహ్మం.

కథ : ఇంజనీరింగ్ విద్యార్థి కృష్ణ (నిఖిల్) మొదటి సంవత్సరంలోనే నాల్గవ సంవత్సరం చదువుతున్న మీర (సిమ్రన్ పరీన్జ)ను ప్రేమిస్తాడు. కృష్ణ చేసిన మంచి పనులే ఆమెను ప్రేమించేలా చేస్తాయి. అయితే అనుకోని ప్రమాదంతో మీర మృతి చెందుతుంది. ఆ షాక్‌తో ఎప్పుడూ సరదాగా ఉండే కృష్ణ కఠినంగా మారిపోతాడు. ఆ మార్పుతోనే నాలుగేళ్ళకు కాలేజీ ఎలక్షన్లలో ప్రెసిడెంట్ స్థాయికి ఎదుగుతాడు. ఆ ఏడాది జూనియర్ అయిన సత్య (సంయుక్త హెగ్డే) కృష్ణను ప్రేమిస్తుంది. కానీ కృష్ణ మీర జ్ఞాపకాల్లోనే ఉండిపోతాడు. అతని గతం గురించి తెలుసుకున్న సత్య అతన్ని ఎలా మార్చింది? అనేది కథ.

ప్లస్ పాయింట్స్: హీరో నిఖిల్... కృష్ణ పాత్రలో ఒదిగిపోయాడు. మొదటి సంవత్సరం చదివే కుర్రాడిగా సరదాగా, చలాకీగా కనిపిస్తూనే సీనియర్‌గా సీరియస్‌నెస్‌తోనూ మెప్పించాడు. అతని స్నేహితులుగా నటించిన ఐదుగురూ పర్వాలేదనిపించేలా చేశారు. మీర పాత్ర ఓకే. సత్య పాత్ర చాలా చలాకీగా వుంటుంది. కన్నడలో చేసిన సంయుక్త హెగ్డేనే ఆ పాత్రను పోషించింది. సినిమా మొదటి భాగమంతా స్నేహితుల మధ్య, కాలేజీలో జరిగే సరదా సన్నివేశాలతో, చిన్నపాటి లవ్ ట్రాక్‌తో నడుస్తూ సాగుతుంది.

సంగీత దర్శకుడు అంజనీష్ లోకనాథ్ అందించిన పాటల సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ రెండూ ఇంప్రెస్ చేశాయి. 'ధమ్ దరే ధమ్.... ఒన్ బై ఫోర్.. అంటూ..' స్నేహితుల మధ్యన నడిచే పాట, హీరో హీరోయిన్ల నడుమ సాగే రొమాంటిక్ సాంగ్ ఆకట్టుకున్నాయి. ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ సన్నివేశాలు ఎమోషనల్‌గా ఆకట్టుకున్నాయి.

'తొలిసారి జారింది గుండె ఇక్కడే. నేస్తమయింది ఇక్కడే. గొడవల్లో గెలిచి.. ఓడిందీ ఇక్కడే.. అందంగా జీవితాన్ని పాఠంగా నేర్పింది ఇక్కడేగా.... కలిసింది.. ఇక్కడే.. విడిపోతుంది.. ఇక్కడేగా.. నేస్తమా..' అంటూ ముగింపు సన్నివేశం, సంభాషణలు హృదయాన్ని టచ్ చేస్తాయి. ఇది మినహా చిత్రమంతా రొటీనే.

మైనస్ పాయింట్స్ : ఈ సినిమాను చూస్తున్నంతసేపూ 'హ్యాపీడేస్' గుర్తుకురావడం లోపమే. అందులో వున్న కుర్రాళ్ళకు ఒక్కో లవ్ ట్రాక్ వుంటూ.. జీవితంలో ఎలా ఎదగాలనేది ముగింపులో కాలేజీ ప్రిన్సిపాల్ బోధిస్తాడు. అందుకే ఆ చిత్రం ఎక్కడా బోర్ అనిపించదు. కానీ ఈ సినిమా కాస్త విరుద్ధంగా వుంటుంది. కొన్నిచోట్ల బోర్ కొట్టించే సన్నివేశాలూ వున్నాయి. దాన్ని ఆ తర్వాత సెంటిమెంట్‌తో కట్టడి చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు. మీర చనిపోవడం యాదృశ్చికమైనా.. దాని వెనుక ఏదో వుందనే భ్రమింపజేయడం.. మీర తల్లిదండ్రుల దగ్గరకు కృష్ణను సత్య తీసుకెళ్ళేలా చేయడమనే సన్నివేశాలు పొంతనలేకుండా వుంటాయి. అక్కడక్కడా బిట్‌బిట్‌లుగా అనిపిస్తాయి. కాలేజ్ ఎన్నికలు, గొడవలు చూపించినా అవేమీ కొత్తగా అనిపించవు. దాంతో కథానాయకుడి పాత్ర యొక్క గమ్యం, వ్యక్తిత్వం ఏమిటనేది క్లారిటీగా తెరపై కనబడదు.

సాంకేతిక విభాగం : కథనాన్ని అందించిన సుధీర్ వర్మ మొదటి అర్ధభాగాన్ని బాగానే రాసినా ద్వితీయార్ధాన్ని మాత్రం పేలవంగా రాయడంతో దర్శకుడు శరన్ కొప్పిశెట్టి పూర్తి స్థాయిలో ఇంప్రెస్ చేయలేకపోయారు. దీంతో సినిమా రెండవ సగం ఫన్, ఎమోషన్ ఏదీ పూర్తిస్థాయిలో పండలేదు. చందూ మొండేటి రాసిన డైలాగ్స్ పర్వాలేదనిపించాయి. నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ ఎప్పటిలాగే నిర్మాణ విలువల్ని పాటించి తమ స్థాయిని చాటుకుంది. ఎం.ఆర్.వర్మ ఎడిటింగ్ ద్వారా సెకండాఫ్లోని కొన్ని అనవసరమైన సన్నివేశాలని తొలగించాల్సింది. అద్వైత గురుమూర్తి సినిమాటోగ్రఫీ ఫ్రెష్ ఫీల్‌ను అందించగా అంజనీష్ లోకనాథ్ సంగీతం మెప్పించింది.

విశ్లేషణ: 'హ్యాపీడేస్' సినిమా వచ్చాక దాన్ని బేస్‌చేసుకుని కన్నడలో కొన్ని సినిమాలు వచ్చాయి. ఆ కోవలోనిదే కిరిక్‌పార్టీ. ఇది అక్కడ బాగానే ఆడింది. నిర్మాత మాటల్లోనే చెప్పాలంటే... హ్యాపీడేస్ + శివ.. సినిమాలు కలిపితేనే కిరాక్ పార్టీ. అంటే ఆ రెండు కూడా తెలుగు చిత్రాలే. వాటిని అటూఇటూ మార్చి తీసిన కన్నడ సినిమాను పోటీపడి రైట్స్ దక్కించుకుని రీమేక్ చేయడం సాహసమనే చెప్పాలి. అందుకే ఆ రెండు చిత్రాలకంటే ఇది తక్కువనే చెప్పాలి.



పంచ్‌కు రెడీ అయిన 'సవ్యసాచి'

నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'సవ్యసాచి'. చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. 'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య, చందు మొండేటి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ మాట్లాడుతూ.. "తన రెండు చేతులను సమర్థవంతంగా వినియోగించగల అర్జునుడిని 'సవ్యసాచి' అంటారు. టైటిల్‌కి తగ్గట్లుగానే సినిమా, నాగచైతన్య పాత్ర ఉండబోతోంది. నాగచైతన్య మాస్ అప్పీల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నాగచైతన్య సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తుండడం విశేషం. ఇండియా షూటింగ్ పూర్తయ్యాక అమెరికా వెళ్లనున్నాం. షూటింగ్ పూర్తి చేసి జూన్ 14న చిత్రాన్ని విడుదల చేయనున్నాం. కీరవాణి 'బాహుబలి' తర్వాత సంగీతం అందించడంతోపాటు నేపథ్య సంగీతం కూడా సమకూరుస్తున్న చిత్రమిదని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, సినిమాటోగ్రఫీ: యువరాజ్, కళ: రామకష్ణ.



సిద్ధమైన 'ఆచారి అమెరికా యాత్ర'

విష్ణు మంచు హీరోగా నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన రాగా, ఎస్.తమన్ స్వరపరిచిన పాటలు సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. ఈ చిత్రాన్ని జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వం వహించారు. విష్ణు, జి.నాగేశ్వర్ రెడ్డిల కలయికలో 'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడో రకం' చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. 'ఆచారి అమెరికా యాత్ర' కూడా అదే తరహా వినోద భరిత చిత్రం కావడంతో విష్ణు, నాగేశ్వర్ రెడ్డిలు హాట్రిక్ హిట్ సాధిస్తారని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మానందం, విష్ణు కాంబినేషన్ ఈ చిత్రానికి మరో హైలైట్‌గా నిలవనుంది. విష్ణు సరసన ప్రజ్ఞ జైస్వాల్ జంటగా నటించిన ఈ చిత్రం కీర్తి చౌదరి, కిట్టు 'పద్మజ పిక్చర్స్' బ్యానర్ పై నిర్మించగా యమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పిస్తున్నారు.

టెక్నాలజీ ప్రతీకారం 'ఐతే 2.0'



చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వంలో 2003లో వచ్చిన 'ఐతే' సినిమా అప్పటి యువత ఆలోచనలకు ప్రతిబింబంగా నిలిచింది. విమానం హైజాక్, హోంమంత్రి కిడ్నాప్ వంటి అంశాలతో నలుగురు మేథావులైన యువకులు డబ్బుకోసం ఏం చేశారనేది పాయింట్ తీసుకున్నారు. ఇప్పుడు 'ఐతే 2.0' అని పెట్టి రాజ్‌ముదిరాజ్ అనే దర్శకుడు తీసిన సినిమా 2018లో మారిన కంప్యూటర్ సాంకేతికతతో ప్రపంచంలో ఎక్కడనుంచైనా ఎవరి పర్సనల్ విషయాలైనా హ్యాక్ చేయవచ్చనే పాయింట్‌ను ఎంచుకున్నారు. అంతా కొత్తవారితో హిందీ, తెలుగులో తీసిన ఈ చిత్రం ఈ శుక్రవారమే విడుదలైంది. అదెలా వుందో చూద్దాం.

కథ: ఉపేన్, అర్జున్, కరణ్, ఇజాజ్, రేఖా, ఈషా అనే ఆరుగురు ఇంజనీరింగ్ పూర్తయిన యువతీ యువకుల కథ ఇది. తమకు తగిన ఉద్యోగాలే కావాలని ఇంటర్వ్యూలకు హాజరవుతూ వుంటారు. ఇలా తిరుగుతూనే తమ ఆలోచనలకు, తమ కలలకు రూపం ఇస్తూ ఉంటారు. కొత్త కొత్త ఆలోచనలు, వాటి ప్రోగ్రామింగ్, కోడింగ్, ఏదో తమ ప్రాక్టీసు కోసం సరదాగా రాసుకోవడం పెద్ద పెద్ద కంపెనీల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఘోస్ట్ కోడింగ్ అసైన్మెంట్స్ రాయడం, దానితో కాలం ఎల్లదీయడం జరుగుతుంది. ఈ క్రమంలో వరల్డ్ వైడ్ బ్యాంకింగ్ ఇండస్ట్రీ మీద వచ్చిన ఒక ఐడియాను ఓ కంపెనీ ఎం.డి.కి చెప్పి జాబ్ ఆఫర్లు సంపాదిస్తారు. కానీ అందులో ఒకరు.. తాము చేసిన ప్రాజెక్ట్‌ను అమ్మేసి మిలియన్ డాలర్లు సంపాదించాలనుకుంటాడు. మిగిలినవారూ అందుకు అంగీకరిస్తారు. అనంతరం అగ్రిమెంట్ కూడా కంపెనీ ఎం.డి. గంగూలీ రాయించుకుంటాడు. అయితే ప్రాజెక్ట్ డెలివరీ ముందు రోజు వారంతా ఆనందంలో వుండగా వారు చేసిన ప్రాజెక్ట్ కంప్యూటర్ కాలిపోతుంది. ఆ తర్వాత రోజే తాము తయారు చేసిన 'యురేకా' ప్రాజెక్ట్‌ను తనదిగా గంగూలీ ప్రకటించుకుంటాడు. ఇది తెలిసిన ఈ ఆరుగురు గంగూలీపై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటారు. అది కూడా టెక్నికల్‌గానే వుండాలి. అందుకు అర్జున్ అనే ఇంజనీర్ సాయంతో తమకు దక్కాల్సిన బిలియన్ డాలర్ల డబ్బును ఏవిధంగా గంగూలీ అకౌంట్‌నుంచి హ్యాక్ చేసి తీసుకున్నాడు? ఆ తర్వాత ఏం జరిగింది? అనేది మిగిలిన సినిమా.

విశ్లేషణ: ఇందులో కుర్రాళ్ళంతా అమీర్ పేట్, ఇరానీ చాయ్ కేఫ్‌లోనో చూసిన వారిగా కన్పిస్తారు. వారు మాట్లాడే మాటలు, చేష్టలు బ్యాచిలర్ రూమ్ కుర్రాళ్ళలాగే అనిపిస్తారు. వారిలో ఒక్కోరిది ఒక్కో వీక్‌నెస్‌కూడా ఇందులో దర్శకుడు చెబుతాడు. ఆ రీతిగానే మారుతున్న టెక్నాలజీతో రాబోయే రోజుల్లో యుద్ధాలు ఎలా జరగవచ్చో చెప్తుందీ సిన్మా. మనం ఉన్న ప్రదేశం నుండే మన శత్రువు సిస్టంలోకి చొచ్చుకుపోయి మనకు కావాల్సిన డేటాని దొంగిలించడం, ఆ తర్వాత సిస్టంని పనికి రాకుండా క్రాష్ చేయడం లాంటి భయంకర కొత్త సైబర్ నేరాల గురించి చెప్తుంది. ఇక మూడో ప్రపంచ యుద్ధం గనక వస్తే అది ఇదేనేమోననిపిస్తుంది. ఒక ఐడియాని ఆలోచనా స్థాయి నుండి ప్రాజెక్ట్ డెవలప్మెంట్ స్టేజ్ వరకు టెక్నికల్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా చెప్పడం కొత్తగా వుంది. టీం లీడర్ అనే వాడు ఎలా వుండాలి. ఎలా మోటివేట్ చేయాలి. వర్క్ ఎట్లా షేర్ చేయాలి. ఎవరి బలం ఎంత, ఎవరికి ఎటువంటి వర్క్ కేటాయించాలి వంటి పలు విషయాలను అర్థమయ్యేట్లుగా చూపించాడు.మొదటిభాగంలో ఆరుగురు మోసపోవడంతో కథ సాగుతుంది. రెండో భాగంలో గంగూలీని మోసం చేయబోయి వీరుకూడా ఎలా మోసపోయారనేది ఆసక్తికరంగా వుంటుంది. అంతా టెక్నాలజీతో నడిచే గేమ్ ఇంట్రెస్ట్ కల్గిస్తుంది. శత్రువుపై పగ, ప్రతీకారం అంటే అరుపులు, కేకలు అనేవి లేకుండా సైలెంట్‌గా ఒక్క ఫోన్‌తోనే ఎలా బెంబేలు చేయించవచ్చో తెలియజేస్తుందీ సినిమా. ఇందుకు సైబర్ క్రైమ్ పోలీసు విభాగం కూడా తోడయి ఇలాంటి నేరగాళ్ళను ఎలా పట్టుకోవచ్చో చెబుతుంది. ఇలా మొదటిసారిగా తెలుగులో ఇటువంటి కథ రావడం విశేషం. కథాగమనంలో కొన్ని మైనస్‌లున్నా ప్రతీకారమనే టెంపోలో అవన్నీ మర్చిపోయేలా చేస్తుంది.

వ్యవస్థ లోపాల్ని ఎండగట్టిన 'కర్తవ్యం'

నయనతార ప్రధాన పాత్ర పోషించిన తమిళ చిత్రం 'ఆరమ్'. ఆ చిత్రాన్ని తెలుగులో శరత్ మరార్ 'కర్తవ్యం'గా ఈ శుక్రవారమే విడుదల చేశారు. దీనికి సినిమాటోగ్రాఫర్ : ఓం ప్రకాష్, ఎడిటర్ : రూబెన్ సంగీతం : జిబ్రన్, నిర్మాత : శరత్ మరార్, రవీంద్రన్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : గోపి నైనర్.

కథ : కలెక్టర్ మధు వర్షిణి (నయనతార) తన అధికారంతో ప్రజలకు సేవ చేయాలనే తత్వం వున్న మనిషి. మంచినీటి కోసం అల్లాడుతున్న గ్రామానికి తన అధికారంతో నీళ్ళు రప్పించేలా చేస్తుంది. అలాంటి గ్రామంలో కూలీ చేసుకునే సుమతి కుమార్తె ధన్సిక ఆడుకుంటూ ఓ బోరు బావిలో పడిపోతుంది. ఇది తెలిసిన వెంటనే తన అధికారంతో మిగిలిన యంత్రాంగాన్ని సన్నదం చేస్తుంది. అయితే ఆ బోర్‌బావి స్థలం స్థానిక సర్పంచ్‌ది. ఎన్నిసార్లు చెప్పినా దాన్ని మూయకుండా వుండడంతో ప్రజలంతా ఆయన్ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తారు. అందుకు సిద్ధమైన ఆమెకు మంత్రి, ఎం.ఎల్.ఎ.నుంచి బెదిరింపులు వస్తాయి. అయినా అధికారిగా తన పనులు తాను చేసి పాపను కాపాడుతుంది. అది ఏరకంగా అనేది చిత్రంలో చూడాల్సిందే.

విశ్లేషణ: సమాజంలో జరిగిన ఓ సంఘటనపై పలు డాక్యుమెంటరీలు వస్తుంటాయి. కానీ దేశంలో వున్న బోర్‌బావి వంటి సమస్యను వెండితెరపై ఆవిష్కరించేట్లుగా చేయాలనే ఆలోచన కల్గిన దర్శకుడు గోపి నైనర్‌ను అభినందించాలి. మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజల వెతలు, వారిపై ప్రభుత్వం చూపే నిర్లక్ష్యధోరణి ఎలా వుంటుందనేది కళ్ళకు కట్టినట్లు చూపించాడు. ఐఎఎస్, ఎపిఎస్‌లు ఎవరైనా శిక్షణకాలంలో ప్రజలకు సేవచేయాలనేది వారి అభిమతం. అలాంటి వారిని సరైనవిధంగా సేవ చేయకుండా అడ్డుకోవడమనేది మన వ్యవస్థలో వేళ్లూనుకుపోయింది. నిజాయితీగా పనిచేస్తే విచారణ పేరుతో శిక్షించడం కూడా ఎలా వుంటుందో ఇందులో చూపించాడు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యం, అధికారులు, ప్రజలు వంటి అంశాలపై లోతుగా చర్చించడం బాగుంది. ఇందుకు టీవీ ఛానల్‌లో ఇద్దరు ప్రముఖులతో చర్చ పెట్టడం సరైందే అయినా నిడివి తగ్గిస్తే బాగుండేది. దేశం రోజురోజుకూ సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఆకాశంలోకి రాకెట్లను పంపించి ఏదో సాధించామని ప్రకటించుకునే ప్రభుత్వం ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి మీనమేషాలు లెక్కిస్తూ ఏవో సాకులు చెప్పడం వంటివి కళ్ళకు కట్టినట్లు చూపించాడు. రాకెట్‌తో సాంకేతిక పెరిగినా, బోరుబావిలో పడిన పిల్లను తీయడానికి బూజుపట్టిన పద్ధతుల్నే వుపయోగిస్తూ అందుకు ప్రభుత్వం కూడా సమర్థించుకోవడం వర్తమాన చరిత్రకు అద్దం పడుతుంది. మరోవైపు నిజాయితీగా కర్తవ్యాన్ని నిర్వర్తించే అధికారులకు లోకల్ రాజకీయాలు ఎలా అడ్డుతగులుతున్నాయి అనే అంశాలను స్పష్టంగా చూపించారు. సినిమాలోని అంశం చిన్నదైనా.. బావిలో పడివున్న చిన్నారిని కాపాడే ప్రయత్నాలను వాస్తవికంగా చూపించి కొన్ని సన్నివేశాల్లో కళ్ళలో నీళ్లు తిరిగే భావోద్వేగాన్ని, ఊపిరి బిగబట్టే ఉత్కంఠతను కలిగించారు. సినిమాటోగ్రఫర్ ఓం ప్రకాష్ కూడ దర్శకుడి విజన్‌కు తగ్గట్టు విజువల్స్‌ను హృదయాన్ని తాకేలా కెమెరాలో బంధించారు. సామాజిక అంశాలను, సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాన్ని, అధికారుల్లోని అలసత్వాన్ని, నిజాయితీతో పనిచేసే అధికారులపై రాజకీయ ఒత్తిళ్లను, గ్రామీణ, పట్టణ జీవితాల్లోని వ్యత్యాసాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిందీ చిత్రం. అయితే, ఇలాంటి వాస్తవికత కథల్లో వినోదం ఆశించడం కష్టమే అయినా.. అంతే వాస్తవంగా సర్పంచ్‌కు తగిన విధంగా బుద్ధిచెప్పే క్రమంలో కథను మరింత ఆసక్తికరంగా మలిస్తే బాగుండేది. ఇటీవలే ఓ నాయకుడు అన్నట్లు... ఐఎఎస్, ఐపీఎస్. చదవాలంటే కష్టంతో కూడిన పనే. అది అందరికీ సాధ్యపడదు. కానీ వారందరినీ శాసించాలంటే ఒక్క రాజకీయమే సరైన మార్గం. అందుకే ఈ సినిమాలో ప్రజలకు సేవ చేయాలంటే కలెక్టర్ కావాల్సిన అవసరంలేదంటూ.. తన పదవికి రాజీనామా చేసి ప్రజలకు సేవ చేసే వైపుగా వెళ్ళేట్లుగా నయనతార కదలికతో ముగింపు ఇవ్వడం విశేషం.



'సిరిమల్లె పువ్వా' ప్రారంభం




చిత్రాన్ని క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న ఈటెల, పక్కన చిత్ర దర్శకుడు, నిర్మాత

ఎస్. ఎమ్. క్రియేషన్స్ పతాకంపై మమత, నరేంద్ర, షఫీ, ప్రియ ప్రధాన పాత్రధారులుగా గౌతమ్. ఎమ్ దర్శకత్వంలో కౌసర్ జహన్ నిర్మిస్తున్న చిత్రం 'సిరిమల్లె పువ్వా'. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలంగాణ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు గౌతమ్ మాట్లాడుతూ.. "ఇదొక వెరైటీ చిత్రం. చక్కటి సందేశం కూడా ఉంటుంది. ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా మంచి కథ, కథనంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం. పేరుకు తగినట్లుగానే సిరిమల్లె పువ్వంత స్వచ్ఛంగా ఈ సినిమా ఉంటుందని అన్నారు. నిర్మాత కౌసర్ జహన్ మాట్లాడుతూ.. గౌతమ్ చెప్పిన కథ ఎంతగానో నచ్చింది. మంచి మెసేజ్ వుంది. మంచి కమర్షియల్ ఎలిమెంట్స్ వున్నాయి. రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని అన్నారు. మమత, నరేంద్ర, షఫీ, ప్రియ, జి. పుల్లారావు, దీప్తి, వీరు, కుమార్, గౌతమ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సూర్య, ప్రభాకర్, ఫిరోజ్, ఎడిటర్: నందమూరి హరి, సంగీతం: రామ్ మోహన్, ఆర్ట్ డైరెక్టర్: వాసుదేవరావు.

జర్నీ

చుట్టూ సముద్రపు కెరటాల హొయలు. మధ్య మధ్యలో పచ్చని ప్రకృతి అందాల నడుమ కనిపించే ఇసుకుతిన్నెల మెరుపులు. జనసంచారం తక్కువగా కనిపించే ఎన్నో ఆకర్షణీయమైన ప్రదేశాలు. చారిత్రక నేపథ్యం ఉన్న కట్టడాలు. ఉప్పునీటి అడుగున కనిపించే ఎన్నో జీవరాసులు. ఇవన్నీ చూడాలంటే అండమాన్ దీవులకు వెళ్లాల్సిందే! ఈ అందమైన దీవులను చూసేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ఔత్సాహిక పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు. చెన్నెయి నుంచి సముద్ర మార్గంలో సుమారుగా 1800 కిలోమీటర్లు దూరంలో ఈ అండమాన్ దీవులు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న ఈ దీవుల చరిత్ర, అక్కడి ప్రకృతి పర్యాటక విశేషాలు ఈ వారం 'జర్నీ'లో తెలుసుకుందాం!!



అండమాన్ అందాలు చూసొద్దాం!

మా అబ్బాయి సెలవులు రావడంతో సరదాగా ఎక్కడికైనా కుటుంబ సమేతంగా వెళ్లాలని నిర్ణయించుకున్నాం. అందుకోసం అండమాన్ నికోబార్ దీవులను ఎంపిక చేసుకున్నాం. ఓ ప్రైవేటు టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ఐదురోజుల పాటు అక్కడ సందర్శనకు ప్లాన్ చేశాం. ఉదయాన్నే అనంతపురం నుంచి బెంగళూరుకు చేరుకున్నాం. అక్కడి కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 11.30 గంటలకు విమానం ఎక్కి, రెండు గంటల సమయంలో పోర్ట్ బ్లెయిర్ ప్రాంతంలోని విమానాశ్రయం చేరుకున్నాం. విమానాశ్రయానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని ఓ త్రీస్టార్ హోటల్లో బస చేశాం. ఓ గంట విశ్రాంతి అనంతరం పోర్ట్ బ్లెయిర్‌లో ఉన్న కార్బైన్స్ కేవ్‌బీచ్‌ను సందర్శించి, సుదీర్ఘమైన సముద్రతీరం వెంబడి వెళ్ళి సెల్యులార్ జైలును సందర్శించాం. అక్కడి స్వాతంత్ర్య సమరయోధుల వీరగాథలను తెలుసుకున్నాం. స్వాతంత్ర్యానంతరం సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో ఫోర్‌ప్లే ప్రాంతంలో సెల్యులార్ జైలులో ఫ్రీడమ్ ఫైటర్లు ఉండడానికి అనుకూలంగా దీనిని మార్చారట! ఈ ప్రాంతంలో సుభాష్‌చంద్రబోస్ ప్రతిమలు, భారతీయ జెండాలు ఎక్కడ చూసినా కనిపిస్తాయి.



పోర్టు బ్లెయిర్

పోర్టు బ్లెయిర్

అండమాన్ దీవులలో జనసంచారం బాగానే ఉంది. అండమాన్ ఐలాండ్ ప్రజలు తీరానికి అతి సమీపంలో నివాసం ఉంటారు. అయితే, నికోబార్ దీవులలో మాత్రం మిలిటెంట్లు మాత్రమే ఉంటారు. ఈ ప్రాంతంలో చొరబాటుకు అవకాశం ఉండటంతో మిలిటరీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. మాల్దీవులు శ్రీలంకకు ఆనుకుని ఉంటాయి. మరుసటిరోజు హావలక్ ద్వీప తీరం, సముద్రపు అంచున కట్టబడిన రిసార్టులు, వందేళ్లకు పైన చరిత్ర కలిగిన చెట్లతో నిండిన అరణ్యాలు, సుప్రసిద్ధమైన రాధానగర్ బీచ్ సందర్శించాం. మూడవ రోజు ఎలిఫెంట్ బీచ్, పక్క ప్రాంతాలు, నాల్గవ రోజు రాజీవ్‌గాంధీ క్రీడా ప్రాంగణం, కారల్ దీవిలో సముద్ర అడుగుభాగంలో చేసిన ప్రయాణం జీవితంలో మర్చిపోలేం. అక్కడికి దగ్గరలో ఉంది రోస్ ఐలాండ్. ఈ దీవిలో పోలీసుల పర్యవేక్షణలో జెట్టీలు నడపబడతాయి. ఈ దీవిలో తమ పరిపాలన సాగించటానికి కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి బ్రిటీష్ వారు సెల్యులార్ జైలు నిర్మాణాన్ని పర్యవేక్షించేవారని స్థానిక గైడ్ వివరించారు. ఇటీవల సునామీ వచ్చిన సమయంలో పోర్టు బ్లెయిర్ ఈ దీవే కాపాడిందని చెప్పారు. ఈ దీవి లేకుంటే అండమాన్‌లోని ప్రముఖ ప్రాంతాలు సునామీలో కలిసిపోయి ఉండేవట! అలాగే, రోస్ ఐలాండ్ బ్రిటీష్ కాలంలో వారి పరిపాలనా కేంద్రాలలో ఒకటి. ఇదీ ప్రస్తుతం పోలీసుల పర్యవేక్షణలోనే ఉంది.


మ్యూజియం అక్వేరియం

కెరటాల హొయలు

గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డులో గుర్తింపు పొందిన హావలక్ రాధానగర్ బీచ్, మెయిల్ ఐలాండ్, ఫోర్‌ప్లే ఒక్కొక్కటిగా చుట్టేశాం. ఎక్కడి నుంచి చూసినా కనిపించే ఇసుక తిన్నెలు, చెవులకు ఇంపుగా వినిపించే అలల హొయలు మమ్మల్ని ఎంతగానో ఆకర్షించాయి. అండమాన్ దీవులలో ప్రధానంగా ఎనిమిది దీవులను సందర్శకులు వీక్షించేందుకు అనుకూలంగా ఉంటాయి. విమానమార్గంలో అయితే వీక్షకులు ఫోర్ ప్లే ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి దీవులను చూసేందుకు షిప్పులు, ఎసి ఫెరీస్‌లు అందుబాటులో ఉంటాయి. ఫెరీస్‌లో 200 మందికి పైగా ప్రయాణం చేయవచ్చు. అండమాన్ దీవులలో నెయిల్, హావలక్, రాజ్ ఐలాండ్, నార్త్ బే, జాలిబాయ్ ఐలాండ్, బ్రదర్స్ అండ్ సిస్టర్స్, సెల్లార్ జైల్, జపాన్ బాంబింగ్ పాయింట్, క్యూబా అండర్ సీవాక్, అక్వేరియం మ్యూజియం, భారాతంగ్ ప్రాంతాలను పెద్దఎత్తున వీక్షకులు సందర్శిస్తారు. భారాతంగ్ ప్రాంతంలో అగ్ని పర్వతం ఉంది. మిలిటరీ అనుమతి మేరకు దూరం నుంచి ఈ పర్వతాన్ని తిలకించవచ్చు.


సెల్యూలార్ జైల్

వివిధ రకాల ప్యాకేజీలు

అండమాన్ దీవులను సందర్శించటానికి అనేక ప్రముఖ ట్రావెలింగ్ సంస్థలు ప్యాకేజీలను అందుబాటులో ఉంచాయి. అంతర్జాలం ద్వారా ఆయా సంస్థల వెబ్‌సైట్లను సందర్శించి, ప్యాకేజీలను బుక్ చేసుకోవచ్చు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్ళు, పది పగళ్లు, పదకొండు రాత్రులు ఇలా అనేక ప్యాకేజీలు ఉన్నాయి. ప్రయాణంతో పాటు విడిది, ఆహారం ఇలా అన్ని విషయాలనూ ఆ సంస్థలే చూసుకుంటాయి. నేరుగా వెళ్లదలిచే వారికి విడిది కోసం ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. దీవులలో అనేకమైన స్టార్ విడిది గృహాలు, రెస్టారెంట్లు, హోటళ్ళు సాధారణ ధరల్లో అందుబాటులో ఉంటాయి. అలాగే, ఈ దీవులలో నార్త్, సౌత్, చైనీస్, జపనీస్ వంటి అనేకరకాల వంటకాలు అందుబాటులో ఉంటాయి. బెంగాలీ, మలయాళం, తమిళం, ఆంధ్రా ప్రాంతాల నుంచి ఎక్కువమంది ప్రజలు సందర్శన కోసం వస్తుంటారు.


ఎప్పుడెప్పుడు వెళ్లాలి?

అండమాన్ దీవులకు సాధారణంగా వర్షాకాలంలో తప్ప ఎప్పుడైనా వెళ్లొచ్చు. జనవరి నుంచి మే చివరకు, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో ఈ దీవులు రద్దీగా ఉంటాయి. అలాగే, ఈ కాలంలో ప్యాకేజీ ధరలు అధికంగా ఉంటుంది. ప్యాకేజీల ద్వారా సాధారణంగా టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ఐదు రోజుల ప్యాకేజీకి ఒక్కో మనిషికి రూ.20 వేల వరకూ ఖర్చవుతుంది. అమేజింగ్ అండమాన్ కోరల్ టూర్స్ అండ్ ట్రావెల్స్, మేక్ మై ట్రిప్, దామస్‌కుక్, యాత్ర.కామ్ తదితర అనేక టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. ఐదవ రోజు మేం చెన్నెయి నుంచి బెంగళూరుకు చేరుకుని, అక్కడి నుంచి అనంతపురం తిరిగి చేరుకున్నాం.




సేకరణ - వి. రవిచంద్ర,
అనంతపురం

కాలుష్యానికి దూరంగా సేద తీరుదాం!



వేసవి మొదలైంది. సరదాగా సేద తీరేందుకు పర్యాటక ప్రదేశాల అన్వేషణకు ఇదే సరైన సమయం. అలాంటి పర్యాటక ప్రేమికులకు కర్ణాటకలోని హసన్ ఎంతగానో ఆకర్షిస్తుంది. ఇక్కడ ఎక్కడ చూసినా పచ్చదనమే పలకరిస్తుంది. పేద ప్రజల ఊటీగా దీనికి పేరు. దేశంలోనే అతితక్కువ కాలుష్యం ఉన్న నగరం హసన్ అని ప్రపంచ ఆరోగ్యసంస్థ 2016లో ప్రకటించింది. సిక్కింలోని గ్యాంగ్‌టక్ కూడా కాలుష్యరహిత ప్రాంతం. ఒకవైపు హిమాలయాలు.. మరోవైపు చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి సౌందర్యం గ్యాంగ్‌టక్ ప్రత్యేకత. టిబెట్‌కు చెందిన బౌద్ధారామాలు అక్కడ ఉన్నాయి. వాటిని చూస్తుంటే ఆధ్యాత్మిక అనుభూతికి లోనవుతాం. హిమాలయాల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలి పీలిస్తే ప్రాణం లేచొచ్చినట్టు ఉంటుంది. సిక్కిం వెడితే అక్కడి నాథులా పాస్, సోమ్గో సరస్సులను తప్పకుండా చూడాలి. తమిళనాడులోని మధురై మరో అద్భుతనగరం. దీనికి 'ఏథెన్స్ ఆఫ్ ది ఈస్ట్' అని పేరు. ఇది భారతీయ అత్యంత పురాతన నగరాల్లో ఒకటి. కాలుష్యరహిత నగరాల్లో ఒకటిగా ప్రపంచ ఆరోగ్యసంస్థ దీన్ని గుర్తించింది. ఈ క్రెడిట్ అక్కడి స్థానిక ప్రజలకు దక్కుతుంది. మహారాష్ట్రలోని నాగపూర్ కూడా ఇండియాలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా పేరొందింది. ఇటీవల కాలుష్యం కొద్దిగా పెరగడంతో దీని నిర్మూలనకు అవసరమైన చర్యలను చేపడుతున్నారు. ఈ నగరంలో పార్కులు, గార్డెన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు భారీ సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. ★



'జర్నీ'కి ఆహ్వానం

మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.



మా చిరునామా
జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



ఎవరది ?


సదా ఆడుతూనే ఉంటుంది,
కానీ గడియారం కాదది,
రక్తాన్ని శుభ్రపరుస్తుంది,
అది ఆగితే ఆయువే పోతుంది?

జవాబు : గుండె

జోక్:

తండ్రి : చింటూ! నీ ఫ్రెండ్ బంటీకి ఎన్ని మార్కులు వచ్చాయి.?
చింటు : 99 వచ్చాయి నాన్నా!
తండ్రి : ఆ ఒక్కటి ఎటు పోయినట్టో..
చింటు : నాకు వచ్చింది నాన్నా!

నీడ కనిపెట్టండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని పండ్లు, వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ పండు ఏ నీడదో కనిపెట్టండి!

నీలిమేఘు.. విచిత్రాలు



ఆకాశంలో మేఘాలను చాలాసార్లు గమనించి ఉంటారు కదా?! ఆ మేఘాలు ఒక్కొక్కసారి మనుషుల్లా, జంతువుల్లా, పూలల్లా, భయపెట్టే బూచోడిలా, పేదరాశి పెద్దమ్మలా, పరుగులు తీసే జింకలా ఇలా ఎన్నెన్నో ఆకారాల్లో కనిపిస్తాయి. ఇలా కనిపించి, అలా మాయమయ్యే ఈ అపు'రూప' మేఘాల్ని ఫొటోలో బంధిస్తే, బాగుంటుంది కదా? 'ది క్లౌడ్ అప్రిసియేషన్ సంస్థ' అదేపని చేస్తోంది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన గావియన్ పీటర్ 2005వ సంవత్సరంలో 'ది క్లౌడ్ అప్రిసియేషన్ సంస్థ'ను ప్రారంభించారు. ఈ సంస్థ ఏం చేస్తుందంటే? ఆకాశంలోని మేఘాలు ఘడియ, ఘడియకు రూపాన్ని మార్చేస్తాయి. అలాంటి పలు భిన్నమైన మేఘాల రూపాలను ఫొటోలో బంధించి, భద్రపరుస్తుంది. ఈ సంస్థలో 165 దేశాలకు చెందిన 38 వేలకు పైగా సభ్యులు ఉన్నారు. దేశదేశాల్లోని సభ్యులు ఫొటోలు తీసి, సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఇందులో మేఘాలకు సంబంధించిన ఫొటోలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ఫొటోలన్నింటినీ కలిపి, పీటర్ ఒక పుస్తకమూ విడుదల చేశాడు. ఆ పుస్తకం పేరు 'ది క్లౌడ్ స్పాటర్స్ గైడ్'. పిల్లలూ ఇంకొక విషయం ఏమిటంటే ఈ పుస్తకం ఆధారంగానే బీబీసీ క్లౌడ్ స్పాటింగ్' అనే డాక్యుమెంటరీని తీసింది. ఈ సంస్థ వారు సభ్యులు పంపిన ఫొటోల్లో అత్యుత్తమమైన ఫొటోకు ప్రతినెలా బహుమతి అందిస్తారు. ★





వంకాయ పెళ్లి

ఫ్రెండ్స్ ఈ మధ్య మా స్నేహితురాలు ఒక పాట నేర్పింది. ఆ పాట నాకు చాలా నచ్చింది.

వంకాయ పెండ్లి కుదిరింది
కూరగాయల సందడి చూడండి
ఆనపకాయ రంగులు వేసింది
మునగకాయ ముగ్గులు పెట్టింది
పాలకూర పందిరి వేసింది
అరటికాయ అన్నం పెట్టింది
బంగాళదుంప భజ్జీలు చేసింది
తమలపాకు తాంబూలమిచ్చింది
జామకాయ జడలు వేసింది
పనసపండు పూలు పెట్టింది
బత్తాయి బట్టలు తెచ్చింది
బెండకాయ బ్యాండు కొట్టింది
టమాటా తాళి కట్టింది
ఉల్లిపాయ ఊరేగించింది
అందర్నీ చూసి
గుమ్మడికాయ గంతులేసింది
ఫ్రెండ్స్ మీకు నచ్చింది కదూ..!



వి. లక్ష్మీ ప్రసన్న
5వ తరగతి
శ్రీసాయి విజేత యుపి స్కూల్,
పుట్లూరు,
అనంతపురం జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

బంగ్లా బెబ్బులిలా..

ఆతిథ్య శ్రీలంకపై ఉత్కంఠ విజయం • ఫైనల్లో భారత్‌తో ఢీ



శ్రీలంక - 159/7 (20 ఓవర్లలో)
(కుశాల్ పెరీరా-61, పెరీరా-58 ;
ముస్తఫిజుర్ రహీమ్ 2/39)
బంగ్లాదేశ్ - 160/8 (19.5 ఓవర్లలో)
(తమీమ్ ఇక్బాల్-50,
మహ్మదుల్లా-43 (నాటౌట్) ధనంజయ 2/37)

కొలంబో : ఆతిథ్య శ్రీలంక జట్టుపై బంగ్లాదేశ్ ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ టోర్నీలో ఇప్పటికే ఒకసారి లంకపై గెలిచిన బంగ్లాదేశ్ నేటిమ్యాచ్‌లోనూ బెబ్బులిలా చివరి వరకూ పోరాడి సంచలన విజయం సాధించింది.

శుక్రవారం నిదహాస్ ట్రై సిరీస్‌లో భాగంగా ప్రేమదాస స్టేడియం వేదికగా శ్రీలంకతో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 160 పరుగులు సాధించి సంచలన విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగే టైటిల్‌పోరుకు పటిష్ట భారత్‌తో అమీ తుమీ తేల్చుకోనుంది. బంగ్లాదేశ్ బౌలర్లలో ముస్తాఫిజుర్ 2, షకీబ్, రుబెల్, మెహిదీ, సర్కార్ ఒక్కో వికెట్ పడగొట్టారు. బంగ్లా జట్టులో తమీమ్ ఇక్బాక్ అర్ధసెంచరీ సాధించగా... ముస్తఫిజుర్ రహీమ్ 28 పరుగులు చేశాడు. చివర్లో ఆల్‌రౌండర్ మహ్మదుల్లా కేవలం 18 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్ల సాయంతో 43 పరుగులు చేసి జట్టును గెలిపించి బంగ్లా జట్టును ఫైనల్లోకి చేర్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మదుల్లాకు లభించింది. వేలి గాయం కారణంగా గత మ్యాచుల్లో జట్టుకు దూరంగా ఉన్న బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్-అల్-హసన్ తిరిగి ఈ మ్యాచ్‌తో రంగప్రవేశం చేశాడు. శ్రీలంక జట్టు నుంచి సురంగా లక్మల్, దశుమంతా చమీరాను తొలగించి.. వీరి స్థానంలో అమిలా అల్ఫాన్సో, ఇసురు ఉడానాను తుది జట్టులోకి తీసుకున్నారు.

ఆదుకున్న పెరీరా ద్వయం

జట్టు స్కోర్ కేవలం 41 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న శ్రీలంక జట్టును పెరీరా ధ్వయం ఆదుకుంది. కుశాల్ పెరీరా-తిషారా పెరీరాల ధ్వయం ఆరో వికెట్‌కు అమూల్యమైన 97 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. కుషల్ పెరీరా(61), తిషారా పెరీరా(58) జట్టుకు అండగా నిలిచారు.

చివరి ఓవర్లో ఉత్కంఠ...

చివరి ఓవర్లో 12 పరుగులు చేయాల్సిన బంగ్లాదేశ్ ఉడానా వేసిన తొలి రెండు బంతుల్లో పరుగులేమీ చేయలేదు. ఆ రెండు బంతులు బ్యాట్స్‌మన్ తలపైనుండి కీపర్ చేతుల్లోకి వెళ్ళాయి. రెండో బంతికి రహమాన్ రనౌట్ అయ్యాడు. ఆ బంతి బ్యాట్స్‌మన్ తలపైనుండి వెళ్ళిన కారణంగా నోబాల్‌గా ప్రకటించాలని బంగ్లా బ్యాట్స్ మన్లు పట్టుబట్టారు. మూడో అంపైర్ సైతం సరైన బంతిగా నిర్ధారించి బ్యాట్స్‌మన్ అవుటైనట్లు ప్రకటించాడు. ఈ గందరగోళం కారణంగా కొంతసేపు మ్యాచ్ నిలిచిపోయింది.



వారెవ్వా సింధు

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ సెమీస్‌కు

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీ సెమీఫైనల్లోకి పీవీ సింధు ప్రవేశించింది. శుక్రవారం క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌కు చెందిన ఒకుహరాతో తలపడిన సింధు మూడు సెట్ల ఉత్కంఠపోరులో విజయం సాధించింది. చివరి వరకూ ఉత్కంఠ భరితంగా సాగిన మహిళల క్వార్టర్ ఫైనల్ పోరులో సింధు 20-22, 21-18, 21-18 తేడాతో జపాన్ క్రీడాకారిణి ఒకుహరాపై గెలిచి ఊపిరిపీల్చుకుంది. ఈ మ్యాచ్ ఒక గంటా 24 నిమిషాల పాటు జరిగిన ఈ పోటీలో విజయం చివరికి సింధునే వరించింది. ప్రతీ పాయింట్ కోసం ఇరువురి క్రీడాకారిణల మధ్య నువ్వా-నేనా అన్నట్లు సాగిన మొదటి గేమ్‌ను సింధు స్వల్ప తేడాతో తొలి సెట్ కోల్పోయింది.

ఇక రెండో గేమ్‌లో తొలి అర్ధం భాగం వరకూ ఇరువురి మధ్య ఆసక్తికర పోరు సాగింది. కాగా, చక్కటి ప్లేస్‌మెంట్స్‌తో ఆకట్టుకున్న సింధు.. ఒకుహరాను ఒత్తిడిలోకి నెట్టింది. ఈ క్రమంలోనే రెండో గేమ్‌ను 21-18తో గెలిచి సమం చేసింది. అయితే మూడో గేమ్‌లో మాత్రం ఒకుహరా నుంచి సింధుకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఒకుహరా సుదీర్ఘ ర్యాలీలతో సింధును ఇబ్బంది పెట్టే యత్నం చేసింది. అయితే దాన్ని తన అనుభవంతో అధిగమించిన సింధు గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకుంది. ఫలితంగా ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీలో తొలిసారి సింధు సెమీస్‌లోకి ప్రవేశించి కొత్త చరిత్రను లిఖించింది.

పోరాడి ఓడిన శ్రీకాంత్

గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 3వ సీడ్ కిదాంబి ఓటమి చవిచూశాడు. చైనాకు చెందిన హుయాంగ్‌తో తలపడిన శ్రీకాంత్ 11-21, 21-15, 20-22 పాయింట్ల తేడాతో పోరాడి ఓడాడు.

చివర్లో ఒత్తిడికి గురైన శ్రీకాంత్ 20-22తో ఆ గేమ్‌ను ఓడిపోవడంతో టోర్నీ నుండి నిష్క్రమించాల్సి వచ్చింది. ఇక పురుషుల విభాగంలో భారత్‌కు చెందిన మరో ఆశాకిరణం ప్రణయ్‌రాయ్ క్వార్టర్‌ఫైనల్లో చైనాకు చెందిన అన్‌సీడెడ్ హంగ్‌తో తలపడనున్నాడు.

మహిళల సెమీఫైనల్స్..
పీవీ సింధు (భారత్) × యమగుచి (జపాన్)
తుఇంగ్-థాయ్(తైవాన్) × చెన్-యుఫి(చైనా)
(మధ్యాహ్నం 2.30 గంIIల నుంచి)

అమ్మకానికి ఐపీఎల్ టిక్కెట్లు

ముంబయి: ఈ ఏడాది ముంబయి ఇండియన్స్ తలపడే ఐపీఎల్ టిక్కెట్ల అమ్మకాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 7న ముంబయిలోని వాంఖడే స్టేడియంలో ప్రారంభ వేడుకలు... అనంతరం ముంబయి-చెన్నైల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబయి ఇండియన్స్ టిక్కెట్లు అమ్మకానికి పెట్టింది. ఆన్‌లైన్‌ద్వారా ఈ టిక్కెట్లను పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. 'సొంతగడ్డపై ముంబయి ఇండియన్స్ ఆడే ప్రతి మ్యాచ్ టిక్కెట్లు అందుబాటులో ఉంచాం. టిక్కెట్లు కావల్సిన వారు www.mumbaiindians.com వెబ్‌సైట్ నుండి కూడా పొందవచ్చని... రూ.800 నుంచి రూ.8వేల మధ్య టిక్కెట్ ధరలు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 14న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లను మాత్రం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచట్లేదు. ఎందుకంటే రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు ఈ మ్యాచ్ చూసే అవకాశం కల్పించనున్నాం' అని తెలిపారు.



విదర్భ - 702/5

రెస్టాఫ్ ఇండియాతో ఇరానీట్రోఫీ


నాగ్‌పూర్ : రెస్టాఫ్ ఇండియా-విదర్భ జట్ల మధ్య జరుగుతున్న ఇరానీ ట్రోఫీలో విదర్భ జట్టు భారీస్కోర్ సాధించింది. శుక్రవారం మూడోరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 702 పరుగుల భారీస్కోర్ చేసింది. వసీం జాఫర్ 286 పరుగులు చేసి కౌర్ బౌలింగ్‌లో బోల్డ్ అవ్వగా... గణేష్ సతీష్ (120), వాడ్కర్ (37) పరుగులు చేసి పెవీలియన్‌కు చేరారు. వాంఖడే (99) పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. ఇప్పటికే మూడురోజుల ఆట ముగియడంతో మ్యాచ్ డ్రా అయ్యే అవకాశముంది.

లోథా సిఫార్సుల అమలుకు కలిసి పనిచేద్దాం

• సిఓఎకు అమితాబ్ చౌదరి లేఖ



అమితాబ్ చౌదరి



వినోద్ రాయ్

ముంబయి : లోథా కమిటీ సిఫార్సుల అమలుకు కలిసి పనిచేద్దామని సుప్రీం కోర్టు నియమిత పాలకుల కమిటీ (సిఓఏ)కు బిసిసిఐ కారదర్శి అమితాబ్ చౌదరి లేఖ రాసారు. ప్రసుత్తం బిసిసిఐ ఆఫీస్ బేరర్లకు, సిఓఎకు వివాదం నడస్తున్న నేపథ్యంలో అమితాబ్ చౌదరి ఈ లేఖ రాయడం సంచలనంగా మారింది. లోథా సిఫార్సుల అమలుకు బిసిసిఐ ఆఫీసు బేరర్లతో కలిసి సిఓఏ పని చేయాలని ఈ లేఖలో చౌదరి విజ్ఞప్తి చేశారు. సిఓఏ కొన్ని సంవత్సరాల నుంచి కొనసాగుతున్నా లోథా కమిటీ సిఫార్సుల అమలుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని కూడా ఈ లేఖలో చౌదరి ఘాటుగా విమర్శించారు. ఆరు పేజీల ఈ లేఖ ప్రతులను చౌదరి బోర్డు అధ్యక్షుడు సికె ఖన్నా, సిఈఓ రాహుల్ జోహ్రిలకు కూడా పంపారు.

బిసిసిఐ ఆఫీస్ బేరర్ల అధికారాలన్నింటికీ సిఓఏ కోత వేసిన సంగతి తెలిసిందే. బోర్డు అధ్యక్షుడు సికె ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరిలు సొంతంగా ఏ నిర్ణయం తీసుకునే అవకాశం లేకుండా సిఓఏ చేసింది. అంతేకాకుండా వీరు బోర్డు నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయికీ తమ అనుమతి తీసుకోవాలని వినోద్ రాయ్ నేతృత్వంలోని సిఓఏ షరతు కూడా విధించింది. అలాగే సుప్రీంకోర్టుకు సమర్పించిన తాజా నివేదికలో వీరిని పదవుల్లో నుంచి తొలగించాలని కూడా సిఫార్సు చేసినట్లు సమాచారం.

సెమీస్‌లో ఫెదరర్

ఇండియన్‌వేల్స్ టోర్నీ



ఇండియన్‌వేల్స్ : స్విట్జర్లాండ్‌కు చెందిన టాప్‌సీడ్ రోజర్ ఫెదరర్ ఇండియన్‌వేల్స్ టోర్నీ సెమీఫైనల్లో ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణకొరియాకు చెందిన 23వ సీడ్ హుయాన్ చంగ్‌తో తలపడి 7-5, 6-1 సెట్ల తేడాతో గెలుపొందాడు. ఫెదరర్ గత ఏడాది మూడు గ్రాండ్‌శ్లామ్‌లు గెలుచుకోవడమే కాక ప్రపంచ నెంబర్ వన్ ర్యాంక్‌ను సైతం సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరో క్వార్టర్‌ఫైనల్‌లో క్రొయేషియాకు చెందిన బొర్నా కోరిక్ 7వ సీడ్ అండర్సన్‌పై 2-6, 6-4, 7-6(7-3) సంచలన విజయం సాధించి సెమీస్‌లో ఫెదరర్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

నిర్మాణ నివేదికపై రెండురోజులపాటు సిపిఎం పొలిట్ బ్యూరో చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

22వ అఖిల భారత మహాసభల్లో ప్రవేశపెట్టనున్న నిర్మాణ నివేదికకు తుది రూపం ఇచ్చేందుకు సిపిఎం సన్నద్ధమైంది. నిర్మాణ నివేదికపై చర్చించేందుకు రెండు రోజుల పాటు జరిగే సిపిఎం పొలిట్ బ్యూరో సమావేశాలు శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయం(ఎకెజి భవన్)లో ప్రారంభమైనాయి. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బిమన్ బసు, రామచంద్రన్ పిళ్లై, మానిక్ సర్కార్, బృందా కరత్, పినరయి విజయన్, బి.వి రాఘవులు, సూర్య కాంత్ మిశ్రా, కొడియరి బాలకృష్ణన్, ఎం.డి సలీం, సుభాషిణీ అలీ, ఎం.ఎ బేబి, ఎకె పద్మనాభన్, హన్నన్ మొల్లా, జి.రామకృష్ణన్‌లు హాజరయ్యారు. హైదరాబాద్‌లో ఏప్రిల్ 18 నుంచి 22వరకు జరగనున్న సిపిఎం 22వ అఖిల భారత మహాసభల్లో ప్రవేశపెట్టనున్న నిర్మాణ నివేదికపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చిస్తారు. పార్టీ నిర్మాణంపై పొలిట్ బ్యూరో తయారు చేసిన రిపోర్టు ఈ నెల 28 నుంచి జరగబోయే కేంద్ర కమిటీ సమావేశాల్లో ప్రవేశపెడతారు. కేంద్ర కమిటీ సుదీర్ఘంగా చర్చించి, ఆమోదించిన తరువాత అఖిల భారత మహాసభల్లో రిపోర్టును ప్రవేశపెడతారు. ఇప్పటికే గత కలకత్తాలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించిన రాజకీయ ముసాయిదా తీర్మానం ఇప్పటికే పార్టీ సభ్యులకు చేరింది. ఇప్పటికే రాజకీయ ముసాయిదాపై ఆయా శాఖల పరిధిలో చర్చలు జరుగుతున్నాయి. అన్ని ప్రాంతీయ భాషల్లో విడుదల చేసిన రాజకీయ ముసాయిదాపై పార్టీ సభ్యులు చర్చించి సవరణలు కూడా పంపేందుకు ఈ నెల 20 వరకు గడువు ఉంది.

ఉత్పత్తి మిగులు కేంద్రీకరణ వల్లే దేశాభివృద్ధికి ఆటంకం

డాక్టర్ రవి సిన్హా



ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు)

మార్క్స్ జీవించే నాటికి భారతదేశ గ్రామాల్లో భూమి వ్యక్తుల చేతుల్లోకి మారిందని, అయితే ఉత్పత్తి మిగులును పట్టణాల్లోని కొందరు స్వాధీనం చేసుకోవడం, విలాసాలకు వాడుకోవడంతో దేశాభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ రవి సిన్హా (ఢిల్లీ) వివరించారు. 'భారతదేశం - చరిత్ర - ఆధునికత - కార్ల్ మార్క్స్' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ సైంటిఫిక్ సోషలిజం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అంజయ్య అధ్యక్షత వహించారు. భారతదేశం గురించి జర్మనీకి చెందిన హెగెల్ పేర్కొన్న అంశాలను ప్రస్తావించారు. 'భారతదేశం దశాబ్దాల తరబడి మార్పులకు లోనవ్వకుండా నిశ్చలంగా ఉందని, ఇక్కడివారిలో స్వీయస్పృహ లేకపోవడమే ఇందుకు కారణంగా హెగెల్ పేర్కొన్నట్లు చెప్పారు. అనంతరం మార్క్స్ నిర్ధారణలనూ ప్రస్తావించారు. భారతదేశంలో మార్పు రాకపోవడానికి కారణంగా గ్రామాల్లో భూమి పేదల చేతుల్లో లేకపోవడంగా మార్క్స్ భావించినట్లు చెప్పారు. శ్రమ విభజన అనంతరం ఉత్పత్తి మిగులు రాజ్యం చేతుల్లోకి వెళ్లడం మరో కారణంగా పేర్కొన్నట్లు చెప్పారు. అయితే మార్క్స్ తన అభిప్రాయాల్లో కొన్నింటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ప్రముఖ మార్క్సిస్ట్ చరిత్రకారుడైన ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయాలనూ వివరించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం ప్రధానంగా పాశ్చాత్య ఆధునికతకు చెందిన తాత్విక భావాల ద్వారా ప్రేరణ పొందిందని, అదే సమయంలో సంప్రదాయక మత భావాల ప్రభావమూ కొంత ఉందని చెప్పారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయడం ద్వారా సమాజానికి, రాజ్యానికి సన్నిహిత సంబంధం తేగలిగారని విశదీకరించారు. అయితే సమాజాన్ని ఆధునీకరించడం ద్వారానే నిజమైన ప్రజస్వామ్య దేశంగా, లౌకిక రాజ్యంగా రూపుదిద్దుకోగలదన్నారు. కుల, మత సమస్యలను అధిగమించాలంటే ఆధునికతకు సంబంధించిన భావాలను రాజ్య పాలన, సామాజిక జీవనంలోనూ తేవాల్సిన అవసరం ఉందని విశ్లేషించారు.

ఇతర రాష్ట్రాల నేతలతో బాబు మంతనాలు

మహానాడులో కొత్త ఫ్రంట్ ప్రకటించే యోచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావుకు దీటుగా ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా మరో ఫ్రంట్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుసోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వివాదం నేపథ్యంలో నాలుగేళ్ల మైత్రీ బంధాన్ని తెగదెంపులు చేసుకున్న ఆయన కొత్త ఫ్రంట్ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. వచ్చే మే నెలలో జరిగే మహానాడులో ఈ ఫ్రంట్‌ను ప్రకటించే అవకాశాలున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటి నుంచీ చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అయితే ఇదింకా ప్రాథమిక ఆలోచేనని, త్వరలోనే పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చే అవకాశాలున్నాయని వారు పేర్కొంటున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చిన తెలుగుదేశం తాజాగా ఎన్‌డిఎ కూటమి నుంచి కూడా బయటకు రావాలని నిర్ణయించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో బిజెపితో పొత్తు లేకుండా ఒంటరిగానే వెళ్లాలన్న నిర్ణయానికి దాదాపుగా వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వైకాపా ప్రధాన ప్రత్యర్థిగా ఉండగా, ఇతర పార్టీల మద్దతు కూడా టిడిపికి లభించే అవకాశాలైతే కనిపించడం లేదు. ఇదే సమయంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టడంతో ఇక సంబంధాలు తెగిపోయినట్టేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తానే స్వయంగా ఒక ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలనే భావాన్ని చంద్రబాబు వ్యక్తం చేస్తుండగా, పార్టీ నేతలు కూడా దీనికి మద్దతు పలుకుతున్నట్లు తెలిసింది. గత రెండు రోజులుగా సాగుతున్న అంతర్గత, వ్యూహ కమిటీ సమావేశాల్లో ఫ్రంట్ అంశం ప్రాథమికంగా వర్చకు వచ్చినట్లు తెలిసింది. గతంలో ఎన్టీ రామారావు కూడా నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు సమయంలో మహానాడు వేదికను కీలకంగా వాడిన విషయాన్ని కొందరు మంత్రులు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో సుర్జీత్‌సింగ్ బర్నాలా, బర్దన్, దేవీలాల్ వంటి సీనియర్ నేతలను మహానాడుకు ఆహ్వానిం చారంటున్నారు. చంద్రబాబు కూడా మహానాడుకు జాతీయ స్థాయిలో పేరొందిన, ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు నాయకులను ఆహ్వానించే



అవకాశాలున్నాయని సీనియర్ మంత్రి ఒకరు చెప్పగా, త్వరలోనే ఆయా నేతలతో చంద్రబాబు నేరుగా మంతనాలు జరిపే అవకాశముందని మరో మంత్రి వెల్లడించారు. ఇదిలావుండగా కెసిఆర్ ఇప్పటికే ఈ దిశగా ముందడుగు వేసినందున, ఆ ఫ్రంట్‌కు చంద్రబాబు మద్దతు ఇస్తారని, అవకాశం ఉంటే నేతృత్వం వహిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే కెసిఆర్ ఫ్రంట్‌కు మద్దతు ఇవ్వడం కన్నా నేరుగా కొత్త ఫ్రంట్‌కు శ్రీకారం చుడితే ఎలా ఉంటుందన్న కోణంలో చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇకనైనా చంద్రబాబు వైఖరి మార్చుకోవాలి

వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇకనైనా తన వైఖరి మార్చుకోవాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాలని వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కోరారు. విజయవాడ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నిన్నటి వరకూ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఉంటుందని చెప్పిన చంద్రబాబు హఠాత్తుగా వైసిపి పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వమని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు.

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన చంద్రబాబుకు జగన్‌ను విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. బ్యాంకులను మోసం చేసిన రాయపాటి, గంటా, వాకాటిలను పక్కన పెట్టుకున్న చంద్రబాబు వైసిపిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. మీ పార్టనర్ పవన్ కల్యాణ్ చేసిన సవాల్‌ను స్వీకరించి జగన్ కేంద్రంపై అవిశ్వాసం పెడుతున్నారన్నారు. టిడిపికి చిత్తశుద్ధి ఉంటే వైసిపి ప్రవేశపెట్టే అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలన్నారు.



భావి తరాలకు స్ఫూర్తి స్టీఫెన్ హాకింగ్

సంస్మరణ సభలో ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశ్వమానవ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జీవితం శాస్త్ర పరిశోధకులు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఎంబివికెలో శుక్రవారం సాయంత్రం జన విజ్ఞాన వేదిక, ఎంబి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా స్టీఫెన్ హాకింగ్ సంస్మరణ సభ నిర్వహించాయి. హాకింగ్ సుదీర్ఘకాలం అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఖగోళ శాస్త్రం, గణితశాస్త్రం లోతులను పరిశీలించారని బాలసుబ్రహ్మహ్మణ్యం తెలిపారు. పుట్టుక, ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ లాంటి మూఢనమ్మకాలను, అశాస్త్రీయతను ప్రశ్నించిన గొప్ప వ్యక్తి హాకింగ్ అన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు శ్రీకుమార్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలే రాకెట్ ప్రయోగ నమూనాలను ఆలయాల్లో పూజలు చేయించడం దురదృష్టకరమన్నారు. ఎంబివికె కన్వీనరు పిన్నమనేని మురళీకృష్ణ, వికాస్ విద్యావనం అధినేత పరిమి, ఓపిడిఆర్ నాయకులు కె.కోటేశ్వరరావు, సోషలిస్టు నాయకులు వివి కృష్ణారావు, జెవివి రాష్ట్ర నాయకులు కె.శశికుమార్ తదితరులు స్టీఫెన్ హాకింగ్ కృషిని కొనియాడారు.

ఎన్‌డిఎతో టిడిపి కటీఫ్

బిజెపి అధ్యక్షులు అమిత్‌షాకు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌డిఏతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. అయితే నాలుగేళ్లుగా కలిసుండి ఇప్పుడు ఎందుకు వైదొలుగుతున్నామో వివరిస్తూ బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షాకు లేఖ రాశారు. శుక్రవారం ఉదయం పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా టిడిపిని దెబ్బకొట్టేందుకు కుట్రలు చేస్తోందని అందువల్లే తప్పుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే కుట్రలు చేసే వారికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పొలిట్‌బ్యూరో సభ్యులు చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతించారు. నందమూరి హరికృష్ణ కూడా మంచి నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. కేంద్రం చర్యలతో నీరవ్ మోడీ లాంటి వాళ్లు దేశం దాటిపోతున్నారని, నిందితులు పిఎంఓలో దాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అమిత్‌షాకు రాసిన లేఖలో రాష్ట్రానికి న్యాయం చేస్తారని ఐదుకోట్ల మంది ఎదురు చూశారని, జరగకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్‌డిఏ నుండి వైదొలుగుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు న్యాయమైనవి : పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి అమరావతి బ్యూరో

జర్నలిస్టుల సమస్యలు న్యాయమైనవని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రెస్‌క్లబ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు ధర్నా చేస్తామని ప్రకటించగానే రూ.100 కోట్లు విడుదల చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం కూడా ఉత్తుత్తి పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు సాధించుకునేందుకు జర్నలిస్టులు కూడా పోరాడాలని సూచించారు. వారి పోరాటానికి జనసేన అండగా ఉంటుందని ఆయన తెలిపారు. పవన్‌కళ్యాణ్‌కు ప్రెస్‌క్లబ్ వద్ద ఐజెయు నాయకులు అంబటి ఆంజనేయులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జయరాజ్ తదితరులు ఆహ్వానం పలికారు. పవన్‌కళ్యాణ వెంట సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ కూడా ఉన్నారు. అంతకుముందు ధర్నా చౌక్‌లో ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యాన నిరాహారదీక్షకు ఉపక్రమించగా రాష్ట్ర ప్రభుత్వం నుండి కబురు రావడంతో నాయకత్వం అక్కడకు వెళ్లిపోయారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68